

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




## జగన్‌రెడ్డి దగా చరిత్ర

శాప్‌చైర్మన్ అనిమిని, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి, శ్రీకాంత్ ధ్వజం

- వివరాలు 7 లో..

## భవిష్య అమరావతికి
# అర్బన్ మొబిలిటీ ప్లానింగ్




- హైకోర్టు భవనాల వద్ద రూ.547 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పనకు నిర్ణయం
- భవనాలు, అక్రమ నిర్మాణాల వివాదాల పరిష్కారానికి ప్రత్యేక ట్రైబ్యునల్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్
- ఎకనామిక్ రీజియన్ ఆర్‌ఎఫ్‌పీకి అంగీకారం
- ఏపీసీఆర్డీఏకు సొంతంగా అగ్నిమాపక విభాగం
- అనువుగా లేని ప్లాట్లకు గ్రామకంఠంలో 5 సెంట్లు
- రాజధాని పరిధిలో పేదలకు గృహ సముదాయాలు
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన 61వ అథారిటీ సమావేశం
- 18 అంశాలపై చర్చించి ఆమోద ముద్ర

3

రాజధానిలో భవిష్యత్ నగర నిర్మాణానికి అనుగుణంగా అర్బన్ మొబిలిటీ ప్లానింగ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్ర బాబు అధ్యక్షతన 61వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. సీఆర్డీఏ ప్రతిపాదించిన 18 అంశాలపై అథారిటీ సమావేశంలో చర్చించి ఆమోదాన్ని తెలిపారు. రూ.547.07 కోట్ల వ్యయంతో హైకోర్టు భవనాలకు మౌలిక సదుపాయాల కల్పన, అనువుగాలేని ప్లాట్లకు గ్రామకంఠంలో 5 సెంట్లు, పేదల నివాసానికి గృహ సముదాయాలు ఏర్పాటు చేయాలని సీఆర్డీఏ నిర్ణయించింది. అమరావతి ప్రాంతంలో భవనాలు, అక్రమ నిర్మాణాల వివాదాల పరిష్కారం కోసం ప్రత్యేక ట్రైబ్యునల్, 9 జిల్లాలకు విస్తరించిన అమరావతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధికి సంబంధించి ప్రణాళి క రూపకల్పన కోసం ఆర్‌ఎఫ్‌పీ తయారు చేసేందుకు ఆమోదం తెలిపారు.


## నేటి తరానికీ
# వైఎస్ కుటుంబ అరాచకాలు

- ప్రజలు గొడ్డలి పార్టీ అంటుంటే సైకోలో ఫ్రస్టేషన్
- వివేకా కేసులో సునీత పోరాటంలో న్యాయం ఉంది
- డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్‌తో పెనుమార్పులు
- త్వరలోనే బిల్లులు తీసుకొచ్చేందుకు కేంద్రం సిద్ధం
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం చంద్రబాబు



4

వైఎస్ కుటుంబ అరాచకాలు ఎన్నెన్నో వెలుగులోకి వస్తున్నాయి.. గొడ్డలి పార్టీ అని ప్రజల్లోకి వెళ్లే కొద్ది సైకోలో ఫ్రస్టేషన్ పెరుగుతోందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మంగళగిరి ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో ఇష్టాగోష్ఠిగా ముచ్చటించారు. డీ లిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులపై కీలక వ్యాఖ్యలు చేశారు. టీడీపీ ప్రకటించిన 33శాతం రిజర్వేషన్లు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులు కలిపి వస్తేనే మహిళలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం మహానాడు విజయంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రత్యేకంగా అభినందించారు.



## రేపు కాకినాడ జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన

- తుని నియోజకవర్గం చామవరంలో 'ప్రజా వేదిక'
- ప్రజలతో మమేకం కానున్న చంద్రబాబు
- ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సిద్ధం

4

ముఖ్యమంత్రి చంద్రబాబు జూన్ ఒకటో తేదీన కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో పర్యటించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొంటారు. తుని మండలం చామవరంలో సీఎం పర్యటన కోసం అధికారం యంత్రాం గం భారీ ఏర్పాట్లు చేస్తోంది. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, కలెక్టర్ హరేందిరప్రసాద్ ఏర్పాట్లను పరిశీలించారు.

# ఏపీలో పీఎం సేతు పథకం

- దేశంలోనే తొలిసారిగా అమలు
- కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ నిర్ణయం
- ఆంధ్రప్రదేశ్‌కు అరుదైన గుర్తింపు
- 'స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్'కు ఆమోదం
- మారనున్న విశాఖ ఐటీఐల రూపురేఖలు
- విద్యార్థులకు ఆధునిక సాంకేతిక శిక్షణ

3




దేశంలోనే తొలిసారిగా పీఎం సేతు(PM-SETU పథకం అమలు చేయనున్న రాష్ట్రంగా ఏపీ నిలిచింది. ఆ ఘనత లభించిన మొట్టమొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అరుదైన గుర్తింపు సాధించింది. ఈ మేరకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ జాతీయ స్టీరింగ్ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయం తీసు కుంది. విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్‌కు సంబంధించిన 'స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్'కు కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో విశాఖ ఐటీఐల రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఐటీఐ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక శిక్షణ అందించడం ఈ పథకం ప్రధాన లక్ష్యం.



# ప్రతిష్ఠాత్మకంగా యోగాంధ్ర

- జూన్ 21న కృష్ణానది వంతెనపై నిర్వహణ
- అమరావతిలో 25 వేల మందితో ఆసనాలు
- జూన్ 7 నుంచి 14 రోజుల పాటు
- రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలకు సిద్ధం
- వెయ్యి మందితో జిల్లా కేంద్రాల్లో ఈవెంట్స్
- కోటి మంది భాగస్వామ్యానికి కార్యాచరణ
- యోగా డేపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2

# పారదర్శకంగా మెగా డీఎస్సీ..

- నిజాలనే రిపోర్ట్ చేయండి.. అవాస్తవాలు నమ్మొద్దు
- తప్పుడు కథనాలపై రిక్రూటైన టీచర్లు బాధపడొద్దు
- ఉద్యోగాలు దక్కించుకున్న వారంతా కష్టపడి చదివిన వారే
- నిబంధనల ప్రకారమే స్పోర్ట్స్ కోటాలో నియామకాలు
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగి నవీన్ కేసులో కోర్టులు చెప్పినట్లే నడుచుకున్నాం
- అన్ని జిల్లాల స్కోర్స్ ముందుగానే పబ్లిష్ చేశాం
- లీకేజీ అనే ప్రశ్నే ఉత్పన్నం కాదు
- ప్రతిష్టాత్మక టీసీఎస్ ఐయాన్‌తో మెగా డీఎస్సీ నిర్వహణ
- తప్పుడు ప్రచారం చేసిన వారిపై కేసులు పెడతాం
- పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్



- వివరాలు 10 లో..

# ప్రతిష్టాత్మకంగా యోగాంధ్ర

- జూన్ 21న కృష్ణానది వంతెనపై నిర్వహణ
- అమరావతిలో 25 వేల మందితో ఆసనాలు
- జూన్ 7 నుంచి 14 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు
- వెయ్యి మందితో జిల్లా కేంద్రాల్లో ఈవెంట్స్
- కోటి మంది భాగస్వామ్యానికి కార్యాచరణ
- యోగా డేపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా యోగాంధ్ర-2026 నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా డే నిర్వహ ణకు సంబంధించి మంత్రులు, అధికారులతో సీఎం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా యోగాంధ్ర 2026పై తలపెట్టిన కార్యక్ర మాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. యోగాంధ్ర -2026 కార్యక్రమంలో భాగంగా జూన్ 7 నుంచి 14 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాజధాని అమరా వతిలో 25 వేల మందితో నిర్వహించే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారు. రాజధాని ప్రాంతంలోని కృష్ణా నది వంతెనపై యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వెస్ట్ బైపాస్ రోడ్ నిర్మాణంలో భాగంగా నదిపై నిర్మించిన బ్రిడ్జిపై ఇంటర్నేషనల్ యోగా డే జూన్ 21న నిర్వహి స్తారు. అలాగే అదేరోజు జిల్లా కేంద్రాల్లో 1000 మందితో నిర్వహించే కార్యక్ర మాల్లో మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాల్లో, అన్ని స్థాయిల్లో, అన్ని విభాగాల్లో నిర్వహించాలని సీఎం సూచించారు. మొత్తంగా కలిపి కోటి మంది భాగస్వాములు అయ్యేలా కార్యాచర ణ సిద్ధం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న 1.50 లక్షల మంది ట్రైనర్లకు అందనంగా మరో లక్ష మందిని ట్రైనర్లుగా చేసేందుకు అవసరమైన శిక్షణ ఇస్తారు. ఒక జిల్లా ఒక థీమ్‌తో 14 రోజుల యోగాంధ్ర నిర్వహిస్తారు. జిల్లాల్లో యోగాంధ్ర నిర్వ హణకు జిల్లాకు రూ.25 లక్షల చొప్పున నిధులు కేటాయించారు.



## అన్ని శాఖల సమన్వయం.. కోటి మంది భాగస్వామ్యం

ఆరోగ్య, మానవవనరులు, మునిసిపల్, పంచాయతీరాజ్, దేవాదాయ, ఐటీ శాఖల సమన్వయంతో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతి జిల్లాలోని రెండు ప్రముఖ టూరిస్టు ప్రాంతాల్లో అంటే 56 టూరిస్టు కేంద్రాల్లో ప్రత్యేక సెషన్స్ నిర్వహి స్తారు. ఒకరోజు రెండు జిల్లాల చొప్పున 500 మందితో టూరిస్టు ప్రాంతాల్లో యోగా నిర్వహిస్తారు. అలాగే 14 రోజుల పాటు పార్కులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామం కార్యాలయాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహి స్తారు. యోగాంధ్ర ఈవెంట్స్‌కు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా నుంచి రాష్ట్రస్థాయి వరకు అవార్డులు చేస్తారు.


## మంతెన సత్యనారాయణరాజు ప్రత్యేక వీడియోలు


రాష్ట్ర ప్రభుత్వ యోగా, నాచురోపతి విభాగ సలహాదారు మంతె న సత్యనారాయణరాజు యోగాంధ్ర నిర్వహణకు సంబంధించి రూపొందించిన పోస్టర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించా రు. యోగాపై అవగాహనకు, శిక్షణకు తాను చేపట్టిన కార్యక్ర మాలను సత్సనారాయణరాజు సీఎంకు వివరించారు. 90 ఆసనా ల వీడియోలు, 21 ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఆసనా లు వీడియోలు, రోజువారీ సాధన కోసం యోగాసనాలు, ప్రాణా యామంపై 7 వీడియోలు, యోగా సందేహాలు ప్రశ్నలు-సమా ధానాలపై చేసిన వీడియోలను పబ్లిక్ డొమైనులో పెట్టనున్నట్లు తెలిపారు. మీడియా, సోషల్ మీడియా, వివిధ డిజిటల్ ఫ్లాట్ ఫామ్స్ ద్వారా వీటిని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. 8142404888 నెంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపడం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఈ వీడి యోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సత్యనారాయణరాజు వివరించా రు. ఈ సమీక్షలో మంత్రులు నారాయణ, సత్యకుమార్, ఆనం రామనారాయణరెడ్డి, కందుల దుర్గేష్‌తో పాటు సీఎస్ సాయి ప్రసాద్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, కమిషనర్ వీరపాండియన్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# అర్జీలు స్వీకరించిన సీఎం చంద్రబాబు

మంగళగిరి(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయానికి వెళ్లారు. సమస్యలపై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సాయం అందించారు. కార్యకర్తలను పలకరించి వారితో ఫొటోలు దిగారు. అనంతరం పార్టీ నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు.









# అమరావతి అర్బన్ మొబిలిటీ ప్లానింగ్

- భవిష్యత్ నగర నిర్మాణానికి అనుగుణంగా దృష్టి
- హైకోర్టు భవనాలవద్ద రూ.547 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పనకు నిర్ణయం
- భవనాలు, అక్రమ నిర్మాణాల వివాదాల పరిష్కారానికి ప్రత్యేక ట్రైబ్యునల్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్
- ఎకనామిక్ రీజియన్ ఆర్ఎఫ్‌పీకి అంగీకారం
- ఏపీసీఆర్డీఏకు సొంతంగా అగ్నిమాపక విభాగం
- అనువుగా లేని ప్లాట్లకు గ్రామకంఠంలో 5 సెంట్లు
- రాజధాని పరిధిలో పేదలకు గృహ సముదాయాలు
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన 61వ అథారిటీ సమావేశం
- 18 అంశాలపై చర్చించి ఆమోద ముద్ర



అమరావతి(చైతన్యరథం): రాజధానిలో భవిష్యత్ నగర నిర్మాణానికి అనుగుణంగా అర్బన్ మొబిలిటీ ప్లానింగ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 61వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. సీఆర్డీఏ ప్రతిపాదించిన 18 అంశాలపై అథారిటీ సమావేశంలో చర్చించి ఆమోదాన్ని తెలియజేశారు. రూ.547.07 కోట్ల వ్యయంతో హైకోర్టు భవనాలకు సంబంధించిన వివిధ మౌలిక సదుపాయాల కల్పనకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదాన్ని తెలియచేసింది. పీపీపీ ప్రాతిపదికన డిజైన్ బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో అమరావతిలో పర్యాటకానికి ప్రోత్సాహం అందించేలా జెయింట్ అబ్జర్వేషన్ వీల్‌ను నిర్మించేందుకు అథారిటీ అంగీకారం తెలిపింది. ఎల్పీఎస్ లేఅవుట్లలో వీధి పోట్లు ఉంటే ప్లాట్లలో ఏటీఎంలు, కియోస్క్‌లు లాంటి వివిధ మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ఆమోదం ఇచ్చింది. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను పీపీపీ లేదా జాయింట్ వెంచర్ విధానంలో కల్పించేందుకు అథారిటీ ఆమోదాన్ని తెలియజేసింది. అలాగే నెగోషియబుల్ సెటిల్‌మెంట్ పాలసీలో భాగంగా అనువుగాలేని ప్లాట్లకు గ్రామకంఠంలో 5 సెంట్ల వరకూ కేటాయించేందుకు అథారిటీ అంగీకారాన్ని తెలిపింది. ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు మార్గదర్శకాలకు అనుగుణంగా రాజధాని పరిధిలో దిగువ, మధ్యతరగతి ప్రజల నివాసానికి అనుగుణంగా గృహ సముదాయాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. అమరావతి ప్రాంతంలో భవనాలు, అక్రమ నిర్మాణాల వివాదాల పరిష్కారం కోసం ప్రత్యేక ట్రైబ్యునల్ ఏర్పాటుకు కూడా అథారిటీ ఆమోదాన్ని తెలిపింది. వివాదాలను పరిష్కరించుకునేలా అమరావతిలో ఓ మీడియేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. అమరావతి రాజధానిలో ఫైర్ వింగ్ ఏర్పాటు చేసుకుని ఎన్ఓసీలను జారీ చేసేందుకు సొంత అగ్నిమాపక నియంత్రణ వ్యవస్థ ఏర్పాటుకు కూడా అథారిటీ ఆమోదాన్ని తెలియచేసింది. రాజధాని ప్రాంతంలో డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటుకు సంబంధించి టాట్రీడ్ ఒప్పందాన్ని రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలిచేందుకు అథారిటీ ఆమోదాన్ని తెలియచేసింది. ఎల్పీఎస్ లేఆవుట్లలోని 495 మంది రైతుల కొత్త అలాట్మెంట్ కోడ్‌లు మారటంతో వారికి రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపునకు అథారిటీ అంగీకారం తెలియజేసింది.

## అమరావతి ఎకనామిక్ రీజియన్‌కు ఆర్ఎఫ్‌పీ

9 జిల్లాలకు విస్తరించిన అమరావతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధికి సంబంధించి ప్రణాళిక రూపకల్పన కోసం ఆర్ఎఫ్‌పీ తయారు చేసేందుకు కూడా అథారిటీ ఆమోదాన్ని తెలిపింది. ఏలూరు నుంచి ప్రకాశం వరకూ 9 జిల్లాల్లో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించేలా అథారిటీ సమావేశంలో ఆదేశాలు జారీ చేశారు. రాజధానిలోని అన్ని భవనాలు, కార్యాలయాలకు ఓ సెంట్రల్ కూలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సీఎం నిర్దేశించారు. డక్ట్‌ల ద్వారా పైపుల నుంచి ఇళ్లు, కార్యాలయాలకు ఇది చేరేలా వ్యవస్థ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. బల్క్ చిల్లింగ్ యంత్రాల తయారీ సంస్థలు ఏపీలో ఉన్నాయని వీటిని సమర్థంగా వినియోగించుకోవాలని దిశానిర్దేశం చేశారు. బ్లూ గ్రీన్ సిటీగా నిర్మితం అవుతున్న అమరావతిలో కొత్త సాంకేతిక వ్యవస్థలపై విస్తృతమైన అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.

అమరావతి రాజధాని ప్రాంతంలో నిర్మితమయ్యే ప్రతీ టౌన్‌షిప్‌లోనూ వర్క్‌ఫ్రమ్ హోమ్ సహా లివబుల్, కమర్షియల్ కార్యకలాపాల కేంద్రాలుగా ఉండాలని సూచించారు. రాజధాని ప్రాంతంలో ఎకనమిక్ యాక్టివిటీ ఉండేలా ప్రణాళికలు ఉండాలని దిశానిర్దేశం చేశారు. అమరావతిలో నిర్మించే ఆస్పత్రుల్లో రోగుల అటెండెంట్లకు కూడా వసతి ఉండేలా చూడాలని సూచించారు. రాజధాని ప్రాంతంలో హోటళ్లు, కన్వెన్షన్ కేంద్రాలను వేగంగా అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఈ సమావేశానికి పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, సీఎస్ జి.సాయిప్రసాద్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఏడీసీ, సీఆర్డీఏ అధికారులు హాజరయ్యారు

# దేశంలో తొలిసారి పీఎం సేతు అమలు

- కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ నిర్ణయం
- ఆంధ్రప్రదేశ్‌కు అరుదైన గుర్తింపు
- 'స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్'కు ఆమోదం
- మారనున్న విశాఖ ఐటీఐల రూపురేఖలు
- విద్యార్థులకు ఆధునిక సాంకేతిక శిక్షణ



అమరావతి(చైతన్యరథం): దేశంలోనే తొలిసారిగా పీఎం సేతు(PM-SETU పథకం అమలు చేయనున్న రాష్ట్రంగా ఏపీ నిలిచింది. ఆ ఘనత లభించిన మొట్టమొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అరుదైన గుర్తింపు సాధించింది. ఈ మేరకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వశాఖ జాతీయ స్టీరింగ్ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్‌కు సంబంధించిన 'స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్'కు కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో విశాఖ ఐటీఐల రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. ప్రముఖ ఉక్కు దిగ్గజం ఆర్సెలార్ మిట్టల్ భాగస్వామ్యంతో ఆధునికీకరణ పనులు చేపట్టనున్నారు. జాతీయ స్థాయిలో రూ.60,000 కోట్ల బడ్జెట్‌తో చేపడుతున్న ఈ కార్యక్రమంలో మొదటి దశలోనే ఆంధ్రప్రదేశ్ ముందంజ వేసింది. విశాఖ ఐటీఐల అభివృద్ధికి అకడమిక్ భాగస్వామిగా



నామ్‌టెక్‌సంస్థ కూడా రంగంలోకి దిగింది. ఈ ప్రాజెక్టులో 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌ను అమలు చేయనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఐటీఐ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక శిక్షణ అందించడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. కోర్సు పూర్తిచేసిన వెంటనే విద్యార్థులకు నేరుగా పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడమే PM-SETU లక్ష్యంగా కేంద్రం పేర్కొంది. 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనలో భాగంగా ప్రభుత్వ ఐటీఐలను బలోపేతం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఏపీ బాటలోనే నడవడానికి మరో 12 రాష్ట్రాలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. పరిశ్రమల భాగస్వామ్యానికి వేగంగా టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని కేంద్ర వర్గాలు వెల్లడించాయి.

# మంగళగిరిలో ఏపీఎల్ 2026

- జూన్ 24 నుంచి 30 వరకు క్రికెట్ సందడి
- అంతర్జాతీయ స్టేడియంలో ఉత్కంఠభరిత మ్యాచ్‌లు
- ఏసీఏ ఆధ్వర్యంలో రూపుదిద్దుకుంటున్న ప్రాంగణం

మంగళగిరి(చైతన్యరథం): క్రికెట్ అభిమానులకు పండుగలా నిలిచే జీఎంఆర్ ఏపీఎల్-2026 టోర్నమెంట్‌కు మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ స్టేడియం వేదిక కానుంది. జూన్ 24 నుంచి జూన్ 30 వరకు జరుగనున్న ఈ లీగ్ మ్యాచ్‌లు, ఎలిమినేటర్, క్వాలిఫైయర్‌లు, ఫైనల్ పోటీలు ప్రేక్షకుల్లో ఉత్సాహాన్ని నింపనున్నాయి. టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్‌లో రాయల్స్ ఆఫ్ రాయల సీమ జట్టు.. సింహాద్రి విజాగ్ లయన్స్‌తో తలపడనుంది. అదేరోజు భీమవరం బుల్స్, క్యాపిటల్ అమరావతి రాయల్స్ జట్లు పోటీపడనున్నాయి. వరుసగా విజయవాడ సన్‌షైనర్స్, కాకినాడ కింగ్స్, తుంగభద్ర వారియర్స్ వంటి బలమైన జట్లు కూడా పోటీలో పాల్గొననున్నాయి. జూన్ 28న ఎలిమినేటర్, క్వాలిఫైయర్-1 మ్యాచ్‌లు జరగనున్నాయి. జూన్ 29న క్వాలిఫైయర్-2, జూన్ 30న రాత్రి 7:30 గంటలకు ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నారు. వర్షం లేదా ఇతర కారణాల వల్ల ఆటకు అంతరాయం కలిగితే జూలై 1ను రిజర్వ్ డేగా నిర్ణయించారు. మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ స్టేడియంలో జరగనున్న ఈ టోర్నమెంట్‌కు భారీఎత్తున క్రికెట్ అభిమానులు తరలివచ్చే అవకాశం ఉండటంతో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



# నేటి తరానికీ వైఎస్ కుటుంబ అరాచకాలు

- ప్రజలు గొడ్డలి పార్టీ అంటుంటే సైకోలో ఫ్రస్టేషన్
- వివేకా కేసులో సునీత పోరాటంలో న్యాయం ఉంది
- డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్‌తో పెనుమార్పులు
- త్వరలోనే బిల్లులు తీసుకొచ్చేందుకు కేంద్రం సిద్ధం
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం చంద్రబాబు

అమరావతి(చైతన్యరథం): వైఎస్ కుటుంబ అరాచకాలు ఎన్నెన్నో వెలుగులోకి వస్తున్నాయి..గొడ్డలి పార్టీ అని ప్రజల్లోకి వెళ్లే కొద్ది సైకోలో ఫ్రస్టేషన్ పెరుగుతోందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. సైకో కంటే గొడ్డలి పార్టీ అనే అంశాన్ని ప్రజలు బాగా గుర్తించారని చెప్పారు. ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియా తో ఇష్టాగోష్ఠిగా ముచ్చటించారు. "వెలుగులోకి వస్తున్న వైఎస్ కుటుంబ అరాచకాలు నాకు కూడా తెలియవు. ప్రజాస్వామ్యానికి ఇలాంటి వాళ్లు పనికిరారు. మావోయిస్టులు తుపాకులతో రాజ్యాధి కారాన్ని సాధించలేరు. వీళ్లు మాత్రం గొడ్డలితో ఎలా రాజకీయాలు చేస్తారు? వివేకా హత్య కేసులో సునీత పోరాటంలో న్యాయం ఉంది. తన తండ్రిని ఎవరు చంపారో తెలుసుకునే హక్కు ఆమెకు ఉంది. ఆమె పోరాటం వల్లే ఇప్పటికీ ఆ హత్య కేసు సజీవంగా ఉంది. నేటి తరానికి కూడా వీళ్ల హత్యా రాజకీయాలు తెలుస్తు న్నాయన్నాయని అన్నారు.

### డీ లిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులపై కీలక వ్యాఖ్యలు

నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లులపై కేంద్రం పట్టుదలగా ఉంది. ఇవి దేశ రాజకీయాల్లో పెనుమార్పులు తీసు కొస్తాయి. రెండు బిల్లులను విడదీసి చూడాల్సిన అవసరం లేదు. బిల్లులను గతంలో వ్యతిరేకించిన వారి ఆలోచనలు ఇప్పుడు మారొ చ్చు. టీడీపీ ప్రకటించిన 33 శాతం రిజర్వేషన్లు దేశ రాజకీయా ల్లో చర్చనీయాంశమైంది. మహిళలకు మొదటి నుంచి మా పార్టీ అండగా ఉంది. పునర్విభజనలో 2011 జనాభా లెక్కలైనా, తాజా జనాభా లెక్కలైనా మనకు నష్టం. ఉన్న స్థానాలను 50 శాతం పెంచితే ఎవరికీ నష్టం ఉండదని తెలిపారు. పెంచిన స్థానాలను మహిళలకు కేటాయించవచ్చని అభిప్రాయపడ్డారు. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లుల విషయంలో కేంద్ర ప్రభుత్వం పట్టుదలతో ఉందన్నారు. రెండు బిల్లులను తీసుకురావడానికి కేంద్రం సిద్ధమవుతోందని, ఆ రెండిం టినీ విడదీసి చూడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. రెండు బిల్లులు కలిపి వస్తేనే మహిళలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్, పునర్విభజన బిల్లులు తప్పని సరిగా తీసుకురావాలని, ఇవి దేశ రాజకీయాల్లో పెను మార్పులు తీసుకొస్తాయని అభిప్రాయపడ్డారు.



### మహానాడు విజయంపై అభినందనలు

హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన మహానాడు విజయంపై టీడీపీ జనరల్ సెక్రటరీలు, జోనల్ ఇన్‌చార్జ్‌లు, ముఖ్యనేతలతో ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైబ్రిడ్ మహానాడు విజయవంతమైం దన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నిర్వహించిన ఈ సమావేశంలో మహానాడు కార్యక్రమం నిర్వహణ, పార్టీ భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. తొలి సారిగా హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన మహానాడు ఘన విజయం సాధించిందని పేర్కొన్నారు. మహానాడును సమర్థవం తంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన పార్టీ నేతలు, కార్యకర్తలు, నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. మహానాడు సందర్భంగా తెలంగాణ తెదేపా నేత బక్కని నర్సిం హులు చేసిన వ్యాఖ్యలను ముఖ్యమంత్రి తప్పుపట్టారు. తెలం గాణపై ఆయన చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ఏ ఒక్కరి మనోభావాలు దెబ్బతీయకూడదని సూచించారు. తెలుగు జాతి ఒక్కటేనని చెప్పారు. తెదేపా పుట్టిందే తెలంగాణ గడ్డపై అని గుర్తుచేశారు. ఆ రాష్ట్రంలో ఇప్పటికీ బలమైన క్యాడర్ ఉందన్నారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత తెలంగాణలో సామాజిక న్యాయం, అభివృద్ధికి బాటలు పడ్డాయి. తెలంగాణలో ఉత్సాహంగా మహానా డు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది. మహానాడులో ఆమోదించిన 33% మహిళా రిజర్వేషన్ల అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ నేతలతో చంద్రబాబు భేటీ అయ్యారు. రాజ్యసభ స్థానాలకు అవకాశం కల్పించాలని పలువురు ఆశావహులు ఆయనను కోరా రు. వర్ల రామయ్య, కంభంపాటి రామ్మో హన్‌రా వు, రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి తదితరులు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

# దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఆవిర్భావం




- తెలుగు జాతి దశాబ్దాల కల సాకారం
- తెలుగు ప్రజల నాయకత్వ సంకల్పానికి ప్రతీక
- జూన్ 1న విజయోత్సవంలా జరుపుకోవాలి
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం (చైతన్య రథం): విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానుండటం తెలుగు ప్రజల దశాబ్దాల కల సాకార మైన చారిత్రాత్మక ఘట్టమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ విజయా న్ని ప్రతి తెలుగువాడి విజయంగా భావిస్తున్నానని, రైల్వే జోన్ సాధనకు జరిగిన ఉద్యమాలు, పోరాటాల్లో భాగ స్వామి కావడంపట్ల గర్వంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా పల్లా శ్రీని వాసరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం రాష్ట్ర ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ప్రధాన హామీల్లో విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఒకటని గుర్తుచేశారు. దశాబ్దాల పోరాటం, ప్రజల ఆకాంక్షలు, ప్రజా ప్రతినిధుల నిరంతర కృషి ఫలితంగానే నేడు దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఆవిర్భవించిందన్నారు.

### తెలుగు ప్రజల ఆకాంక్షలకు న్యాయం

విశాఖపట్నం కేంద్రంగా ఏర్పడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలో విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లు కార్యకలాపాలు ప్రారంభించడం రాష్ట్ర అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని పల్లా పేర్కొన్నారు. రైల్వే పరిపాలన, మౌలిక వసతుల అభివృద్ధి, కొత్త ప్రాజెక్టులు, ఉద్యోగ అవకాశాల కల్పనలో ఈ జోన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

### కూటమి ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనం

దేశ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జూన్ 1నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కావడం తెలుగు ప్రజలపట్ల కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు.

### విజయోత్సవంలా జరుపుకోవాలి

దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఆవిర్భావ దినోత్సవాన్ని తెలుగు ప్రజల విజయపర్వంగా భావించాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు ఈ చారిత్రాత్మక సందర్భాన్ని ఘనంగా జరుపుకోవాలని కోరారు. ప్రతి నియోజకవర్గంలో, ప్రతి పట్టణంలో, గ్రామంలో రైల్వే జోన్ సాధనకు గుర్తుగా సంబరాలు నిర్వహించాలని, సమీప రైల్వే స్టేషన్లు, రైల్వే బోర్డులవద్ద మిఠాయిలు పంచుకుని ఆనందాన్ని పంచుకోవాలని సూచించారు. ఇది కేవలం ఒక పరిపాలనా నిర్ణయం కాదని... తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి, సంకల్పానికి లభించిన విజయమని పేర్కొన్నారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఆవిర్భావం రాష్ట్ర ప్రగతికి కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని, ఈ విజయాన్ని ప్రజలందరూ తమ విజయంగా భావించి విజయోత్సవంలా జరుపు కోవాలని పల్లా శ్రీనివాసరావు కోరారు.

## రేపు కాకినాడ జిల్లాలో
# ముఖ్యమంత్రి పర్యటన

- తుని నియోజకవర్గం చామవరంలో 'ప్రజా వేదిక'
- ప్రజలతో మమేకం కానున్న చంద్రబాబునాయుడు
- ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సిద్ధం
- భద్రత, సౌకర్యాలపై అధికారులతో సమీక్షించిన రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు

విజయవాడ/కాకినాడ (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జూన్ ఒకటో తేదీన కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో పర్యటించనున్నారు. తుని మండలం చామవరంలో సీఎం పర్యటన కోసం అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేస్తోంది.

### ప్రత్యేక ఆకర్షణగా 'ప్రజా వేదిక'

సోమవారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సాగ నున్న ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా చామవరం గ్రామంలో ఏర్పాటుచేసిన 'ప్రజా వేదిక' ప్రధాన ఆకర్షణ కానుంది. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకు నేందుకు సీఎం ప్రత్యేక సమయం కేటా యించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీని ముఖ్యమంత్రి ప్రారంభించనుండటంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, కలెక్టర్ ఎంఎన్ హరేంద్ర ప్రసాద్‌తో కలిసి శనివారం చామవరం గ్రామంలో పర్య టించి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు. వేదిక నిర్మాణం, భారీ బహిరంగ సభకు వచ్చే ప్రజల కోసం కనీస సౌకర్యా లు (నీరు, నీడ, పార్కింగ్) యుద్ధప్రాతి పదికన ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రతాపరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పోలీస్ అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఎస్పీని కోరారు. ముఖ్యమంత్రి రాకతో తుని నియో జకవర్గ టీడీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. సీఎం పర్యటనలో భాగంగా పార్టీ క్యాడర్‌తో ప్రత్యేక సమావేశం కూడా ఉండటంతో నియోజకవర్గంలోని ముఖ్య నేతలు, కార్యకర్తలు భారీస్థాయిలో తరలి వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. పర్యటన ను విజయవంతం చేసే బాధ్యతను పార్టీ స్థానిక నాయకత్వం భుజాన వేసుకుంది.

ఏర్పాట్ల పరిశీలనలో ఇన్‌చార్జి ఎస్పీ రాహుల్ మీనా, జేసీ అపూర్వభరత్, పెద్దా పురం ఆర్డీవో,డీఎస్పీ తిలక్, ఎస్‌బీ డీఎస్పీ సత్యనారాయణ, ఇంటెలిజెన్స్ డీఎస్పీ ఈశ్వరుడు, రెవెన్యూ, పోలీస్‌శాఖల అధి కారులు, టీడీపీ నాయకులు మోతుకూరి వెంకటేష్, సొసైటీ అధ్యక్షుడు పోలిశెట్టి రామలింగేశ్వరరావు, జిల్లాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# మంగళగిరి చేనేతకు బ్రాండింగ్!

◆ యువగళం నుంచే అగ్రతాంబూలం ◆ ఆదాయం పెరిగేలా మార్కెటింగ్ ◆ మన లోకేష్ అని చెప్పుకునేలా ప్రస్థానం









అమరావతి(చైతన్యరథం): ఒకప్పుడు అది కేవలం ఒక నియోజ కవర్గం..నేడు ప్రపంచపటంలో హాట్ టాపిక్! ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా మంగళగిరి ప్రజలు, ఇక్కడి చేనేత కార్మికులు గర్వంగా కాలర్ ఎగరేసి “మన మంగళగిరి-మా లోకేష్” అని చెప్పుకునేలా సాగుతున్న ఒక అద్భుత ప్రస్థానం ఇది. చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపడమే కాదు..మంగళగిరి శాలువాలు, చీరలకు అంతర్జాతీయ బ్రాండింగ్ తెచ్చారు యువనేత.

## ప్రధాని మోదీ నుంచి బిల్‌గేట్స్ వరకు మంగళగిరి గౌరవం

నారా లోకేష్-బ్రాహ్మణి దంపతులు తమ ఇంటికి వచ్చిన దేశ ప్రధాని నరేంద్ర మోదీకి మంగళగిరి శాలువా కప్పి స్వాగతం పలి కారు. విశేషం ఏమిటంటే అదే శాలువాతో ప్రధాని బహిరంగ సభలో పాల్గొని మంగళగిరి ఖ్యాతిని దేశానికి చాటారు. అమరా వతి చట్టబద్ధతకు కృతజ్ఞతగా ఢిల్లీ వెళ్లినప్పుడు కూడా ప్రధానికి మంగళగిరి శాలువానే బహుమతిగా ఇచ్చారు లోకేష్. దావోస్ వెళ్లినా, ఆస్ట్రేలియా వెళ్లినా.. ప్రపంచ పారిశ్రామిక దిగ్గజం బిల్ గేట్స్‌ను సీఎం చంద్రబాబు చేతులమీదుగా సత్కరించినా అక్కడ ఉండేది మన మంగళగిరి శాలువానే. ఆ విధంగా మంగళగిరి చేనేతకు ప్రోత్సాహం ఇస్తూ ప్రమోట్ చేస్తున్నారు యువనేత లోకేష్.

## ప్రచారం కల్పిస్తున్న భువనమ్మ, బ్రాహ్మణి

నారా భువనేశ్వరి, నారా బ్రాహ్మణి స్వయంగా మంగళగిరి చేనేత చీరలు ధరిస్తూ దేశవ్యాప్తంగా వీటికి బ్రాండ్ అంబాసి డర్లుగా మారారు. తన ఇంట్లో జరిగే ఆత్మీయ సమావేశాలకు వచ్చే మహిళా అతిథులకు మంగళగిరి పట్టుచీరలు ఇచ్చి గౌర విస్తున్నారు. కేవలం శాలువాలు కప్పడమే కాదు చేనేత వస్త్రాల విక్రయాల కోసం అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు కుదిర్చి నేతన్నల ఆదాయం పెరిగేలా లోకేష్ అడుగులు వేశారు. విశాఖ గ్లోబల్ సమ్మిట్‌లో వచ్చిన మహిళా అతిథులందరికీ చంద్రబాబు మంగళగిరి చీరలనే బహుమతిగా ఇచ్చి నేతన్నపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

## రాజకీయాల్లోనూ అగ్రతాంబూలం

సామాన్య కార్యకర్తలకు రాజకీయాల్లో అగ్రతాంబూలం ఇచ్చారు. మంగళగిరి అంటే కేవలం ఓట్లు కురిపించే సీటు కాదు.. ప్రాణం ఇచ్చే కార్యకర్తల కోట. సామాన్యులకు సైతం అత్యున్నత పదవులు ఇచ్చి గౌరవించారు. మంగళగిరి చేనేత వర్గానికి చెందిన గుత్తికొండ ధనుంజయరావుకు తెలుగుదేశం పార్టీ అత్యున్నత నిర్ణాయక మండలి పొలిట్‌బ్యూరోలో స్థానం కల్పించి రాజకీయ అతిరథ మహారథుల పక్కన నిలబెట్టి మంగళగిరి గౌరవాన్ని పెంచారు.నిన్న మొన్న జరిగిన డిజిటల్ మహానాడు ప్రధాన స్టేజ్‌పై ధనుంజయరావును కూర్చోబెట్టడమే కాకుండా.. క్లస్టర్ ఇన్‌చార్జ్ గాదె పిచ్చిరెడ్డి, ఆత్మకూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు తాటి వెంకటరావులతో జెండా వందనం, ఎన్టీఆర్ విగ్రహ నివాళి కార్యక్రమాల్లో పాల్గొనేలా చేసి స్థానిక లీడర్లకు అగ్రస్థానం కల్పించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే, చిలకలూరిపేట ప్రధాని మోదీ బహిరంగ సభలో మంగళగిరి చేనేత నాయకుడు నందం అబద్దయ్యకు ప్రధానమంత్రికి స్వాగ తం పలికేలా లోకేష్ చొరవ తీసుకున్నారు.

## రాష్ట్రపతికి మంగళగిరి శాలువాతో స్వాగతం

మన దేశ ప్రథమ పౌరురాలు, రాష్ట్రపతికి సైతం మంగళగిరి శాలువాతో స్వాగతం పలికి ఇక్కడి నేతన్నల పట్ల తనకున్న భక్తి శ్రద్ధలను చాటుకున్నారు. నారా లోకేష్ చరిత్ర సృష్టించిన ‘యువగళం’ పాదయాత్ర ప్రారంభమైన తొలిరోజు నుంచి ప్రతి కీలక మైలురాయిలోనూ మంగళగిరి నాయకులకు, ఇక్కడి ప్రజలకే తొలి ప్రాధాన్యత ఇస్తూ వచ్చారు. గవర్నర్ అయినా, కేంద్ర మంత్రులైనా లోకేష్ ఇంటికి వస్తే మంగళగిరి శాలువా ఉండాల్సిందే. ఒకవైపు మన మంగళగిరి-మన చేనేత పేరుతో ప్రపంచవ్యాప్తంగా బ్రాండింగ్.. మరోవైపు స్థానిక సామాన్య కార్యకర్తలకు దేశ ప్రధాని, రాష్ట్రపతి వేదికలపై గుర్తింపు.. మం గళగిరి ప్రజలు కాలర్ ఎగరేసి మన మంగళగిరి..మన లోకేష్ అని గర్వంగా చెప్పుకునేలా ముందుకు సాగుతున్నారు.





# టెక్స్‌టైల్స్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్

- చేనేతకు కొత్త ఊపిరి.. పరిశ్రమలకు కొత్త దిశ
- కేంద్ర, రాష్ట్ర సమన్వయంతో అభివృద్ధివైపు అడుగులు



ఏ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికైనా వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం అనే మూడు ప్రధాన స్తంభాలుంటాయి. ఆంధ్రప్రదేశ్‌వంటి వ్యవసాయాధారిత రాష్ట్రానికి పరిశ్రమల విస్తరణ మరింత అవసరం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచుతూ, సంప్రదాయ వృత్తులకు ఆధునిక మార్కెట్లను కల్పించే రంగాల్లో పెట్టుబడులు పెరగడం అత్యంత కీలకం. అలాంటి రంగాల్లో జౌళి, చేనేత, హస్తకళలు ప్రధానమైనవి. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రముఖ టెక్స్‌టైల్స్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కేంద్రం, రాష్ట్రం కలిసి పనిచేయనున్నట్లు ప్రకటించడం కేవలం ఒక పరిపాలనా ప్రకటన మాత్రమే కాదు. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నుంచి అంతర్జాతీయ ఎగుమతుల వరకు విస్తరించే సమగ్ర అభివృద్ధి వ్యూహానికి సంకేతంగా కనిపిస్తోంది.

### చేనేతకు ఆధునిక పరిశ్రమల జోడింపు:

ఆంధ్రప్రదేశ్‌కు చేనేత, హస్తకళల రంగాల్లో గొప్ప చరిత్ర ఉంది. ధర్మవరం పట్టు చీరలు, మంగళగిరి వస్త్రాలు, ఉప్పాడ చేనేత, వెంకటగిరి చీరలు, పోచంపల్లి ప్రభావంతో అభివృద్ధి చెందిన అనేక ప్రాంతీయ కళారూపాలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. అయితే కాలానుగుణంగా మార్కెట్ మార్పులు, ముడిసరుకు సమస్యలు, మధ్యవర్తుల పెత్తనం, ఆధునిక మార్కెటింగ్ లోపం వంటి కారణాలతో చేనేత రంగం అనేక ఇబ్బందులను ఎదుర్కొంది.

ఇప్పుడు టెక్స్‌టైల్స్ హబ్ లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు రావడం ద్వారా సంప్రదాయ చేనేతకు ఆధునిక పరిశ్రమల శక్తిని జోడించే అవకాశం ఏర్పడుతోంది. చేనేతను కేవలం సంక్షేమ దృష్టితో కాకుండా, ఆదాయాన్ని సృష్టించే ఆర్థిక రంగంగా అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

### నార ఉత్పత్తులు -భవిష్యత్ ఆర్థిక వ్యవస్థకు పునాది

ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం పర్యావరణ అనుకూల ఉత్పత్తులకు డిమాండ్ వేగంగా పెరుగుతోంది. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా సహజ నారల వినియోగం పెరుగుతుండటం కొత్త అవకాశాలను తెరుస్తోంది. అరటి, పైనాపిల్, చెరకు వంటి పంటల నుంచి తీసే నారతో తయారయ్యే ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో మంచి ఆదరణ లభిస్తోంది. సాధారణంగా వ్యవసాయ వ్యర్థాలుగా భావించే పదార్థాలను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుంది. అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో చిన్న, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పడతాయి. మహిళలు, యువత, స్వయం సహాయక సంఘాలు ఈ రంగంలో పెద్దఎత్తున భాగస్వామ్యం అయ్యే అవకాశం ఉంటుంది. ఒకప్పుడు వ్యర్థంగా పారేసిన అరటి తొక్కలు, చెరకు అవశేషాలు, పైనాపిల్ ఆకులు రేపటి రోజున కోట్ల రూపాయల విలువైన ఎగుమతి ఉత్పత్తులుగా మారే అవకాశం ఉండటం ఈ రంగం ప్రత్యేకత.

### 2030నాటికి 350 బిలియన్ డాలర్ల ఎగుమతులే లక్ష్యం

భారత్ 2030నాటికి 350 బిలియన్ డాలర్ల టెక్స్‌టైల్స్ ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకోవడం చిన్న విషయం కాదు. ఇది దేశ పారిశ్రామిక అభివృద్ధిలో అత్యంత ప్రతిష్ఠాత్మక లక్ష్యాల్లో ఒకటి. ఈ లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించగలదని కేంద్ర ప్రభుత్వం భావించడం రాష్ట్రానికి లభించిన అవకాశంగా చూడాలి. ప్రస్తుతం ప్రపంచ సరఫరా గొలుసుల్లో మార్పులు జరుగుతున్నాయి. చైనా ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా భారతదేశం ఎదగాలని ప్రపంచ దేశాలు కోరుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో తీర ప్రాంతాలు, నౌకాశ్రయాలు, విస్తారమైన భూములు, నైపుణ్యం కలిగిన కార్మిక శక్తి ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకమైన ప్రయోజనాలు ఉన్నాయి. విశాఖపట్నం, కాకినాడ, కృష్ణపట్నం వంటి పోర్టులు ఎగుమతులకు అనుకూలంగా ఉండటం, కొత్త పారిశ్రామిక కారిడార్లు అభివృద్ధి చెందడం, పెట్టుబడులను ఆకర్షించే విధానాలు అమల్లోకి రావడం వంటి అంశాలు రాష్ట్రాన్ని టెక్స్‌టైల్స్ రంగంలో ముందంజలో నిలిపే అవకాశం కల్పిస్తున్నాయి.

### ఉపాధి సృష్టిలో టెక్స్‌టైల్స్ రంగం పాత్ర

పెద్ద మొత్తంలో ఉపాధి కల్పించే రంగాల్లో టెక్స్‌టైల్స్ పరిశ్రమ ఒకటి. ముఖ్యంగా మహిళలకు, గ్రామీణ యువతకు, సంప్రదాయ వృత్తిదారులకు ఈ రంగం జీవనాధారంగా నిలుస్తుంది. చేనేత, హస్తకళాకారులకు సంవత్సరంలో 365 రోజులు ఉపాధి కల్పించాలన్న లక్ష్యం సాధ్యమైతే అది సామాజిక-ఆర్థిక పరంగా గొప్ప మార్పుకు దారితీస్తుంది. వ్యవసాయ సీజన్ ముగిసిన తర్వాత గ్రామీణ కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు అందుబాటులోకి వస్తాయి. వలసలు తగ్గుతాయి. మహిళల ఆర్థిక స్వావలంబన పెరుగుతుంది. ఒక కుటుంబంలో కనీసం ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలన్న ఆలోచన కూడా ఉపాధి నుంచి స్వయం ఉపాధి దిశగా తీసుకెళ్లే ప్రయత్నంగా కనిపిస్తోంది.

### బ్రాండింగ్, నాయకత్వం, పెట్టుబడులు

అభివృద్ధి పరంగా చూస్తే రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో నాయకత్వం, బ్రాండింగ్ కీలక పాత్ర పోషిస్తాయనేది వాస్తవం. ప్రపంచ పెట్టుబడిదారులు కేవలం భూములు లేదా భవనాలను చూసి పెట్టుబడులు పెట్టరు. పాలన, విధాన స్థిరత్వం, నాయకత్వ దృష్టి, మౌలిక సదుపాయాలపై నమ్మకం వంటి అంశాలను పరిశీలిస్తారు. ఆంధ్రప్రదేశ్ గతంలో ఐటీ, మౌలిక సదుపాయాల రంగాల్లో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడానికి కారణమైన అంశాల్లో బ్రాండింగ్ కూడా ఒకటి. ఇప్పుడు టెక్స్‌టైల్స్ రంగంలో కూడా అదే విధమైన ప్రణాళికాబద్ధ దృష్టి అవసరం.

### డబుల్ ఇంజన్ సర్కార్ -అభివృద్ధికి బాటలు

కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే కూటమి అధికారంలో ఉండటం వల్ల అభివృద్ధి కార్యక్రమాల అమలు వేగవంతం అవుతుంది. వాస్తవానికి పెద్ద పారిశ్రామిక ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమాలు వంటి అంశాల్లో కేంద్ర-రాష్ట్ర సమన్వయం అత్యంత అవసరం.

ప్రత్యేకించి జౌళి రంగానికి సంబంధించిన క్లస్టర్లు, శిక్షణ కేంద్రాలు, సాంకేతిక మద్దతు, ఎగుమతి ప్రోత్సాహక పథకాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలైతే రాష్ట్రానికి గణనీయమైన ప్రయోజనాలు కలగవచ్చు.

### భవిష్యత్తు దిశ

ఆంధ్రప్రదేశ్‌ను టెక్స్‌టైల్స్ హబ్‌గా మార్చాలన్న లక్ష్యం కేవలం పరిశ్రమల అభివృద్ధి ప్రణాళిక మాత్రమే కాదు. ఇది రైతు నుంచి కళాకారుడు వరకు, మహిళ నుంచి యువ పారిశ్రామికవేత్త వరకు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నుంచి అంతర్జాతీయ ఎగుమతుల వరకు విస్తరించే సమగ్ర అభివృద్ధి దృక్పథం. ప్రపంచవ్యాప్తంగా గ్రీన్ ఎకానమీ, సస్టైనబుల్ ఉత్పత్తులు, సహజ నారల వినియోగం పెరుగుతున్న ఈ సమయంలో ఆంధ్రప్రదేశ్ సరైన దిశలో అడుగులు వేస్తే దేశ టెక్స్‌టైల్స్ రంగానికి కొత్త కేంద్రంగా అవతరించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కేంద్రం మద్దతు, రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం, పరిశ్రమల భాగస్వామ్యం, చేనేత కార్మికుల నైపుణ్యం -ఈ నాలుగు అంశాలు కలిసొస్తే రాబోయే దశాబ్దంలో "టెక్స్‌టైల్స్ హబ్ ఆఫ్ ఇండియా"గా ఆంధ్రప్రదేశ్ పేరు వినిపించడం ఆశ్చర్యకరం కాదు.

- జమ్ము సాయి కల్యాణ్,
అనలిస్టు, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

# ఒక్క క్లిక్‌తో పోలీస్ సేవలు

- 'వైజాగ్ సిటీ పోలీస్' పేరుతో ప్రత్యేక వెబ్‌సైట్
- అందుబాటులోకి తెచ్చిన పోలీస్ కమిషనర్
- చోరీలు, నేరాల వివరాలు నమోదు చేస్తే సహాయం

విశాఖపట్నం(చైతన్యరథం):నగర వాసులకు పోలీస్ సేవలను మరింత చేరువ చేసేందుకు కమిషనర్ శంఖబ్రతబాగ్చి 'వైజాగ్ సిటీ పోలీస్' పేరుతో ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఎవరైనా స్మార్ట్ ఫోన్ ద్వారా పోలీస్ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయి వివరాలను ఎంటర్ చేస్తే సంబంధిత పోలీసులు తక్షణం సహాయం అందజేస్తారు. ఒక సీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బృందం మూడునెలలు శ్రమించి ఈ వెబ్‌సైట్‌ను తీర్చిదిద్దారు. గూగుల్‌లో వైజాగ్ సిటీ పోలీస్ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేయగానే సర్వీసెస్ ఫర్ సిటిజన్ అనే ఆప్షన్ వస్తుంది. అందులో ట్రాఫిక్ విభాగానికి సంబంధించి ఈ-చలాన్ అనే ఆప్షన్ ఉంటుంది. దీనిని క్లిక్ చేసిన తర్వాత వాహనం నంబరు ఎంటర్‌చేస్తే ఎన్ని ఈ-చలాన్‌లు ఉన్నాయి, ఎన్ని చెల్లించారు? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి తెలుస్తుంది. అలాగే సైబర్ క్రైమ్, బ్యాంకింగ్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ ఆప్షన్‌ను క్లిక్ చేయగానే 1930 హెల్ప్‌లైన్‌తో పాటు డబ్బులు పోగొట్టుకున్న ఖాతా వివరాలు, పోగొట్టుకున్న మొత్తం వంటి వివరాలను నమోదు చేస్తే సంబంధిత విభాగం పోలీసులు, బ్యాంకు అధికా రుల సమన్వయంతో సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన డబ్బు ఏ ఖాతాకు ట్రాన్స్‌ఫర్ అయిందో తెలుసుకుని ఆ అకౌంట్‌ను ఫ్రీజ్ చేయిస్తారు. తర్వాత బాధితులు ఏం చేయాలో నేషనల్ ఏజెన్సీ గైడ్ చేస్తుంది. ఇక, ఏదైనా పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించిన స్థితిగతులు, నిందితుల వివరాలు, అరెస్టులు, రిమాండ్ రిపోర్టు, చార్జిషీట్ ఫైలింగ్ వంటి వివరాలను తెలుసు కోవాలంటే నో యువర్ కేస్ స్టేటస్ అనే ఆప్షన్‌ను ఎంపిక చేసుకుంటే, అన్ని వివరాలు తెలుసుకోవచ్చు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకున్నా, లేదా చోరీకి గురైనా వెబ్‌సైట్‌లోకి వెళ్లి చాట్ బాట్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకుని పోగొట్టుకున్న ఫోన్ వివరాల ను నమోదుచేస్తే దానిని ట్రాక్ చేసి బాధితులకు అందజేస్తారు. కుటుంబంలో ఎవరైనా సభ్యులు కనిపించకపోయినా, తీర్థ యాత్రలు, రద్దీ ప్రాంతాలకు వెళ్లినప్పుడు పిల్లలు తప్పిపోయినా వారి వివరాలను వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫొటోతో పాటు ఇతర గుర్తులను నమోదు చేస్తే పోలీసులు వాటి ఆధారంగా దర్యాప్తు చేసి పట్టుకుని తిరిగి అప్పగించేందుకు యత్నిస్తారు. వాహనాలు చోరీకి గురైనట్లయితే ఫొటో, వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే నిఘా పెట్టి పట్టుకునేందుకు యత్నిస్తారు. పోలీస్ సేవలు, ఇతర వివాదాలపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తే వాటి వివరాలతోపాటు అధికారులు తీసుకున్న చర్యలు పబ్లిక్ గ్రీవెన్స్ పోర్టల్‌లో పొందు పరుస్తారు. ఎవరైనా తుపాకీ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవ డంతో పాటు అధికారులు తీసుకున్న చర్యలను కూడా వెబ్‌సైట్‌లో తెలుసుకునే సదుపాయం కల్పించారు. నగరంలో 22 శాంతి భద్రతల పోలీస్‌స్టేషన్లు ఉండడంతో వాటి పరిధి, ఎవరిని కలవాలి, ఫోన్ నంబర్లు 'నో యువర్ పోలీస్ స్టేషన్' పోర్టల్‌లో అందుబా టులో ఉంచారు. కమిషనరేట్ పరిధిలో పనిచేసే అధికారుల క్రమం, పేరు, ఫోన్ నంబరు, పాత నేరస్థుల వివరాలు కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.



## మచిలీపట్నం అభివృద్ధి
# పనులు వేగవంతం చేయాలి
### - అధికారులకు మంత్రి కొల్లు ఆదేశం



మచిలీపట్నం (చైతన్యరథం): మచిలీపట్నం నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర గనులు,భూగర్భ వనరులు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం మచిలీపట్నం ఆర్ అండ్ బి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జేసీ ఎం.నవీన్‌లతో కలిసి మచిలీపట్నం శాసనసభ నియోజక వర్గ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంగినపూడి తీరప్రాంతంలో రిసార్టుల ఏర్పాటు, 84 ఎకరాలలో పీతల పెంపకం, శాసన నిధులతో తాళ్లపాలెం వంతెన నిర్మాణం, తదితర భూ కేటాయింపులకు సంబంధించి రెవెన్యూ పరిధిలోగల వివిధ రకాల భూసమస్యల పరిష్కారంపై జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్‌తో చర్చించారు. నగరపాలక సంస్థ పరిధిలో రూ.13 కోట్లతో చేపట్టిన అంతర్గత మురుగునీటి వ్యవస్థ పనుల పురోగతిని సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు సాసి, భవ్య పథకాల కింద లబ్ధిదారులు సద్వి నియోగం చేసుకునే నిమిత్తం త్వరలో సమావేశం నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా నీటి సరఫరా ఏర్పాట్లు చేయాలని, ఎక్కడైనా లీకేజీలు ఉంటే సరిచేయాలని సూచించారు. నగరపాలక సంస్థ పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు, వినియోగంపై మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. సమావేశంలో మచిలీపట్నం ఆర్డీఓ సాంబశివరావు, సర్వే భూరికార్డుల ఏడీ లక్ష్మణబాబు, మచిలీపట్నం తహసీల్దారు నాగభూషణం, మచిలీపట్నం నగరపాలక సంస్థ సహాయ మున్సిపల్ కమిషనర్ గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## కువైట్‌నుంచి మహానాడులో భాగస్వామ్యం
# ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



కువైట్ (చైతన్యరథం): అన్న నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడి ఆధ్వర్యంలో మంగళగిరిలో ఘనంగా నిర్వహించిన మహానాడులో కువైట్ తెలుగుదేశం కార్యకర్తలు జూమ్ మీటింగ్ ద్వారా ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకుల ప్రసంగాలను ఆసక్తిగా వీక్షించిన కువైట్ కార్యకర్తలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై లోతైన అవగాహన పెంచుకున్నారు. అనంతరం కువైట్‌లో నిర్వహించిన అభిమానుల సదస్సులో గల్ఫ్ కౌన్సిల్ సభ్యులు వెంకట్ కోడూరి మాట్లాడుతూ –అన్న ఎన్టీఆర్ జీవితం తెలుగు జాతి మొత్తానికి చిర కాలం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఆయన ఆశయాలను నేటికీ నిరంతరం ముందుకు తీసుకెళ్తున్న చంద్రబాబు అంకితభావాన్ని ఆయన కొనియాడారు.భవిష్యత్ తరాలకు పార్టీని మరింత బలోపేతం చేయడానికి నారా లోకేష్ యువ నాయకత్వాన్ని సమున్నతంగా తీర్చిదిద్దుతున్న తీరును ప్రశంసించారు. మంగళగిరి నుంచి కువైట్ వరకు ఎన్టీఆర్ ఆదర్శాల వెలుగులు విస్తరిస్తున్నాయని ఆయన స్ఫూర్తిదాయకంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉదయ్ ప్రకాష్ అడుసుమల్లి, దివాకర్ ఓలేటి, రామారి రెడ్డి మోహన్, ముస్తాక్ ఖాన్, రెడ్డయ్య చౌదరి ఓలేటి, మురళి దుగ్గినేని, రవి మల్లిశెట్టి, పేరూరు రామకృష్ణ, తాళ్లూరి శ్రీను, రవి పసుపులేటి, బుజ్జయ్య ఎన్టీఆర్ సేవాసమితి సభ్యులు చుండు బాలారెడ్డయ్య, గుద్దె శంకర్, వెంకి చౌదరి, నాగేష్, రెడ్డయ్య నాయుడు, మహిళా విభాగంనుచి దేవి చౌదరి, బుజ్జి పాల్గొన్నారు.



## ‘పెద్ది’ ప్రీ రిలీజ్
# విజయవంతం చేద్దాం

- విజయవాడ అంటేనే సినీ పరిశ్రమకు రాజధాని
- కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఎంపీ కేశినేని చిన్ని

విజయవాడ (చైతన్య రథం): విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రామ్‌చరణ్ నటించిన పెద్ది చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్ కార్యక్రమాలను విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ప్రారంభించారు. పెద్దిలాంటి గొప్ప చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్ విజయవాడకు రావడం సంతోషమని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మీడియాతో మాట్లాడుతూ విజయవాడలో హిట్ టాక్ మొదలైతే ప్రపంచవ్యాప్తంగా ఆ సినిమా ఆదరణ అత్యద్భుతంగా ఉంటుందన్నారు. క్రేజ్‌వున్న రామ్‌చరణ్, జాన్వికపూర్‌లాంటి నటులు విజయవాడలో ఈవెంట్‌కు రావడం విజయవాడ ప్రజలకు లెక్కలేనంత ఆనందాన్ని ఇస్తుందన్నారు. పెద్ది సినిమా ఈవెంట్లో ప్రతి ఒక్కరూ పాల్గొని గ్రాండ్ సక్సెస్ చేయాలని ఎంపీ ఆకాంక్షించారు. ఏఆర్ రెహామాన్ ఈవెంట్లో తన పాటలతో అలరించనున్నట్లు చిన్ని తెలిపారు. జెన్ జీ తరమంతా రామ్‌చరణ్ విజయవాడ రావాలని కోరుకుంటున్నారని.. అదేవిధంగా మెగాస్టార్ చిరంజీవి, పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ కూడా వస్తే అభిమానుల ఆనందానికి కొదవే లేదని ఎంపీ అన్నారు.

ఈవెంట్‌కు కావలసిన అన్ని ఏర్పాట్లను సంబంధిత జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుని ఈవెంట్‌ను విజయవంతం చేస్తామని ఎంపీ అన్నారు. ఆరోజు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తిగా ట్రాఫిక్ డైవర్షన్‌పై దృష్టి పెట్టినట్లు తెలిపారు. పెద్ది చిత్రం భారీ విజయాన్ని అందుకోవాలని ఎంపీ ఆకాంక్షించారు. త్వరలో ఏపీఎల్ ప్రారంభం కానుందని, దానికి సంబంధించిన పనులు ఇప్పటికే పూర్తయ్యాయని.. మూడు ప్రాంతాల్లో ఏపీఎల్ నిర్వహిస్తున్నట్లు ఎంపీ తెలిపారు. హీరో రామ్‌చరణ్, ఏపీఎల్‌లోని టీం కెప్టెన్స్ అందరి చేతుల మీదుగా ఏపీఎల్ టీజర్‌ను ప్రారంభించినట్లు ఎంపీ చిన్ని తెలిపారు. కార్యక్రమంలో నాగుల్ మీరా, చిరంజీవి ఫ్యాన్స్ కృష్ణప్రసాద్, శ్యాం ప్రసాద్, సుగుణబాబు, శ్రేయాస్ మీడియా తదితరులు పాల్గొన్నారు.



# జగన్‌రెడ్డి దగా చరిత్ర

- నాడు తూతూ మంత్రంగా డీఎస్సీ నోటిఫికేషన్
- జాబ్ క్యాలెండర్ ఇవ్వకుండా మోసగించారు
- అందుకే గత ఎన్నికల్లో యువత బుద్ధిచెప్పింది
- ఆ అక్కసుతోనే నిరుద్యోగులపై గొడ్డలివేటు
- నేడు మెగా డీఎస్సీపై దగాకోరు ఆరోపణలు
- ఉద్యోగాలు సాధించిన వారిని అవమానిస్తున్నారు
- డైవర్షన్‌తో గ్రూప్ -1 పేపర్లు దిద్దించిన మీది
- శాప్‌చైర్మన్ అనిమిని, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి, శ్రీకాంత్ ధ్వజం



తిరుపతి(చైతన్యరథం): నాడు ఎన్నికలకు ముందు తూతూ మంత్రంగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు.. కేసులు వేసి ఆపాలని చూశారు..జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదు..20 లక్షల మంది నిరుద్యోగ యువతను మోసగించిన దగా చరిత్ర జగన్‌రెడ్డిదని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, రాంభూపాల్ రెడ్డి, శ్రీకాంత్ ధ్వజమెత్తారు. అందుకనే గత ఎన్నికల్లో యువత బుద్ధిచెప్పింది. ఆ అక్కసుతోనే నేడు మెగా డీఎస్సీపై గొడ్డలి పార్టీ విషప్రచారానికి పూనుకుందని ధ్వజమెత్తారు. డీఎస్సీపై తప్పుడు ఆరోపణలకు నిరసనగా తిరుపతి లక్ష్మీనారాయణ కళ్యాణ మండపంలో "నిరుద్యోగ యువతపై గొడ్డలివేటు" పేరిట నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి దాదాపు వెయ్యిమందికి పైగా కొత్తగా ఉద్యోగాలకు ఎంపికైన టీచర్లు హాజరయ్యారు. ఎంపికైన టీచర్లు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. అత్యంత పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు బాధ కలిగిస్తున్నాయి. పేద కుటుంబాల నుంచి కష్టపడి చదివి టీచర్ పోస్టులు సాధించిన యువత వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారంపై కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. రాజకీయంగా కక్ష తీర్చుకోవాలంటే ప్రత్యర్థి పార్టీగా మాతో తలపడండి, యువత జీవితాలతో ఆడుకోవడం తగునా? 2019 ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే డిఎస్సీ ద్వారా నిరుద్యోగ టీచర్లకు ఉద్యోగాలిస్తానని చెప్పిన జగన్ అయిదేళ్లపాటు ఒక్క టీచర్ పోస్టు అయినా భర్తీచేశారా? అని ప్రశ్నించారు. నిరుద్యోగ యువత గొడ్డలిపార్టీని తరిమితరిమి కొడతారని హెచ్చరించారు.

# అర్హులకే టిడ్కో ఇళ్లు

**వినియోగంలో లేని వాళ్ల కేటాయింపులు రద్దు చేయండి**

**గంగవరం నిర్వాసితులకు నిధులు వెంటనే విడుదల చేయాలి**

**టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు**



విశాఖపట్నం (చైతన్య రథం): విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గాజువాక నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశంలో అంశాలపై పల్లా శ్రీనివాసరావు స్పష్టమైన సూచనలు చేశారు.

**టిడ్కో ఇళ్లపై తక్షణ చర్యలు అవసరం**

ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ... టిడ్కో, రాజీవ్ గృహకల్ప పథకాల కింద కేటాయించిన అనేక ఇళ్లలో లబ్ధిదారులు ఇప్పటికీ నివాసం ఉండడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ల కేటాయింపులు జరిగి 17నుంచి 18 సంవత్సరాలు గడిచినా, కొన్ని ఇళ్లకు ఇప్పటికీ తాళాలు కూడా వేయని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.

ఖాళీగా ఉన్న ఇళ్లు అసాంఘిక శక్తులకు అడ్డాలుగా మారుతున్నాయని, గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు కేంద్రాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీని ప్రభావం చుట్టుపక్కల నివసిస్తున్న కుటుంబాలపై తీవ్రంగా పడుతోందని పేర్కొంటూ, ఇంతకాలం గడిచినా ఇళ్లలో నివాసం ఉండని లబ్ధిదారుల కేటాయింపులను సమీక్షించి, అవసరమైతే రద్దు చేసి అర్హులైన పేద కుటుంబాలకు తిరిగి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ అంశాన్ని గతంలో పలుమార్లు ప్రస్తావించినప్పటికీ ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేదని పేర్కొనగా, ఈసారి జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

**పెన్షన్ల మంజూరులో జాప్యం వద్దు**

గాజువాక నియోజకవర్గ పరిధిలో వితంతువులు, వికలాంగులు కొత్తగా దరఖాస్తు చేసుకున్న పెన్షన్ల మంజూరులో జాప్యం జరుగుతోందని ప్రస్తావించారు. అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ, సంబంధిత అధికారులను కోరారు.

**గంగవరం నిర్వాసితుల సమస్యలకు పరిష్కారం చూపాలి**

గంగవరం, దిబ్బపాలెం గ్రామాలకు చెందిన గంగవరం పోర్టు నిర్వాసితులకు చెల్లించాల్సిన రూ.లక్ష చొప్పున జీవనభృతి, ఇతర ఆర్థిక ప్రయోజనాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని పల్లా శ్రీనివాసరావు అధికారులను కోరారు. నిర్వాసితుల సమస్యలు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వారికి రావాల్సిన నిధులను తక్షణమే జమ చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ అంశంపైనా జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం**

గాజువాక నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతి వేదికపై ప్రస్తావిస్తూ వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా, పెండింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా అధికార యంత్రాంగంతో సమన్వయం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో విశాఖపట్నం జిల్లా ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సాలూరులో "స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర"

**- స్కూటర్‌పై వెళ్లి వీధులు శుభ్రపరిచిన మంత్రి సంధ్యారాణి**

**- ఖరీఫ్-2026కు భారీఎత్తున విత్తన పంపిణీ**

సాలూరు (చైతన్య రథం): రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శుక్రవారం సాలూరు మెంటాడ వీధిలో (1,2 వార్డులు) "స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో పాల్గొని కాలువలు మరియు వీధులను స్వయంగా శుభ్రపరిచారు. ఇంధన పొదుపు సందేశాన్ని చాటిచెప్పేందుకు మంత్రి కారుకు బదులు స్కూటర్‌పై కార్యక్రమ స్థలానికి చేరుకున్నారు. స్థానిక మహిళలతో కలిసి అరుగులపై కూర్చొని కాఫీ తాగిన మంత్రి, ప్రజలతో ఆత్మీయంగా కలిసిపోయారు. అదే సందర్భంలో మంత్రి సంధ్యారాణి ఖరీఫ్-2026 సీజన్‌కు రైతులకు భారీఎత్తున రాయితీ విత్తనాల పంపిణీని అధికారికంగా ప్రారంభించారు. జిల్లాలో ఖరీఫ్ సాగుకు అవసరమైన మొత్తం 22,348 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

**గిరిజన రైతులకు ప్రత్యేక రాయితీలు**

ఇందులో 8,883 క్వింటాళ్ల వరి విత్తనాలను 90 శాతం రాయితీపై గిరిజన రైతులకు అందజేయనున్నారు. పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు కూడా ఎస్టీ రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 50 శాతం రాయితీతో పంపిణీ చేయనున్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో 802 టార్పాలిన్లు మరియు 14 ఆయిల్ ఇంజన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సాలూరు నియోజకవర్గ రైతులకు 8,100పీవీఎస్ కిట్లు పంపిణీ చేశారు.

**ప్రకృతి వ్యవసాయ కార్యాచరణ పుస్తకావిష్కరణ**

కార్యక్రమంలో మంత్రి సంధ్యారాణి ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే ప్రకృతి వ్యవసాయ కార్యాచరణ పుస్తకాన్ని ఆవిష్కరించారు. వాతావరణ



మార్పుల నేపథ్యంలో రైతులకు మార్గనిర్దేశం చేసేందుకు ఈ పుస్తకం ఎంతగానో ఉపకరిస్తుందని అధికారులు తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు, వ్యవసాయ పరికరాలు సకాలంలో అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి స్పష్టం చేశారు. "ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల సారవంతత, తేమ నిల్వ సామర్థ్యం పెరుగుతాయి. దీంతో రైతుల ఆదాయం పెంపొందించడమే మా ప్రభుత్వ లక్ష్యం" అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు.

# విద్యతోనే అత్యుత్తమ స్థానాలు

- **రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి సవిత**
- **పేదల విద్యకు కుల సంఘాల బాసట అభినందనీయం**
- **కూటమి రాకతో ప్రభుత్వ విద్యకు మహర్దశ**
- **ప్రభుత్వ విద్యా సంస్థల్లో క్రీడలకూ ప్రాధాన్యం**
- **104మంది విద్యార్థులకు భక్త కనకదాస పురస్కారాలు**
- **కురమ సంఘ సౌజన్యంతో పురస్కారాలు అందజేసిన మంత్రి**
- **సొంత నిధులతో విద్యార్థలకు పురస్కారాలు, బ్యాగులు**

గుంటూరు (చైతన్య రథం): విద్యతోనే అత్యున్నత స్థానాలు సాధ్యమని, తల్లిదండ్రులు తమ బిడ్డలను ఉన్నత విద్య అభ్యసించేలా ప్రోత్సహించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. కూటమి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యమిస్తోందని, ఇటీవల విడుదలైన టెన్త్, ఇంటర్ ఫలితాలే దీనికి నిదర్శమని అన్నారు. తన తండ్రి పేరు మీద ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. గుంటూరులోని దేవరసాయి కృష్ణ కల్యాణ మండపంలో టెన్త్, ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన 104మంది కురుబ, కురుమ, కురవ సామాజిక వర్గీయ విద్యార్థులకు ఉమ్మడి గుంటూరు కురమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భక్త కనకదాస పేరుతో ఏర్పాటు చేసిన ప్రతిభ పురస్కారాలు మంత్రి సవిత అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యుత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు కుల సంఘాలు బాసటగా నిలవడం అభినందనీయమన్నారు. విద్యలో రాణిస్తున్న పేద విద్యార్థులకు ఈ సత్కరాలు మరింత ప్రోత్సాహమిస్తాయన్నారు. ఏపీలో విద్యా వ్యవస్థను రాష్ట్ర ఐటీ, విద్య మంత్రి నారా లోకేశ్ అత్యున్నత స్థానాలకు తీసుకెళుతున్నారన్నారు. గత పాలనలో భ్రష్టుపట్టిన విద్యా వ్యవస్థను ఆయన గాడిన



పెడుతున్నారన్నారు. కేవలం విద్యతోనే సరిపెట్టకుండా, క్రీడల్లోనూ ప్రోత్సహించేలా బీసీ గురుకులాల్లో స్పోర్ట్స్ కిట్లు అందజేయబోతున్నామన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చిదిద్దుతున్నామన్నారు. విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. తల్లిదండ్రులు, సమాజం గర్వించేలా ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లల మనోభావాలకు గౌరవిమిస్తూ, ఉన్నత విద్య చదివేలా ప్రోత్సహించాలని మంత్రి పిలుపునిచ్చారు.

**104మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు**

కురమ సంక్షేమ సంఘం ఆధ్వర్యలో కురుబ, కురుమ, కురవ సామాజిక వర్గానికి చెందిన 104మంది విద్యార్థులకు భక్త కనకదాస పురస్కారాలను మంత్రి సవిత అందజేవారు. రూ.3.30 లక్షల విలువ చేసే నగదు ప్రోత్సాహకాలు మంత్రి చేతుల మీదుగా అందజేశారు. టెన్త్‌తోపాటు సెకండ్ ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన వారికి ఈ ప్రోత్సాహకాలు అందజేశారు. టెన్త్, సెకండ్ ఇంటర్‌లో కురుబ, కురుమ, కురవ సామాజిక వర్గంలో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన ఇద్దరు విద్యార్థులకు రూ.5 వేల చొప్పున రూ.10వేలు అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన 20మంది టెన్త్, ఇంటర్ విద్యార్థులకు రూ.3 వేల చొప్పున రూ.30 వేలు అందజేశారు. తృతీయ స్థానంలో నిలిచిన 20మంది విద్యార్థులకు రూ.2 వేలు చొప్పున రూ.40 వేలు అందజేశారు. మరో 120 మంది విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున రూ.లక్షా 20 వేలు ప్రోత్సాహక నగదు రూపంలో అందజేశారు.

**బ్యాగ్‌లు, నగదు అందజేసిన మంత్రి సవిత**

అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సొంతంగా రూ.లక్ష నగదు, 200 స్కూల్ బ్యాగ్‌లను మంత్రి సవిత అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్‌లో, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన కురుబ, కురుమ, కురవ సామాజిక వర్గానికి చెందిన నలుగురు విద్యార్థులకు రూ.25 వేల చొప్పున మంత్రి సవిత తన తండ్రి పేరిట ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ ద్వారా అందజేశారు. 200 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. తన తండ్రి. మాజీ మంత్రి ఎస్ రామచంద్రారెడ్డికి విద్యపట్ల మక్కువ ఎక్కువని మంత్రి సవిత తెలిపారు. తమ ట్రస్ట్ ద్వారా ఎందరో పేద విద్యార్థులకు ఆర్థిక సాయమందిస్తున్నామన్నారు. ఈ ఏడాది టెన్త్‌లో ప్రభుత్వ పాఠశాలలో చదివి 550 పైబడి మార్కులు సాధించిన 24మంది విద్యార్థులకు రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయమందించామన్నారు. ఇంటర్ సెకండియర్‌లో 950 పైబడి మార్కులు సాధించిన 70మందికి రూ.50 వేల చొప్పున అందించామన్నారు. బీటెక్ విద్యార్థులకు లాప్ ట్యాప్‌లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కురుమ సంఘం ప్రతినిధులు మర్రి వెంకట సత్యనారాయణ, తట్టి అర్జున రావు, ఎం.సత్యనారాయణ, బక్కా రామకృష్ణ, కార్పొరేటర్ ఎస్.శ్రీనివాసరావు, మర్రిపాటి రమేశ్, లంబు నాగేశ్వరరావు, వెంకట్రామయ్య, దన్నే అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# చెత్తనుంచి సంపద సృష్టించాలి

- చెత్తను ఇంధన ప్రత్యామ్నాయాలకు వినియోగించాలి
- గ్రామాలనుంచి నగరాల వరకు చెత్తను వేరు చేసే ప్రక్రియ మారాలి
- డంపింగ్ యార్డులులేని రాష్ట్రంగా ఏపీ రూపుదిద్దుకోవాలి
- జిందాల్ వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంటు సందర్శనలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్





పల్నాడు (చైతన్య రథం): చెత్తనుంచి విద్యుత్తు తయారీ అనేది ఇంధన రంగానికి ప్రత్యామ్నాయంగా, పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో తోడ్పడుతుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. చెత్తను క్రమపద్ధతిలో సేకరిస్తే దాని వినియోగం ద్వారా అద్భుతాలు చేయవచ్చని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా కొండవీడులోని జిందాల్ వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంటును శనివారం సందర్శించిన పవన్ కళ్యాణ్, చెత్తనుంచి విద్యుత్తు తయారీ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. చెత్తను ఎలా వేరు చేస్తారు, ప్లాంట్‌లో ఎలా శుద్ధి చేస్తారు, బాయిలర్లలో మండించడం ద్వారా విద్యుత్తు ఎలా ఉత్పత్తి అవుతుందో, చివరికి మిగిలే బూడిదను ఇటుకల తయారీకి ఎలా ఉపయోగించుకోవచ్చో ప్లాంటు అధికారులు వివరించారు. ప్లాంటు ఆపరేషన్స్ హెడ్ ఎం.వి.చారి ఆంధ్రప్రదేశ్‌లో చెత్త సేకరణ అవకాశాలపై ప్రత్యేక నివేదిక సిద్ధం చేశారని తెలపడంతో, పూర్తి ప్రజెంటేషన్ కోసం ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక సమయాన్ని కేటాయించారు.

**రాష్ట్రంలో మరో 6 ప్లాంట్లు**

రాష్ట్రంలో రోజువారీగా 7,200 టన్నుల పొడి చెత్త ఉత్పత్తి అవుతోందని పవన్ కళ్యాణ్ తెలిపారు. కొండవీడు జిందాల్ ప్లాంటు రోజువారీ 1,400 టన్నుల పొడి చెత్తను ప్రాసెస్ చేసి సగటున 20 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయగలదని వివరించారు. విశాఖపట్నంలోని జిందాల్ ప్లాంటు ఉత్తరాంధ్ర రీజియన్ చెత్తను సేకరించి 15 మెగావాట్ల విద్యుత్తు ఉత్పాదన చేస్తోంది. ఈ తరహా ప్లాంట్లను రాష్ట్రంలో మరో 6 చోట్ల ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. కాకినాడలో ఇప్పటికే పనులు మొదలయ్యాయని, నెల్లూరు, కడప, కర్నూలు, విజయవాడ, తిరుపతి ప్రాంతాల్లో కూడా త్వరలో ఏర్పాటు చేస్తారని వెల్లడించారు. ఒక మెగావాట్ విద్యుత్తు ఉత్పత్తికి ప్లాంటు నిర్మాణానికి రూ.25 కోట్లు ఖర్చవుతుందని, సగటున 2.5 టన్నుల చెత్త అవసరమవుతుందని, 4.5 టన్నుల స్టీమ్ వినియోగం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ ప్లాంట్ల ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

**కాలుష్యరహిత గోదావరి పుష్కరాలు**

గోదావరి పుష్కరాలను కాలుష్యరహితంగా నిర్వహించాలనే పట్టుదలతో కూటమి ప్రభుత్వం ఉందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పుష్కరాలకు ప్రత్యక్షంగా భాగస్వామ్యులయ్యే 268 పంచాయతీల్లో చెత్త నిర్వహణ కీలకమని, నదిలోకి వ్యర్థాలు చేరకుండా పంచాయతీ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు.

**సింగపూర్, ఇండోర్ నమూనా ఆదర్శం**

సింగపూర్ 90 శాతం చెత్తను కాల్చి విద్యుత్తు ఉత్పత్తి చేస్తోందని, ఆ దేశం వినియోగించే విద్యుత్తులో 2.8 శాతం చెత్త నుంచే వస్తోందని ఉప ముఖ్యమంత్రి వివరించారు. సింగపూర్ టాంజాంగ్ టెర్మినల్ తరహాలో విశాఖపట్నం పోర్టులో కూడా చెత్తను వేరు చేసే ప్రక్రియ ప్రారంభించేలా ఆలోచిస్తున్నారని తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరపాలక సంస్థ చెత్త సేకరణ విధానం ఆదర్శంగా నిలవాలని, ఆ మోడల్‌ను రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు అనుసరించాలని పవన్ సూచించారు.

బయో మిథనైజేషన్ ప్లాంట్ల ద్వారా పూలు, పండ్లు, కూరగాయలు, ఆహార వ్యర్థాలను వేరు చేసి బయోగ్యాస్ కూడా ఉత్పత్తి చేయవచ్చని ఆయన తెలిపారు. ప్రతి 100 కిలోమీటర్లకు ఒక వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంటు ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రాన్ని డంపింగ్ యార్డు రహితంగా తీర్చిదిద్దవచ్చని వివరించారు. పంచాయతీల్లో చెత్త నిర్వహణపై క్లస్టర్ల వారీగా అవగాహన కార్యక్రమాలు, వర్క్‌షాపులు నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు.

---

### పేద విద్యార్థుల అభ్యున్నతికి

## కూటమి ప్రభుత్వం కృషి

**చదువుతోపాటు విజ్ఞానం, నైపుణ్యం పెంపొందించుకోవాలి: మంత్రి డోలా పిలుపు**



ప్రకాశం /కొండపి (చైతన్య రథం): పేద విద్యార్థుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.95 లక్షలతో నిర్మించనున్న నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి మంత్రి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...."పేద విద్యార్థుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. విద్యార్థులకు కావలసిన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. విద్యా వ్యవస్థలో మంత్రి లోకేష్ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. యువతకు విద్యతోపాటు నైపుణ్య శిక్షణ అందిస్తున్నాం. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల ద్వారా స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి వర్క్ ఫ్రం హోం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. విద్యార్థులు చదువుతోపాటు విజ్ఞానం, నైపుణ్యం పెంపొందించుకోవాలి. ప్రతి విద్యార్థి పుస్తకాలు చదవడం అలవాటుగా మార్చుకోవాలి. విద్యార్థుల్లో పుస్తక పఠనంపట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి" అని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పిలుపునిచ్చారు.

---

## సత్యాజీ మా బడా సాబ్

**మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ఆత్మీయ పలకరింపు**



విశాఖపట్నం (చైతన్యరథం): "సత్యాజీ.. మా బడా సాబ్" అంటూ కేంద్ర వస్త్ర, జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ఆప్యాయంగా పలకరించారు. ఇందుకు విశాఖ విమానాశ్రయం శనివారం వేదిక నిలిచింది. రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని పంచుకుంటూ ఆప్యాయంగా "సత్యాజీ బడా సాబ్", "సత్యాజీ మా నాయకుడు" అంటూ గతంలో వారిద్దరూ కలిసి పనిచేసిన సందర్భాలను కేంద్ర మంత్రి గుర్తు చేసుకున్నారు. దేశంలో మంజూరైన ఏకైక మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, ముఖ్యంగా ధర్మవరం నియోజకవర్గానికి మంజూరు చేసినందుకు కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్‌కి మంత్రి సత్యకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. హ్యాండ్లూమ్ రంగ అభివృద్ధి, నేతన్నల సంక్షేమం, పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై వారిద్దరూ చర్చించారు. మరోవైపు భారతీయ జనతా పార్టీ జాతీయ సహ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) శివప్రకాశ్ జీని కూడా మంత్రి సత్యకుమార్ కలుసుకున్నారు.

---

### ఏపీలో విభిన్న వాతావరణం

## పిడుగులతో వర్షాలు



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో ఒకవైపు పిడుగులతో కూడిన వర్షాలు, మరోవైపు తీవ్రమైన ఎండ ప్రభావంతో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ శనివారం వెల్లడించారు. దక్షిణ ఒడిశా మీదుగా ఉత్తరాంధ్ర వరకు సముద్ర మట్టానికి సగటున 0.9 కి.మీ. ఎత్తులో ద్రోణి విస్తరించి ఉందని ఆయన తెలిపారు. దీని ప్రభావంతో ఆదివారం అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మిగతా జిల్లాల్లోనూ చెదురుమదురుగా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శనివారం సాయంత్రం 5 గంటలనాటికి నమోదైన వర్షపాతం వివరాలు పరిశీలిస్తే –అనంతపురం జిల్లా హుస్సేన్‌పురంలో అత్యధికంగా 51 మి.మీ., కడప జిల్లా పెద్దపసుపల్లెలో 45 మి.మీ., చిత్తూరు జిల్లా గంగవరంలో 41.7 మి.మీ., అనంతపురం జిల్లా వెన్నపూసపల్లెలో 31.5 మి.మీ., కడప జిల్లా ఉప్పలూరులో 29 మి.మీ., తొర్రివేముల మరియు పొత్తిపాడులో చెరో 26 మి.మీ., నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో 20.5 మి.మీ. వర్షపాతం నమోదైంది అన్నారు.

**17 మండలాల్లో వడగాల్పుల హెచ్చరిక**

మరోవైపు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో 42–44 డిగ్రీల మధ్య గరిష్ఠస్థాయికి చేరే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా 17 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. మన్యం జిల్లా సీతంపేట; పోలవరం జిల్లా చింతూరు, దేవీపట్నం, కూనవరం, మారేడుమిల్లి, రంపచోడవరం, వరరామచంద్రాపురం; ఏలూరు జిల్లా బుట్టాయగూడెం, పోలవరం, వేలేరుపాడు; కృష్ణా జిల్లా ఘంటసాల, మొవ్వ; గుంటూరు జిల్లా కాకుమాను, పొన్నూరు; బాపట్ల జిల్లా బాపట్ల, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఆకస్మికంగా ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్లకింద, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్‌కింద నిలబడొద్దని ప్రఖర్ జైన్ సూచించారు. పొలాల్లో పనిచేసే రైతులు, పశు కాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆయన హితవు చెప్పారు. అలాగే ఎండ తీవ్రత దృష్ట్యా కూడా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చైతన్యరథం

# నల్లమలలో చరిత్ర జాడల

- అన్వేషణకు ఏఎస్ఐకి అనుమతి
- వన్యప్రాణులు, అటవీ పరిరక్షణ లక్ష్యాలకు భంగం కలగకుండా అటవీ శాఖ సహకారం
- ఏఎస్ఐ బృందానికి శుభాకాంక్షలు తెలిపిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- ఎకో టూరిజం అభివృద్ధికి కొత్త అవకాశాలు దక్కుతాయని ఆకాంక్ష



అమరావతి (చైతన్య రథం): అడవులు జీవ వైవిధ్యంతోపాటు చారిత్రక పురావస్తు, సాంస్కృతిక సంపదకు నిలయాలు. అలాంటి అమూల్యమైన వారసత్వ సంపదను గుర్తించి, సంరక్షించడంతోపాటు మన చరిత్ర, సంస్కృతిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అటవీ ప్రాంతాల్లోని చారిత్రక కట్టడాలు, పురావస్తు అవశేషాలు ఎకో టూరిజం అభివృద్ధికి సరికొత్త అవకాశాలు సృష్టిస్తాయన్నారు. ప్రకృతి, వారసత్వ సంపదలపట్ల ప్రజల్లో చైతన్యం కలిగిస్తాయని అభిప్రాయపడ్డారు. నల్లమల అటవీ ప్రాంతంలో దాగి ఉన్న అమూల్యమైన చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను గుర్తించి, సంరక్షించేందుకు, శాసనాల సర్వే నిర్వహించేందుకు భారత పురావస్తు సర్వేక్షణ సంస్థ (ఏఎస్ఐ)కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. గతంలో వైఎస్ఆర్ కడప జిల్లాలోని లంకమల అటవీ ప్రాంతంలో నిర్వహించిన సర్వేలో క్రీస్తు పూర్వం 1వ శతాబ్దంనుంచి క్రీస్తుశకం 16వ శతాబ్దం వరకు సుమారు 30 శాసనాలు వెలుగు చూశాయి. 10 వేల సంవత్సరాలనాటి గుహ చిత్రాలను గుర్తించారు. ఈ శాసనాలు శాతవాహనుల కాలం, బౌద్ధ, శైవ సంప్రదాయాలతోపాటు ప్రాచీన యాత్రా మార్గాలను, ఆది మానవ జీవన విధానాలకు సంబంధించి విలువైన సమాచారాన్ని వెలుగులోకి తెచ్చాయి.

భారత పురావస్తు సంస్థ చేపట్టనున్న తాజా సర్వే తెలుగు, దేవనాగరి లిపుల్లో లిఖించిన శాసనాలపై దృష్టి సారించి మన ప్రాచీన రాజ్యాలు, సంస్కృతి, సంప్రదాయాలు, దక్షిణ భారత చరిత్రను మరింత లోతుగా అధ్యయనం చేసే వీలు కల్పిస్తుంది. ఈ సర్వేపై స్పందించిన పవన్ కళ్యాణ్ ఏఎస్ఐ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ "వన్యప్రాణుల సంరక్షణ, అటవీ పరిరక్షణ లక్ష్యాలకు భంగం కలగకుండా రాష్ట్ర అటవీ శాఖ అధికారులు పూర్తి సహకారం అందించాలి. ప్రకృతి సంపదతోపాటు సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తూ భావితరాలకు అందించే విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకు వెళ్తుంది" అని స్పష్టం చేశారు.

## ఎన్టీఆర్ భరోసా జూన్ పెన్షన్లకు రూ. 2728 కోట్లు విడుదల



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రవ్యాప్తంగా జూన్ నెలలో ఇవ్వనున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు కూటమి ప్రభుత్వం రు.2728.67 కోట్లు విడుదల చేసినట్టు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తగా 5606 స్పౌజ్ పింఛన్లు మంజూరు కాగా... లబ్ధిదారులకు రూ.2.24 కోట్లను ప్రభుత్వం ప్రత్యేకంగా విడుదల చేసిందన్నారు. ఈ నిధులన్నీ జూన్ 1న సోమవారం ఉదయం నుంచే లబ్ధిదారులకు నేరుగా పంపిణీ చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జూన్ నెలతో కలుపుకుని ఇప్పటి వరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కోసం రికార్డుస్థాయిలో రూ.65,886.57 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. అవ్వాతాతలు, నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ నిధులను ప్రతి నెలా 1నే లబ్ధిదారులకు అందిస్తోందని మంత్రి కొండపల్లి తెలిపారు.

# పారదర్శకంగా మెగా డీఎస్సీ... ఏ చిన్న తప్పూ జరగలేదు

- నిజాలనే రిపోర్ట్ చేయండి... అవాస్తవాలు నమ్మొద్దు
- అవాస్తవ కథనాలపై రిక్రూటైన టీచర్లు బాధపడొద్దు
- ఉద్యోగాలు దక్కించుకున్న వారంతా కష్టపడి చదివిన వారే
- నిబంధనల ప్రకారమే స్పోర్ట్స్ కోటాలో నియామకాలు
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగి నవీన్ కేసులో కోర్టులు చెప్పినట్లే నడుచుకున్నాం
- హారిజాంటల్ రిజర్వేషన్ల విధానం కొందరికి అర్థం కాకపోవచ్చు
- అన్ని జిల్లాల స్కోర్స్ ముందుగానే పబ్లిష్ చేశాం
- ప్రతీ సబ్జెక్టుకు 3 వేల ప్రశ్నలు రూపొందించాం...
- లీకేజీ అనే ప్రశ్నే ఉత్పన్నం కాదు
- ప్రతిష్టాత్మక పోటీ పరీక్షలు నిర్వహించిన టీసీఎస్ ఐయాన్‌తో మెగా డీఎస్సీ నిర్వహణ
- ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు ప్రచారం చేసిన వారిపై కేసులు పెడతాం
- పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్



అమరావతి (చైతన్య రథం): మెగా డీఎస్సీ-2025 నిర్వహణలో ఎలాంటి పొరపాట్లూ.. తప్పిదాలు జరగలేదని విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ స్పష్టం చేశారు. గతేడాది డీఎస్సీ ద్వారా రిక్రూటైన అభ్యర్థులు ఎవరూ బాధపడవద్దన్నారు. కష్టపడి చదివి డీఎస్సీ ద్వారా ఉద్యోగాలను పొందారన్నారు. డీఎస్సీ నిర్వహణపై జరుగుతోన్న దుష్ప్రచారాన్ని, అవాస్తవాలను నమ్మొద్దని కోరారు. గత కొంత కొన్ని రోజులుగా మెగా డీఎస్సీ-2025 నిర్వహణపై రాజకీయ దురుద్దేశంతో కొన్ని పార్టీలు, పత్రికలు చేస్తోన్న దుష్ప్రచారానికి విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ శనివారం విద్యా భవన్‌లో నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్సులో స్పందించారు. ఇప్పటి వరకు ఏయే అంశాల్లో దుష్ప్రచారం జరుగుతుందో.. ఆ అంశాలపై సృష్టించిన అనుమానాలపై పూర్తి స్పష్టతనిచ్చారు. కొన్ని రోజులుగా డీఎస్సీ నిర్వహణపై చేస్తోన్న తప్పుడు ప్రచారంలో భాగంగా లేవనెత్తిన ప్రతీ ఆరోపణా తప్పేనంటూ ఆధారాలతో సహా ప్రెస్‌మీట్ నిర్వహించారు. మెగా డీఎస్సీ 2025 నిర్వహణ ప్రక్రియను ఆసాంతం వివరిస్తూ మీడియా సమావేశంలో కోన శశిధర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... "మెగా డీఎస్సీ-2025ను అత్యంత పారదర్శకంగా నిర్వహించాం. అభ్యర్థులు కష్టపడి చదవి ఉద్యోగాలు పొందారు. 2018 తర్వాత మళ్లీ 2025లో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాం. డీఎస్సీ నిర్వహణను సవాల్ చేస్తూ అడ్డుకునేందుకు 241 కేసులు వేశారు. వాటిని ఎదుర్కొని.. కోర్టుల్లో సరైన వాదనలు వినిపించి.. కోర్టు అనుమతులతో రికార్డు టైంలో 148 రోజుల్లో డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేశాం. పండుగ వాతావరణంలో రిక్రూట్మెంట్ లెటర్లు ఇచ్చాం. గతేడాది జరిగిన డీఎస్సీ నిర్వహణలో తప్పిదాలు జరిగాయంటూ ఇప్పుడు మళ్లీ ఆరోపణలు వస్తున్నాయి. డీఎస్సీ నిర్వహణలో ఎలాంటి పొరపాట్లూ జరగలేదని ఘంటాపథంగా చెబుతున్నాను. అయితే అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు కాబట్టి.. ప్రజలకు వాస్తవాలు వివరించాల్సిన బాధ్యత మాపై ఉంది. మెగా డీఎస్సీ-2025ను అత్యంత పారదర్శకంగా నిర్వహించాం. అభ్యర్థులు కష్టపడి చదవి ఉద్యోగాలు పొందారు. 2018 తర్వాత మళ్లీ 2025లో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాం. డీఎస్సీ నిర్వహణకు టెట్ నోటిఫికేషన్ ఇవ్వడమనేది మాండేటరి కాబట్టి.... ఆ నోటిఫికేషన్ కూడా ఇచ్చాం. టెట్-డీఎస్సీ మధ్య సమన్వయం ఉంది కాబట్టే ఇంత చక్కగా నిర్వహించగలిగాం. నార్మలైజేషన్ ప్రక్రియను ఏవిధంగా చేస్తామోననే అంశాన్ని కూడా ముందుగానే వివరించాం. చిన్న పొరపాటు లేకుండా అత్యుత్తమంగా డీఎస్సీ నిర్వహించాం. టీచర్ ఉద్యోగాలు ఇచ్చాం. ఎస్సీ వర్గీకరణ, వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లు అమలు చేశాం. ప్రతీ అంశాన్ని ఆన్‌లైన్లో పొందుపరిచాం. వెబ్ సైట్లో పెట్టాం. గడిచిన డీఎస్సీల నిర్వహణ అనుభవంతో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం" అని కోన శశిధర్ వివరించారు.

### ప్రతిష్టాత్మక పోటీ పరీక్షలు నిర్వహించిన సంస్థతో డీఎస్సీ నిర్వహణ

"154 టీసీఎస్ ఐయాన్ సెంటర్లల్లో ఈ డీఎస్సీ పరీక్ష నిర్వహించాం. ఒకే సబ్జెక్టుకు వివిధ తేదీల్లో పరీక్షలు నిర్వహించాం. కాబట్టి వేర్వేరు పేపర్లే ఉంటాయి. ఒక్కో సబ్జెక్టుకు సుమారు 3 వేల క్వశ్చన్లతో క్వశ్చన్ బ్యాంకు రూపొందించాం. పర్మినెంట్ ఉద్యోగులైన ఇద్దరికి మాత్రమే క్వశ్చన్ బ్యాంకుకు యాక్సెస్ ఉంటుంది. ప్రతి రోజూ పాస్ వర్డ్స్ మారుతూ ఉంటాయి. ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్, గేట్, ఎన్టీఏ, సీఏటీ, ఏపీపీఎస్సీ, హైకోర్ట్ పరీక్షలు వంటివి నిర్వహించిన టీసీఎస్ ఐయాన్‌కే ఈ బాధ్యతలు అప్పగించాం. ఇది మాన్యువల్ ఎగ్జామ్ కాదు.. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్-సీబీటీ పద్ధతిలో మెగా డీఎస్సీ నిర్వహించాం. అన్ని జిల్లాల స్కోర్స్ వెబ్ సైట్లల్లో పబ్లిష్ చేశాం. టెట్, డీఎస్సీ స్కోర్స్ కూడా వెబ్ సైట్లల్లో పబ్లిష్ చేశాం. ఇప్పటికీ ఉన్నాయి. స్కోర్స్ ఇవ్వలేదని చేస్తున్న ఆరోపణలు అవాస్తవం. సర్టిఫికేట్ వెరిఫికేషన్‌లో భాగంగా ముందుగా ఆన్ లైన్‌లో అప్లోడ్ చేయాలని నిబంధన పెట్టాం. అయితే వెరిఫికెషన్‌కు వచ్చినప్పుడు సర్టిఫికెట్లు తెస్తామని రిక్వెస్ట్ చేయడంతో ప్రభుత్వం అంగీకరించింది. గతానుభవాల దృష్ట్యా వెయిటింగ్ లిస్టు కాకుండా.. 1:1 పద్ధతిలో పిలిచాం. దీన్ని ఆనాడే అందరికీ చెప్పాం. వెరిఫికేషన్‌లో ఎవరైనా ఫెయిల్ అయితే ఆ తర్వాత వారిని వెరిఫికేషన్‌కు పిలిచాం. హారిజంటల్ రిజర్వేషన్లలో స్పోర్ట్స్, మహిళ, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్ కోటాలు ఉంటాయి. ఇలాంటి జాగ్రత్తలు తీసుకున్నాం కాబట్టే కోర్టులు డీఎస్సీ-2025 నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. ప్రస్తుతం పేపర్లల్లో వస్తోన్న కథనాలన్నీ హారిజాంటల్ రిజర్వేషన్లకు సంబంధించినవే. ప్రతి ఫిర్యాదును పరిశీలించాం, సమాధానాలిచ్చాం. ఎవరికైనా అనుమాలుంటే.. వారికున్న అనుమానాలను నివృత్తి చేశాం. సంవత్సరం అయిన తర్వాత ఇప్పుడు ఆరోపణలు చేయడం ఆశ్చర్యంగా ఉంది" అని విద్యాశాఖ కార్యదర్శి అన్నారు.

### నవీన్ ఎపిసోడ్‌లో కోర్టులు మా వాదననే బలపరిచాయి

"నవీన్ అనే అభ్యర్థి ఎస్సీఈఆర్టీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి. రెండు పరీక్షలు రాశారు.. ఓ దాంట్లో 1వ ర్యాంక్, రెండో దాంట్లో 6వ ర్యాంక్ వచ్చింది. అతను సెలెక్షన్ లిస్టులో ఉన్నారు.. కానీ వెరిఫికేషన్ కోసం రాలేదు. దీంతో నిబంధన ప్రకారం అతణ్ని రిక్రూట్మెంట్ చేయలేకపోయాం. ఆ తర్వాత నవీన్ కోర్టుకు వెళ్లాడు... కోర్టుల్లో మేమూ మా వాదనలు వినిపించాం. కోర్టు మా వాదనను బలపరిచింది. నవీన్ కేసులో కోర్టులు చెప్పినట్టే నడుచుకున్నాం. అతను వెరిఫికేషన్ ప్రక్రియకు ఎందుకు రాలేదో అతనికే తెలియాలి. లక్షల మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తే ఒక్కరు కూడా ఫిర్యాదు చేయలేదు... తప్పు పట్టలేదు. హారిజంటల్ రిజర్వేషన్లను కొందరు అర్థం చేసుకోలేకపోయారు. ప్రస్తుతం పేపర్లల్లో వస్తున్న వార్తలు అవాస్తమని చెబుతున్నాను... ఆధారాలతో సహా వచ్చాను. స్పోర్ట్స్ కోటాలో కూడా ఎలాంటి తప్పులు జరగలేదు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు దక్కించుకున్న వారు కూడా కష్టపడి ఉద్యోగాన్ని సాధించారు" అని శశిధర్ చెప్పారు.

### ప్రభుత్వ-ప్రైవేట్ బడుల మధ్య కాంపిటీషన్ ప్రారంభమైంది

"ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ప్రభుత్వ-ప్రైవేట్ బడుల మధ్య కాంపిటేషన్ ప్రారంభమైంది. మా టీచర్లు పిల్లల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ బడుల్లో చేర్పిస్తున్నారు. డీఎస్సీ-2025లో సెలెక్ట్ అయిన ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి పైకి వచ్చిన వారే. డీఎస్సీ నిర్వహణపై అవాస్తవాలు చెప్పొద్దు. ఏమైనా చెప్పాలనుకుంటే నిజాలు చెప్పండి. జరుగుతున్న అవాస్తవ ప్రచారంతో కష్టపడి చదివి టీచర్ ఉద్యోగాలు దక్కించుకున్న వారందరూ బాధపడతారు. టీచర్లెవ్వరూ బాధపడొద్దని కోరుతున్నాను. శాఖాపరంగా తప్పు ఏదైనా ఉంటే చెప్పండి. నేర్చుకోవడానికి మేం సిద్ధంగా ఉన్నాం. త్వరలో మరో డీఎస్సీని కూడా నిర్వహిస్తాం. దానికీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. తప్పుడు సమాచారాన్ని ప్రజలకు పంపొద్దు. నిజాలనే రిపోర్ట్ చేయండి. దయచేసి అబద్దాలు మాత్రం చెప్పొద్దు. ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు ప్రచారం చేసిన వారిపై కేసులు పెట్టాం" అని విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ స్పష్టం చేశారు.

# ఆర్టీసీ ఆధునికీకరణకు కీలక నిర్ణయాలు

- **గత ఐదేళ్లలో దెబ్బతిన్న సంస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టింది**
- **భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు విశాఖపట్నం నుంచి 40 ప్రత్యేక బస్సులు**
- **రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వహించిన ఏపీఎస్‌ఆర్టీసీ ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో బస్సుల ఆధునికీకరణ, ఈవీ బస్సుల విస్తరణ, ఉద్యోగుల సంక్షేమం తదితర అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. గత ఐదేళ్లలో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్న ఆర్టీసీని కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న స్త్రీ శక్తి పథకం ఏడాది విజయవంతంగా పూర్తి చేసుకుందని తెలిపారు.

రాష్ట్రంలో దశలవారీగా ఈవీ బస్సుల విస్తరణకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందని, తొలి దశలో 700 ఈవీ బస్సులు రెండు నెలల్లో అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. జూలై నెలలో ఆరు డిపోల్లో ఈవీ బస్సుల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు సిద్ధమవుతాయన్నారు. తిరుపతికి ప్రత్యేకంగా 300 ఈవీ బస్సులు కేటాయించగా మరో 500 ఈవీ బస్సుల కొనుగోలు ప్రక్రియ పూర్తయిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3వేల ఈవీ బస్సుల ఏర్పాటుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతోందని చెప్పారు. విశాఖపట్నం నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి 40 ప్రత్యేక బస్సులు కేటాయిస్తామని తెలిపారు. గోదావరి పుష్కరాల సందర్భంగా గోదావరి పేరున ప్రత్యేక బస్సు సర్వీసులను నిర్వహిస్తామన్నారు. ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య ఆర్టీసీ అవినాభావ అనుబంధమని పేర్కొన్నారు. పీపీపీ విధానంలో డిపోల ఆధునికీకరణ చేపడతామని, కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే నైట్ ఔట్ అలవెన్స్ సహా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించామని మంత్రి గుర్తు చేశారు. త్వరలో అందుబాటులోకి రానున్న కొత్త ఈవీ బస్సులతో ఆర్టీసీ మరింత కొత్త రూపు సంతరించుకుంటుందని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు.



## 'మెగా డీఎస్సీ'పై జగన్ కుట్రలు ఆపాలి

**కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం**



అమరావతి (చైతన్యరథం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మెగా డీఎస్సీ'పై జగన్ ఉద్దేశపూర్వకంగానే తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.

**"ప్రజలకు మంచి చేయడు.. ఎదుటివారు చేస్తుంటే ఓర్వలేడు"**

జగన్‌మోహన్ రెడ్డి మనస్తత్వంపై నాదెండ్ల బ్రహ్మం తీవ్ర విమర్శలు చేశారు. "జగన్ ప్రజలకు మంచి చేయడు, కనీసం పక్కనవారు చేస్తుంటే చూసి ఓర్చుకోలేడు. అందుకే సైకోలా ప్రవర్తిస్తూ మెగా డీఎస్సీపై దుష్ప్రచారం చేస్తున్నారు. గతంలో తాను సచివాలయ ఉద్యోగాలను అమ్ముకున్నట్లే, ఇప్పుడు అందరూ ఉద్యోగాలు అమ్ముకుంటారని అనుకోవడం జగన్ అవివేకానికి నిదర్శనం" అని బ్రహ్మం పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో జరిగిన నియామకాల్లో ఎలాంటి అవినీతికి తావులేదని ఆయన స్పష్టం చేశారు.

**నిరుద్యోగులను ముంచిన చరిత్ర జగన్‌ది..**

తన ఐదేళ్ల పాలనలో నిరుద్యోగులను జగన్ దారుణంగా వంచించారని నాదెండ్ల బ్రహ్మం ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక్క డీఎస్సీ కూడా వేయకుండా కాలయాపన చేశారని, ప్రతిఏటా 'జాబ్ క్యాలెండర్' ఇస్తామని చెప్పి ఒక్క ఏడాది కూడా ఇవ్వకుండా మోసం చేశారని గుర్తుచేశారు. అటు నోటిఫికేషన్లు ఇవ్వక, ఇటు ఉన్న కంపెనీలను రాష్ట్రం నుంచి తరిమేసి నిరుద్యోగుల భవిష్యత్తును జగన్ నిలువునా ముంచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కష్టపడి చదివిన 16వేల మందికి అవమానం**

ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉద్యోగాలను భర్తీ చేయడం, జాబ్ క్యాలెండర్ విడుదల చేయడాన్ని జగన్ జీర్ణించుకోలేకపోతున్నారని బ్రహ్మం విమర్శించారు. నిరుద్యోగుల్లో అపోహలు సృష్టించ డానికే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, రాత్రి పగలు కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించిన 16వేల మంది అభ్యర్థుల శ్రమను జగన్ అవమానిస్తున్నారని మండిపడ్డారు.

గతంలో టెన్త్ క్లాస్ పరీక్ష పేపర్లు కొట్టేసి పాసైన ఘన చరిత్ర, బీసీ నాయకుడు శివకుమార్ స్థాపించిన పార్టీని లాక్కున్న చరిత్ర జగన్‌కు ఉందని ఎద్దేవా చేశారు. జగన్ ఎన్ని కుట్రలు చేసినా, ఎంత ఏడ్చినా కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల పక్షాన నిలబడుతుందని.. మళ్లీ డీఎస్సీ వేయడం, జాబ్ క్యాలెండర్ అమలుచేయడం, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ఖాయమని నాదెండ్ల బ్రహ్మం స్పష్టం చేశారు.

## అగ్రపథాన మచిలీపట్నం

***పర్యాటకం, యువత, క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత - రోజంతా నియోజకవర్గ టూర్‌లో మంత్రి కొల్లు రవీంద్ర***



మచిలీపట్నం (చైతన్య రథం): మచిలీపట్నాన్ని రాష్ట్రంలోనే అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపి తీరుతానని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈమేరకు మచిలీపట్నం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల్లో పాల్గొన్నారు. ఉదయం మంగినపూడి బీచ్‌లో అభివృద్ధి పనులను పరిశీలించారు. మచిలీపట్నాన్ని పర్యాటక కేంద్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోంద న్నారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా బీచ్‌ను సుందరీకరించ డంతోపాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. బీచ్‌కు వచ్చే పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పారిశుధ్యం, రహదారులు, తాగునీరు, లైటింగ్‌వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. పర్యాటకరంగ అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా మచిలీపట్నం బీచ్ రోడ్డులో కూలిపోయిన చెట్లను స్వయంగా తొలగించారు. బీచ్‌కు వచ్చే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. అనంతరం మచిలీపట్నం 4వ డివిజన్‌లోని భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంగణాన్ని పరిశీలించారు. యువతలో నాయకత్వ లక్షణాలు, సేవాభావం పెంపొందించే దిశగా రానున్న రోజుల్లో ఏర్పాటు చేయనున్న యుత్ క్లబ్‌పై రిటైర్డ్ డీవైఈఓ అధికారి విజయలక్ష్మి, కృష్ణాజిల్లా భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్ మద్దూరి ప్రసాద్‌లతో కలిసి సమీక్ష నిర్వహించారు. యువతను క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలవైపు ప్రోత్సహించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా యువతలో క్రమశిక్షణ, సామాజిక బాధ్యత పెంపొందించాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. అదేవిధంగా మచిలీపట్నం 4వ డివిజన్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలించారు. యువత మరియు క్రీడాకారులకు మెరుగైన శిక్షణా సౌకర్యాలు అందించేందుకు అవసరమైన చర్యలపై అధికారులతో చర్చించారు. క్రీడా రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. మచిలీపట్నం సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, పర్యాటకం, యువత, క్రీడా రంగాల అభివృద్ధి ద్వారా నగరానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే తమ ప్రధాన ఉద్దేశమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## పచ్చదనం, పరిశుభ్రతకు కూటమి అధిక ప్రాధాన్యత

- **పరిసరాల పరిశుభ్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత**
- **గ్రామాభివృద్ధిపై సీఎం, డిప్యూటీ సీఎం ప్రత్యేక శ్రద్ధ**
- **మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి వెల్లడి**



ప్రకాశం/ కొండపి (చైతన్య రథం): గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత పెంపుకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నిధుల ద్వారా అందించిన స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర రిక్షాలు, చెత్త సేకరణ డబ్బాలు కొండపి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి డా.స్వామి మాట్లాడుతూ.. గ్రామాల్లో నూరు శాతం చెత్త సేకరణ జరగాలన్నారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. పరిసరాల పరిశుభ్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. ప్లాస్టిక్ రహిత స్వర్ణాంధ్రప్రదేశ్‌లో ప్రజలంతా భాగస్వామ్యం కావాలి. చెత్తపై పన్ను వేసి జగన్ ప్రజలను వేధిస్తే సీఎం చంద్రబాబు చెత్త నుంచి సంపద సృష్టిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి 20 నెలల పాలలలోనే గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. గ్రామాల అభివృద్ధిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

చైతన్యరథం

# 33శాతం మహిళ రిజర్వేషన్
# ఒక సామాజిక విప్లవం

- మహిళా సాధికారత అనేది తెలుగుదేశం పార్టీ జీన్స్‌లోనే ఉంది.. మాటల్లో కాదు చేతల్లో చూపించాం
- చట్టంతో సంబంధం లేకుండానే రాబోయే ఎన్నికల్లో మహిళలకు 33% సీట్లు ఇస్తున్న ఏకైక పార్టీ టీడీపీ
- మహిళా బిల్లుపై టీడీపీ నిర్ణయం... దేశంలోని జాతీయ, ప్రాంతీయ పార్టీలన్నింటికీ దిశానిర్దేశం
- మహానాడు చారిత్రాత్మక నిర్ణయంతో క్రెడిట్ ఎక్కడ పోతుందో అని 'గొడ్డలి పార్టీ'కి భయం పట్టుకుంది
- గత అరాచక ప్రభుత్వంలో నేనూ ఒక బాధితురాలినే.. సోషల్ మీడియా ట్రోలింగ్‌తో రాక్షసానందం పొందారు
- గొడ్డలి పార్టీపై మహిళలు తిరగబడే రోజు వచ్చింది..11 సీట్లకు పడిపోయిన ఆ పార్టీ భవిష్యత్తులో 'సింగిల్ డిజిట్'కే పరిమితం కావడం ఖాయం
- ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవిరెడ్డి

మంగళగిరి (చైతన్యరథం): మహానాడు–2026ను మహిళా సాధికారతకు అంకితం చేస్తూ తెలుగుదేశం పార్టీ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవిరెడ్డి పేర్కొన్నారు. పార్టీ పదవుల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్టు యువ నేత నారా లోకేష్ ప్రకటించడం మహిళల రాజకీయ ప్రగతికి కొత్తదారులు తెరిచిందన్నారు. మహిళా సాధికారత గురించి కేవలం మాటల్లో చెప్పడం కాకుండా ఆచరణలో చూపిస్తూ మహిళలకు సముచిత స్థానం కల్పిస్తున్న పార్టీ టీడీపీ మాత్రమే అన్నారు. మహిళలకు రాజకీయ అవకాశాలు, నాయకత్వ బాధ్యతలు అందించే దిశగా ఈ నిర్ణయం కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన "నారీ శక్తి వందన్" చట్టం దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఒక గొప్ప సంస్కరణగా నిలిచిందని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో తెలుగుదేశం పార్టీ మహిళలకు మరిన్ని రాజకీయ అవకాశాలు కల్పించేందుకు ముందడుగు వేయడం అభినందనీయమన్నారు. ఎన్టీఆర్ మహిళను ఒక శక్తిగా భావించి వారి అభ్యున్నతికి అనేక సంస్కరణలు చేపట్టారని గుర్తు చేశారు. మహిళా సంక్షేమం కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీయేనని, విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబనతో పాటు రాజకీయ సాధికారత కూడా మహిళలకు అందాలనే లక్ష్యంతో పార్టీ ఎప్పటి నుంచో పని చేస్తోందన్నారు. ఎన్టీఆర్ మహిళలకు ఆస్తి హక్కు కల్పించి సామాజిక న్యాయానికి బాటలు వేస్తే చంద్రబాబునాయుడు స్థానిక సంస్థల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు చేసి మహిళల రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత పెంచారని తెలిపారు. మహిళల అభివృద్ధి కోసం ప్రత్యేక మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడం నుంచి డ్వాక్రా సంఘాల బలోపేతం వరకు తీసుకున్న నిర్ణయాలు మహిళల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాయన్నారు. ఈ రోజు రాష్ట్రంలో లక్షలాది మంది మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి డ్వాక్రా సంఘాలు, స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని



చెప్పారు. మహిళల ఆత్మవిశ్వాసం పెరగడం, కుటుంబ ఆర్థిక వ్యవస్థ బలపడడం, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందడం వెనుక టీడీపీ ప్రభుత్వ కృషి ఉందన్నారు.

నాడు వితంతు పింఛన్లను ప్రవేశపెట్టి ఆదుకున్న పార్టీ తెలుగుదేశం. ప్రభుత్వ రికార్డులు, అప్లికేషన్లలో తండ్రి పేరుతో పాటు తల్లి పేరు కూడా తప్పనిసరిగా నమోదు చేయాలనే చారిత్రాత్మక నిబంధన తెచ్చింది టీడీపీ. దేశంలోనే తొలిసారిగా ఒక దళిత మహిళను ఉన్నత స్థానంలో కూర్చోబెట్టిన ఘనత, రేషన్ కార్డులు, ప్రభుత్వ ఇళ్లను మహిళల పేరు మీదే మంజూరు చేసే సంప్రదాయాన్ని తెచ్చింది టీడీపీయే.

## 'దీపం'తో మహిళల ఇళ్లల్లో వెలుగులు

నాడు నారా చంద్రబాబునాయుడు 'దీపం' పథకం కింద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇస్తే.. నేడు మన కూటమి ప్రభుత్వం 'దీపం 2.0' ద్వారా ఏకంగా మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తూ మహిళల ఇళ్లల్లో వెలుగులు నింపుతోంది. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం దేవెగౌడ, వాజపేయి కాలం నుంచి తెలుగుదేశం పార్టీ ఎలాంటి షరతులు లేకుండా మద్దతు ఇస్తూనే ఉంది. చట్టసభల్లో మహిళా బిల్లు ఆగిపోయినప్పటికీ.. చట్టంతో సంబంధం లేకుండా, ఒక రాజకీయ పార్టీగా మా అంతట మేమే 33% రిజర్వేషన్లు ఇస్తున్నామని, రాబోయే ఎన్నికల్లో దీన్ని అమలు పరుస్తామని లోకేష్ ప్రకటించారు. ఇది భారతదేశంలోనే మొదటి అడుగు. టీడీపీ తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయంతో క్రెడిట్ ఎక్కడ పోతుందో అని గొడ్డలి పార్టీకి భయం పట్టుకుంది. ఇది క్రెడిట్ కోసం చేసిన పని కాదు.. మహిళల హక్కుల కోసం చేసిన పోరాటం. రేపు 2029 ఎన్నికల నాటికి చట్టం అయినా, కాకపోయినా ప్రతి రాజకీయ పార్టీ మహిళలకు 33% రిజర్వేషన్ ఇవ్వాల్సిన బాధ్యతను టీడీపీ కల్పించింది. ఆంధ్రప్రదేశ్ వేదికగా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు టీడీపీ దిశానిర్దేశం చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రజలు నమ్మి దాదాపు 20 మంది తెలుగుదేశం కూటమి ఎంపీలను గెలిపించి పార్లమెంటుకు పంపింది మహిళా బిల్లుకు మద్దతు ఇవ్వడానికే. కానీ దురదృష్టవశాత్తు దేశంలోని కొన్ని రాజకీయ పార్టీల స్వార్థం వల్ల ఆ బిల్లు వీగిపోయింది. మహిళలు డిసప్పాయింట్ అయిన ప్రతిసారీ టీడీపీ వారికి అండగా నిలిచింది, ఇప్పుడూ నిలుస్తోంది. ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో ఉన్న గొడ్డలి పార్టీ నాయకులు.. ప్రతీ మంచి విషయాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు. లోకేష్ ప్రకటించిన చారిత్రాత్మక మహిళా రిజర్వేషన్లలోనూ తప్పులు వెతకడం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో 11 స్థానాలకు పడిపోయిన ఆ పార్టీకి, భవిష్యత్తులో ఆ 11 కూడా పోయి కేవలం 1 సీటు మాత్రమే మిగిలే పరిస్థితి వస్తుందని ఆమె హెచ్చరించారు.

## అన్నిటా మగువలే...

దేశ జనాభాలో మహిళలు 50% ఉన్నా, అధికారిక లెక్కల్లో వారి జీడీపీ భాగస్వామ్యం కేవలం 18 శాతంగానే చూపిస్తున్నారు. దీనికి కారణం మహిళలు ఎక్కువగా అసంఘటిత రంగంలో పనిచేయడమే. వ్యవసాయం, పాడి పరిశ్రమ, కుటుంబ వ్యాపారాలు, ఇంట్లో చేసే పనులకు ఎక్కడా జీతాలు గానీ, గుర్తింపు గానీ ఉండటం లేదు. మహిళల 'అన్‌పెయిడ్' (ఉచిత) శ్రమను కూడా లెక్కిస్తే.. వారి పని భాగస్వామ్యం 90% దాటుతుందని, దేశ జీడీపీలో వారి వాటా 30 శాతానికి పైగా పెరుగుతుందని ఎమ్మెల్యే మాధవిరెడ్డి పేర్కొన్నారు. గ్రామాల్లో పొలాల్లో చూసినా, పశువుల దగ్గర చూసినా, ఇళ్లల్లో చూసినా మహిళల శ్రమే కనిపిస్తుంది. చాకలి, ఇస్త్రీ దుకాణాలు, టైలరింగ్, రజక వృత్తుల్లో మగవారి కంటే ఆడవాళ్లే ఎక్కువ కష్టపడుతున్నారు. రైతు బజార్లకు వెళ్లి చూస్తే వ్యాపారం చేసేవాళ్లలో అత్యధికులు మహిళలే. అన్ని రంగాల్లోనూ మహిళలే ఉన్నా.. దేశ ఆర్థిక పరిస్థితిలో వారి వాటా ఇంత అని చూపించే సరైన గణాంకాలు లేకపోవడం దురదృష్టకరం. మహిళల ఈ అపారమైన శ్రమను, వారి ప్రాధాన్యతను గుర్తించి వారికి సమాజంలో, రాజకీయాల్లో సరైన గౌరవం, చట్టసభల్లో సముచిత స్థానం కల్పించడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యం. చట్టాలు మారినా, మారకపోయినా మహిళా సాధికారత కోసం టీడీపీ ఎల్లప్పుడూ పోరాడుతూనే ఉంటుంది. కూటమి ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి, సామాజిక భద్రతే ధ్యేయంగా అద్భుతమైన కార్యక్రమాలను అమలు చేస్తోందని మాధవిరెడ్డి స్పష్టం చేశారు.

## డ్వాక్రా గ్రూపుల బలోపేతం... మహిళలకు రుణాలు, పెన్షన్లు

మహిళల్లో ఉన్న ఆర్థిక క్రమశిక్షణను నమ్మి సమాజంలో విప్లవాత్మక మార్పులు తెచ్చేందుకు ప్రభుత్వం ప్రతి పథకాన్ని మహిళల ద్వారానే ముందుకు తీసుకెళ్తోందని ఆమె కొనియాడారు. రాష్ట్రంలో దాదాపు 12 లక్షల డ్వాక్రా (సెల్ఫ్ హెల్ప్) గ్రూపులను బలోపేతం చేయడం ద్వారా కోటి 10 లక్షల మంది మహిళలకు కూటమి ప్రభుత్వం ఉపాధి, ఆదాయ అవకాశాలను కల్పించింది. బ్యాంకు లింకేజీ ద్వారా దాదాపు రూ.68 వేల కోట్లకు పైగా ఆర్థిక సహాయాన్ని అందించాము. మహిళల్లో డిఫాల్ట్ (బాకీ పడటం) అయ్యే అలవాటు చాలా తక్కువ కాబట్టి, నేడు రైతులు, వ్యవసాయ రుణాలతో పాటు స్ట్రీట్ వెండర్స్ (వీధి వ్యాపారులు) లోన్లు కూడా స్వయం సహాయక సంఘాల ద్వారానే ప్రభుత్వం అందిస్తోంది. గతంలో పది రూపాయలు, ఇరవై రూపాయల భారీ వడ్డీలతో పేద ప్రజల ప్రాణాలు తీసిన దుర్మార్గపు 'కాల్‌మనీ' దళారీ వ్యవస్థ నుండి ప్రజలను కాపాడటానికే కూటమి ప్రభుత్వం మహిళల ద్వారా ఈ తక్కువ వడ్డీ రుణాలను ఇప్పిస్తోంది. మహిళలు సొంతంగా పరిశ్రమలు పెట్టుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ప్రత్యేక సబ్సిడీలు ఇస్తోంది. వితంతు, ఒంటరి మహిళా పెన్షన్ల కింద నెలకు రూ.1,594 కోట్లను దాదాపు 37.92 లక్షల మంది మహిళల ఖాతాల్లో జమ చేస్తోంది.

ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణాన్ని విమర్శించే వారికి ఎమ్మెల్యే మాధవిరెడ్డి గట్టి కౌంటర్ ఇచ్చారు. "మొన్ననే మా కడప నియోజకవర్గంలో జమాలపల్లి నుంచి వచ్చే ఒక నర్సును పలకరించాను. రోజూ డ్యూటీకి రావడానికి ఆమెకు రూ.50 ఖర్చయ్యేది. ఉచిత బస్సు వల్ల ఇప్పుడు ఆమెకు నెలకు రూ. 1,500 మిగులుతోంది. ఆ పాపకు వచ్చే రూ.11వేల జీతంలో ఈ రూ.1,500 కూటమి ప్రభుత్వం అందిస్తున్న 'ఇన్విజిబుల్' ఆర్థిక సహాయం కాదా?" అని ప్రశ్నించారు. ఈ డబ్బును మహిళలు తమ పిల్లల చదువుల కోసం, భవిష్యత్తు కోసం వాడుకుంటు న్నారు. కడప చుట్టుపక్కల గ్రామాల్లో ఎంతో మంది పేద మహిళలు, బట్టల షాపుల్లో పనిచేసేవారు, ప్రైవేట్ టీచర్లు ఈ పథకం ద్వారా నెలకు రూ.1,500 నుంచి రూ.3,000 వరకు ఆదా చేసుకుంటున్నారు. అయితే, ప్రతిపక్షాలు "మహిళలు ఫ్రీ బస్సుల్లో ఊరికే ట్రిప్పులు వేస్తున్నారు, విహారయాత్రలు చేస్తున్నారు" అంటూ చౌకబారు విమర్శలు చేస్తున్నారు.

## తల్లికి వందనం...

కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం దాదాపు 43 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.8,745 కోట్లకు పైగా నిధులను జమ చేసింది. పుట్టిన ప్రతి బిడ్డకూ ఈ పథకాన్ని వర్తింపజేస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఆర్థిక భారం లేకపోవడంతో గర్ల్ చైల్డ్ (ఆడపిల్లల) స్కూల్ డ్రాపౌట్స్ తగ్గి, పాఠశాలల్లో విద్యార్థినుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 'దీపం 2.0' కింద మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు మహిళలకు బ్రహ్మాండంగా అందుతున్నాయి. 2019–2024 మధ్య కాలంలో మహిళల భద్రతను పూర్తిగా గాలికొదిలేశారు. గత గొడ్డలి పార్టీ ప్రభుత్వంలో మహిళా నాయకులు, ఉద్యోగులు బయటకు వచ్చి మాట్లాడితే చాలు.. వారిపై దాడులు చేయడం, సోషల్ మీడియాలో అసభ్యకరంగా టార్గెట్ చేయడం పరిపాటిగా మారింది. ఈ కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళలంతా గుండెల మీద చేయి వేసుకుని ప్రశాంతంగా బతుకుతున్నారు.

## వైసీపీ అరాచకాలపై మహిళలు తిరగబడే రోజొచ్చింది...

చంద్రబాబునాయుడు, లోకేష్, పవన్‌కళ్యాణ్ అండగా ఉన్నారనే ఆత్మస్థైర్యం మహిళల్లో పెరిగింది. "గత ప్రభుత్వంలో నేను కూడా ఒక బాధితురాలినే. నాపై, నా కుటుంబంపై సోషల్ మీడియాలో దారుణంగా దాడులు చేశారు, ట్రోల్ చేశారు. మహిళలను మానసికంగా వేధించి పాశవిక ఆనందం, రాక్షసానందం పొందారు. పెద్దలు చెప్తారు.. తోక లాగుతుంటే, ఎక్కువ గిల్లుకుంటే పిల్లి కూడా రక్కుతుందని! ఒక దెబ్బపడితే బాధపడతారు, రెండో దెబ్బ పడితే అలవాటవుతుంది, మూడో దెబ్బ పడితే అదే పగగా మారి ఎదురు తిరిగే పరిస్థితి వస్తుంది. వైసీపీ అరాచకాలపై మహిళలు తిరగబడే రోజు వచ్చింది. రాబోయే రోజుల్లో 33% మహిళా రిజర్వేషన్లతో చట్టసభల్లోకి భారీగా మహిళలు రాబోతున్నారు. మాకు జరిగే అన్యాయాలపై మేమే చట్టాలు చేసుకుని రక్షణ పొందుతామని ఎమ్మెల్యే హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. 'సఖీ సురక్ష' కార్యక్రమం కింద దాదాపు 2 లక్షల మంది డ్వాక్రా, మెప్మా మహిళలకు ఉచిత హెల్త్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించింది. ఈ పరీక్షల్లో వేల మంది మహిళలకు ప్రాథమిక వ్యాధులు బయటపడగా, దురదృష్టవశాత్తు 1,100 మంది మహిళలకు ఫోర్త్ స్టేజ్ (నాల్గవ దశ) క్యాన్సర్ ఉన్నట్లు తేలింది. పేదరికంలో ఉండి రెగ్యులర్ చెకప్స్ చేసుకోలేని మహిళల కోసం ఈ పరీక్షలు ఒక సంజీవనిలా పనిచేశాయి. మహిళల్లో ఉన్న అనారోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన వైద్యం అందించడం ద్వారా వేలాది పేద కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రభుత్వం కాపాడుతోంది. ఇందుకోసమే ముఖ్యమంత్రి మహిళా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. "రాజకీయాల్లో కల్పిస్తున్న 33% రిజర్వేషన్ అనేది మహిళల హక్కు. ఇది ఎవరూ వేసిన భిక్షో లేక ఇచ్చిన ప్రోత్సాహమో కాదు" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. దశాబ్దాలుగా మహిళా బిల్లు కోసం పోరాటాలు జరుగుతున్నా.. కొన్ని రాజకీయ పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాలు, పొలిటికల్ స్ట్రాటజీల కోసం దాన్ని వెనక్కి నెడుతూ వచ్చాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

## టీడీపీ చూపిన బాటలో అందరూ నడవాల్సిందే...

మహానాడు వేదికగా టీడీపీ తీసుకున్న నిర్ణయం దేశ రాజకీయాలనే మార్చేయబోతోంది. ఎంతటి జాతీయ పార్టీ అయినా, ప్రాంతీయ పార్టీ అయినా.. రాబోయే రోజుల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు ఇవ్వక తప్పని పరిస్థితిని టీడీపీ కల్పించింది. టీడీపీ చూపిన బాటలోనే భారతదేశంలోని ప్రతి ఒక్క పార్టీ నడవాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ దిశానిర్దేశం వల్ల అనుకున్నదానికంటే చాలా తొందరగా.. అంటే 2029 ఎన్నికల కంటే ముందే దేశంలో మహిళా రిజర్వేషన్ బిల్లు పూర్తిస్థాయి చట్టంగా మారే వాతావరణాన్ని టీడీపీ సృష్టించిందని మాధవిరెడ్డి సగర్వంగా ప్రకటించారు. "మహానాడు వేదికగా మహిళలకు 33% రాజకీయ రిజర్వేషన్ ప్రకటిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, యువ నేత నారా లోకేష్‌లకు ఆమె మహిళా లోకం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే కాలంలో దేశ రాజకీయాల్లో మహిళల ఆధ్వర్యంలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయని తాను బలంగా నమ్ముతున్నానని స్పష్టం చేశారు.

# అప్పటికప్పుడే సమస్యకు పరిష్కారం

## గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన సమస్యపై విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చురకైన స్పందన



విజయనగరం (చైతన్యరథం): పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు శనివారం విజయనగరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. గజపతినగరం నియోజకవర్గం, బొండపల్లి మండలంలోని గరుడబల్లి, ఆ గ్రామం చుట్టూ పరిసర ప్రాంతాల గ్రామ ప్రజలు ఎంపీ వద్దకు వచ్చారు. వారు ప్రస్తుతం ఎదుర్కొంటున్న తీవ్ర సమస్య గరుడబల్లి గ్రామంలో మూడవ రైల్వే లైన్ రావడం వల్ల సుమారు 500 మంది రైతులు వారు పొలాలకు వెళ్లడానికి దారి లేకపోవడంతో దాని వలన కలిగే ఇబ్బందులను, రాయగడ నుండి విజయవాడ కి వెళ్లే ప్యాసింజర్ కు గరుడబల్లి రైల్వే స్టేషన్లో హాల్టును పునరుద్ధీకరించేందుకు గరుడుపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఆర్ఓబిని ఏర్పాటు చేసే నిమిత్తం ఎంపీని కలవగా, ఎంపీ వెంటనే స్పందించి గ్రీవెన్స్ స్వీకరించి వెంటనే సిబ్బందితో నేరుగా బయలుదేరి గ్రామస్తులతో కలిసి గజపతినగరం నియోజకవర్గశీ, బొండపల్లి మండలం, గరుడబల్లి గ్రామానికి చేరుకొని గ్రామస్తులు చెప్పిన సమస్యలను స్వయంగా పరిశీలించి, సమస్య తీవ్రతను అర్థం చేసుకొని వెంటనే సంబంధిత రైల్వే అధికారులుతో మాట్లాడి వారికి సదరు విషయం చెప్పి అవగాహన కల్పించి, సమస్య పరిష్కారానికి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులకు సూచనలు చేశారు. అలాగే ఈ సమస్యను జూన్ 17వ తేదీన భువనేశ్వర్‌లో జరిగే జడ్ఆర్‌యూసీసీ మీటింగ్లో ప్రతిపాదన పెట్టి, జోనల్ రైల్వే మేనేజర్ దృష్టికి తీసుకు వెళ్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.




# ప్రజల వద్దకు పాలన దిశగా విజయనగరం

## ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం (చైతన్యరథం): జి. సిగడాం మండలం,నడిమివలస గ్రామ పంచాయతీలోని జి. సిగడాం మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు కుమరాపు రవికుమార్ గారి అధ్యక్షతన, నడిమివలస టీడీపీ గ్రామ నాయకులు మీసాల ముసిలినాయుడు, బాలి తమ్మి నాయుడు, పొగిరి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎచ్చెర్ల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ శ్రేణులతో క్యాడర్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో రణస్థలం మండలం టిడిపి పార్టీ అధ్యక్షులు లంక శ్యామ్, లావేరు మండలం టిడిపి పార్టీ అధ్యక్షులు ముప్పిడి సురేష్, జి.సిగడం మండలం జనరల్ సెక్రెటరీ కుదిరెల్ల బుజ్జి, రణస్థలం మండలం జనరల్ సెక్రటరీ మండపాక కనకరావు, టిడిపీ సీనియర్ నాయకులు పిసిని జగన్నాథం నాయుడు,బాలబొమ్మన వెంకటేశ్వరరావు, గాలి వెంకట రెడ్డి, ఇనుపకుర్తి తోటయ్య దొర, టంకాల మౌళేశ్వరరావు, పిన్నింటి మధుబాబు, వొద్దుపల్లి శ్రీనివాసరావు, బెవర జగన్నాథ రావు, లంక నారాయణ రావు, డబ్బాడ ఆదినారాయణ, జక్కంపూడి దాసు, కలిశెట్టి సూర్యనారాయణ ఆరెళ్ళ కృష్ణ, కామోజుల సీతారాం, మీసాల రవికుమార్,దుమ్ము అశోక్, మైలుపల్లి పోలీస్, దన్నాన వంశీ, మక్కా నారాయణరావు, మానం సత్య రావు,గొలివి శ్రీనివాసరావు, భూపతి చంద్రశేఖర రావు, భగాది అప్పలనాయుడు, పొగిరి నారాయణరావు, కోరాడ వెంకట రమణ, భూటు చక్రధర్ తదితర నాయకులు,జడ్పీటీసీలు,ఎంపీటీసీలు,సర్పంచులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ సీఎం ఆదేశాల ప్రకారం ప్రతి శుక్రవారం ప్రజా దర్బార్ తోపాటు మన పార్టీ క్యాడర్ మీటింగ్ నిర్వహించడం జరుగుతూ వస్తుంది. సీఎం, లోకేష్ కార్యకర్త అధినేత అనే నినాదంతో పార్టీ బలోపేతానికి నిరంతరం అహర్నిశలు శ్రమిస్తున్న కార్యకర్తల సంక్షేమానికై, వారి అభ్యున్నతకై, వారి సమస్యల పరిష్కారానికి అలాగే తెలుగుదేశం పార్టీ భవిష్యత్తులో జరిపే కార్యకలాపాల నిమిత్తం నియోజకవర్గాల స్థాయిలో ప్రతి శుక్రవారం క్యాడర్ మీటింగ్ నిర్వహించ బడుతుందని తెలిపి, అలాగే కార్యకర్తల కష్టం, శ్రమను పార్టీ, అధిష్టానం ఎప్పుడు గుర్తించు కుంటుందని, సమయం వచ్చినప్పుడు నా మాదిరిగా ఫలితాలు వస్తాయని దానికి తగ్గట్టు పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేయాలని, కొద్ది రోజుల్లో జరగబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో విజయకేతనం ఎగరవేసే దిశగా పనిచేయాలని, అందుకు తగ్గట్టుగా గ్రామాలలో కూటమి నాయకులతో సమన్వయం చేసుకొని 100% ఫలితాలు సాధించే విధంగా వ్యూహాలు అనుసరించి ప్రభుత్వం సంక్షేమం,అభివృద్ధి కొరకై అమలుపరుస్తున్నటువంటి సూపర్ 6 పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి ప్రభుత్వం చేస్తున్నటువంటి మంచి పనులను ప్రజలకు అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు సూచనలు ఇచ్చారు.

# ఓర్వలేకే టీడీపీ మహానాడుపై వైసీపీ విమర్శలు

విజయనగరం (చైతన్యరథం): పార్లమెంటు సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు ఈరోజు విజయనగరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. దేశంలో మొదటిసారిగా డిజిటల్ వేదికగా తెలుగుదేశం పార్టీ మహానాడు 2026 కార్యక్రమాన్ని పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు వర్చువల్‌గా జరిపించడం, రికార్డు స్థాయిలో నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొని హైబ్రిడ్ మహానాడు ను విజయవంతం చేయటం పట్ల అందరికీ ధన్యవాదములు తెలిపారు. ముఖ్యంగా మహానాడు 2026 కార్యక్రమానికి ప్రధాన థీమ్ స్త్రీ శక్తి అనే నినాదాన్ని తీసుకొని మహిళల రక్షణ, సాధికారతకై తీర్మానాలు చేయటం ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ జాతీయ నిర్వాహక అధ్యక్షులు నారా లోకేష్ మహిళా బిల్లు 33 శాతం రిజర్వేషన్ పై పార్లమెంట్లో బిల్లు పాసైన, అవ్వకపోయినా తెలుగుదేశం పార్టీ మహిళలకు 33శాతం కోటాను ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని మహానాడు వేదికగా హామీ ఇవ్వడం వెనుక, మహిళలపై అభ్యున్నతిపై తెలుగుదేశం పార్టీకి గల విశ్వసనీయుతకు నిదర్శనమన్నారు. మంత్రి నారా లోకేష్ విద్యార్థుల ఫలితాల మెరుగుదలే లక్ష్యంగా, ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతూ, రాష్ట్ర విద్య రంగానికి బంగారు భవిష్యత్తును అందిస్తూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, ఆధునిక విద్యా విధానాలు అమలు, ఉపాధ్యాయుల నియామకాలు ఖాళీల భర్తీ వంటి కీలక చర్యలతో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ ఉంటే, భారతదేశం అంతటా మన రాష్ట్ర విద్య విధానాన్ని మెచ్చుకుంటూ ఉంటే జగన్మోహన్ రెడ్డి అండ్ టీం అక్కసుతో మంత్రి లోకేష్‌కి వస్తున్న పేరు ప్రతిష్ఠలకు ఓర్వలేక ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారన్ని ఖండించారు.




# నిరుద్యోగులు, ఉపాధ్యాయులను వంచించిన జగన్ 'నిరుద్యోగ ద్రోహి'

విశాఖపట్నం (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కేవలం 23 నెలల పాలనలోనే రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నిలిపి, సామాన్యుల ప్రభుత్వంగా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుందని శాసన మండలి ప్రభుత్వ విప్ డా. వేపాడ చిరంజీవిరావు అన్నారు. శనివారం విశాఖపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల వైకాపా పాలన చూసి పారిపోయిన దిగ్గజ కంపెనీలు నేడు ఏపీకి క్యూ కడుతున్నాయని, ప్రపంచమంతా గూగుల్ సెర్చ్‌లో ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా గూగుల్ డేటా సెంటర్, ఐటీ దిగ్గజం 'టిసీస్' రాకను సుగమం చేశామని తెలిపారు. అనకాపల్లిలో 'ఆర్సెల్లర్ మిట్టల్', రాయలసీమలో 'రాయల్ ఎన్ఫీల్డ్' లాంటి ప్రపంచ స్థాయి ప్రాజెక్టులను, రాజధాని అమరావతి శరవేగ అభివృద్ధితో అన్ని ప్రాంతాలను సమాంతరంగా అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. 'గొడ్డలి పార్టీ' నాయకుడు జగన్ మోహన్ రెడ్డి, ట్విట్టర్ (ఎక్స్) వేదికగా మెగా డీఎస్సీని "దగా డీఎస్సీ" అంటూ కుట్రపూరిత ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని డా. వేపాడ మండిపడ్డారు.

"ఆంధ్రప్రదేశ్ చరిత్రలో జరిగిన 15 డీఎస్సీలలో, 11 డీఎస్సీలను నిర్వహించి, 1.50వి లక్షల మందికి పైగా నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనమైన చరిత్ర కేవలం తెలుగుదేశం పార్టీది, చంద్రబాబు నాయుడు గారిది అన్నారు.జగన్ ఐదేళ్లపాటు నిద్రపోయి, ఎన్నికల ముందు కంటితుడుపుగా ఇచ్చిన డిఎస్సీ నోటిఫికేషన్ ఆయన అసమర్థత వల్లే కోర్టు స్టేతో ఆగింది తప్ప తాము ఆపలేదన్నారు. వార్షిక జాబ్ క్యాలెండర్‌ను 'సాక్షి' క్యాలెండర్‌కు పరిమితం చేసి, ఐదేళ్లలో ఒక్క కానిస్టేబుల్ పోస్టును కూడా భర్తీ చేయకుండా 20 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో జగన్ ఆడుకున్నారని అని ధ్వజమెత్తారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే వేసిన తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైలుపైనేనని గుర్తుచేశారు. మంత్రి నారా లోకేష్ పట్టుదలతో కేవలం 150 రోజుల్లోనే 16,347 పోస్టులకు గానూ 15,941 ఉపాధ్యాయ నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పూర్తి చేశామని వివరించారు. పేపర్ లీక్ ఆరోపణలపై సాంకేతిక సమాధానంకంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో ఏ బ్యాచ్‌కు ఆ బ్యాచ్ పరీక్షా పత్రం కేవలం పరీక్షకు 10 నిమిషాల ముందు మాత్రమే జనరేట్ అవుతుందని, ఆ మాత్రం కామన్ సెన్స్ లేకుండా జగన్ మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. అవుట్ సోర్సింగ్ అభ్యర్థి అయినా మెరిట్ సాధిస్తే అక్రమాలు జరిగాయని బురదజల్లుతారా అని ప్రశ్నించారు. అంతర్జాతీయ డిజిటల్ భద్రతా ప్రమాణాలతో పరీక్షలు జరిగాయని పేర్కొన్నారు. ఆగస్టు 2025 లోనే మెరిట్ లిస్టు పబ్లిష్ చేసి, సబ్జెక్ట్ నిపుణులతో సుదీర్ఘంగా చర్చించి, ఫైనల్ కీ ఇచ్చాకే అభ్యర్థులను ఎంపిక చేశారని స్పష్టం చేశారు. జీఓ 77 ప్రకారం మహిళలు, క్రీడాకారులు, వికలాంగుల రిజర్వేషన్లను 'హారిజెంటల్ రిజర్వేషన్' పద్ధతిలో భర్తీ చేయడం జరుగుతుందని, దీనిపై కనీస అవగాహన లేకపోవడం వల్లే వైకాపా నేతలు గందరగోళానికి గురవుతూ నిరుద్యోగులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. జగన్ పాలనలో ఉపాధ్యాయులు ఎన్నికల విధుల్లో పాల్గొనకుండా నిషేధించారని, హక్కుల కోసం పోరాడితే జైల్లో పెట్టించారని మండిపడ్డారు. "గురువు కన్నా గూగుల్ మిన్న" అంటూ ఉపాధ్యాయులను అవమానించారని అన్నారు. వైకాపా హయాంలో ప్రభుత్వ స్కూళ్లలో ఏకంగా 10 లక్షల మంది విద్యార్థుల అడ్మిషన్లు తగ్గిపోయాయన్నారు. జగన్ టీచర్లను బ్రాందీ షాపుల దగ్గర కాపలా పెడితే.. కూటమి ప్రభుత్వం వారిని అంతర్జాతీయ స్థాయి శిక్షణ కోసం 'సింగపూర్' పంపించి గౌరవించిందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ప్రతి ఏటా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ షెడ్యూల్ నిర్వహిస్తుందని, ఇప్పటికే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారని వేపాడ చిరంజీవిరావు తెలిపారు. కారుణ్య నియామకాల్లోనూ అవినీతికి పాల్పడిన వైకాపా నేతలు పారదర్శకత గురించి మాట్లాడటం "దెయ్యాలు వేదాలు వల్లించినట్లు" ఉందన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడటానికి ఏ వంకా లేక దొంక పట్టుకుని వేలాడుతున్న జగన్.. 11 సీట్లకు పడిపోయిన తన చరిత్రను గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. రాత్రింబవళ్లు కష్టపడి మెరిట్ సాధించిన 16 వేల మంది ఉపాధ్యాయులను అవమానించవద్దని, యువతతో రాజకీయాలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, లక్షలాది మంది యువత భవిష్యత్తును అంధకారం చేసిన జగన్ చరిత్రలో ఒక 'నిరుద్యోగ ద్రోహి'గా మిగిలిపోతారని డా. వేపాడ చిరంజీవిరావు హెచ్చరించారు. ఈ సమావేశంలో మీడియా కోఆర్డినేటర్ బైరెడ్డి పోతన రెడ్డి పాల్గొన్నారు,

చైతన్యరథం

# మహానాడు సక్సెస్‌తో టీడీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం

## ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వెల్లడి



కొత్తపేట (చైతన్యరథం): నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ 44వ మహానాడును డిజిటల్ విధానంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా క్లస్టర్ల వారీగా జరుగుతున్న ఈ మహానాడులో భాగంగా కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని 10 క్లస్టర్లలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. మహానాడు కార్యక్రమాలకు ప్రాధాన్యతను చాటిచెప్పేలా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఈవీ వాహనంపై వాడపాలెంలోని తన నివాసం నుంచి బయలుదేరి కొత్తపేట కాపు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన 6వ క్లస్టర్ సమావేశానికి చేరుకున్నారు. అక్కడ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మహానాడు రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమం ప్రారంభంలో పార్టీ గీతాన్ని ఆలపిస్తూ కార్యకర్తల్లో ఉత్తేజాన్ని నింపారు. మహానాడు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టీడీపీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించిన ఎమ్మెల్యే, పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తలకు ఎన్టీఆర్ అందించిన ప్రేరణను గుర్తు చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తే టీడీపీకి అసలైన బలం అని అన్నారు. ఎల్‌ఈడి స్క్రీన్‌ల ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ప్రసంగాలను కార్యకర్తలతో కలిసి వీక్షించిన ఎమ్మెల్యే, రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సమర్థంగా పనిచేస్తోందన్నారు. .మీడియాతో మాట్లాడిన ఆయన, ఇంధన పొదుపు మరియు సాంకేతిక వినియోగాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో ఈసారి మహానాడును డిజిటల్ రూపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు క్లస్టర్ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించడం వల్ల గ్రామ స్థాయి కార్యకర్తల్లోనూ పాల్గొనాలనే ఆసక్తి పెరిగిందన్నారు. తాను తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తగా కొనసాగుతూ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేసే అవకాశం పొందడం గర్వంగా ఉందన్నారు. మహానాడు కేవలం రాజకీయ సమావేశం మాత్రమే కాదని, పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై చర్చించే మహా వేదిక అని ఎమ్మెల్యే అన్నారు. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల పక్షాన నిలబడటం టీడీపీ ప్రత్యేకత అని స్పష్టం చేశారు. అనంతరం ఆవిడి శ్యామల గార్డెన్‌లో నిర్వహించిన 8వ క్లస్టర్ మహానాడు, వానపల్లి సొసైటీలో జరిగిన 7వ క్లస్టర్ సమావేశాల్లో కూడా పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

# మహిళా సాధికారతే సీఎం చంద్రబాబు లక్ష్యం : కాకినాడ తెలుగు మహిళలు

## తెలుగు మహిళలు మల్లిపూడి నాగ దీపిక, తుమ్మల సునీత

కాకినాడ (చైతన్యరథం): మహిళా సాధికారతే తెలుగుదేశం పార్టీ లక్ష్యం అని, మహానాడు వేదికగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు గారు మహిళా రిజర్వేషన్ కు బలమైన పునాది వేసి, మహిళా సాధికారతకు బాటలు వేసేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని కాకినాడ సిటీ నియోజకవర్గ మహిళ నాయకులు మల్లిపూడి నాగ దీపిక, తుమ్మల సునీత, సుంకర పావని, కొపనాతి నాగ కుమారి పేర్కొన్నారు. పార్లమెంట్ బిల్లుతో సంబంధం లేకుండా తెలుగుదేశం పార్టీ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మహిళలకు 33% సీట్లు కేటాయించటకు మహానాడు వేదికగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబు తీసుకున్న నిర్ణయంపై శనివారం శాసనసభ్యులు వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో బాలాజీ చెరువు సెంటర్‌లో థాంక్యూ సీఎం సార్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని థాంక్యూ సీఎం సార్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.



# అసత్య ప్రచారాలు మానండి : వైసీపీ నేతలకు ఎమ్మెల్యే చింతమనేని హితవు

చింతలూరు (చైతన్యరథం): ఘనంగా జరిగిన మహానాడు కార్యక్రమం, తీర్మానాలు, గొడ్డలి పార్టీ నాయకుల కుయుక్తులు, మెగా డీఎస్సీ పై ఆరోపణలు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహా పలువురు కూటమి నాయకులపై, ప్రభుత్వం, గొడ్డలి పార్టీ చేస్తున్న సోషల్ మీడియా దుష్ప్రచారాలపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్పందించారు. "రాష్ట్ర రాజకీయాల్లో చారిత్రాత్మక మార్పుకు శ్రీకారం చుట్టి, తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో పార్టీని స్థాపించి తొమ్మిది నెలల కాలంలో అధికారంలోకి వచ్చి, ప్రజలకు అసలైన సంక్షేమ పాలన అంటే ఏంటో ఆచరణలో చూపించిన మహనీయుడు స్వర్గీయ అన్న నందమూరి తారక రామారావుకు భారతరత్న ఇవ్వాలంటూ మహానాడు సందర్భంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు చేసిన ప్రతిపాదనను భారత ప్రభుత్వం ఆమోదిస్తూ భారతరత్న ఇచ్చి అన్న నందమూరి తారకరామారావును గౌరవించుకోవాలని కేంద్రాన్ని కోరారు. అదే విధంగా రాబోయే రోజుల్లో 33 శాతం రిజర్వేషన్ను ఎమ్మెల్యేల టికెట్ కేటాయింపుల్లో కేటాయిస్తామని జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ చేసిన ప్రతిపాదన తెలుగుదేశం పార్టీకి మహిళా సాధికారత పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని దేశ చరిత్రలో ఒక రాజకీయ పార్టీ ఈ విధంగా అమలు చేయడం ఎంతో అభినందనీయమని తెలిపారు..అన్నదాత సుఖీభవతో రైతులకు ఆర్థికంగా చేయూతన అందించడమే కాకుండా ఒకవైపు అమరావతి రాజధాని నిర్మాణంతోపాటు మరోవైపు ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేస్తూ 2027 పుష్కరాల నాటికి పోలవరం పనులు పూర్తిచేసే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, యువ నాయకులు నారా లోకేష్ ఆధ్వర్యంలో బిజెపి సహకారంతో కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని తెలిపారు.. తాము ఎన్నడూ నిర్వహించని విధంగా తమ క్లస్టర్లలో ఘనంగా మహానాడు నిర్వహించే అవకాశం కల్పించిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు , పార్టీని డిజిటల్ రంగంలో మరొక ఉన్నత స్థాయిని అధిరోహించేలా నిర్వహించిన యువ నాయకులు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.



# గాయపడిన టీడీపీ కార్యకర్తకు గద్దె క్రాంతి పరామర్శ

## సొంత నిధులతో వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం

విజయవాడ తూర్పు (చైతన్యరథం): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్త దాసరి శంకరరావును యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ శనివారం పరామర్శించారు. 3వ డివిజన్ విజయలక్ష్మి కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్య చికిత్స పొందాలని సూచించారు. ఈ సందర్భంగా వైద్య ఖర్చుల నిమిత్తం సొంత నిధులు నుంచి రూ.10 వేలు అలాగే ఇంటి అద్దె నిమిత్తం మరో రూ. 6 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని, కార్యకర్తల సంక్షేమం కోసం పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని అన్నారు. "కార్యకర్తే అధినేత" అనే నినాదాన్ని తెలుగుదేశం పార్టీ ఆచరణలో చూపిస్తోందని పేర్కొన్నారు. కష్టకాలంలో కార్యకర్తలకు అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, ఏ కార్యకర్తకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా పార్టీ నాయకత్వం వారి వెంటే ఉంటుందని హామీ ఇచ్చారు. పార్టీ అభివృద్ధికి, ప్రజా సేవకు నిరంతరం శ్రమిస్తున్న కార్యకర్తల త్యాగాలను ఎప్పటికీ మరువబోమని తెలిపారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, వారి శ్రేయస్సే తమ ప్రధాన లక్ష్యమని గద్దె క్రాంతి కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గద్దె క్రాంతి కుమార్ తో పాటు యలమంచిలి రాజా, చలసాని వాసు, గుంజి ఏసుబాబు, రాగాని సాయి తదితరులు ఉన్నారు.



జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మన్ రాజన పండు, కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం లో పాల్గొన్న ప్రభుత్వ మాజీ విప్ అంగర, ఎమ్మెల్యే రోషన్ కుమార్, బొలిశెట్టి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ సీతారామలక్ష్మి మురళీ, ముత్తారెడ్డి, దాసరి శేషు, లక్ష్మణరావు కూటమి నాయకులు.

# బోడే రామచంద్ర యాదవ్ దిగజారుడు విమర్శలు

## కడప జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ రెడ్డి



కడప (చైతన్యరథం): జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైకాపా హయాంలో విద్యావ్యవస్థ రాజకీయ రంగు పులుముకుని మలినం కాబడిందని, నారా లోకేష్ హయంలో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతమైనదని, విద్యార్థుల ఉత్తమ ఫలితాలపై రాజకీయ స్వప్రయోజనాల కోసం బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ మాటలు సరికాదని కడప జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అక్కులు గారి విజయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పులివెందుల తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసినటువంటి సమావేశంలో విజయ్ కుమార్ రెడ్డి బోడె రామచంద్ర యాదవ్ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ జగన్ మోహన్ రెడ్డి మాదిరిగా ప్రచార ఆర్భాటాలకు ప్రాధాన్యతనిస్తూ వ్యక్తిగత ఇమేజ్ ని సొంతం చేసుకునే విధంగా ప్రభుత్వం అందించే బ్యాగులు పుస్తకాలు, బూట్లు తదితర వస్తువులపై జగన్మోహన్ రెడ్డి బ్రాండ్ ను ముద్రించుకునే ప్రభుత్వం తెదేపాది కాదని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉపాధ్యాయులకు ఆధునికతతో కూడిన విద్యను అందించేందుకు నైపుణ్యాల అభివృద్ధి తద్వారా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాతో పాఠశాలను తీర్చిదిద్దడం, ఆర్థికంగా వెనుకబడిన తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యను అందించడం ద్వారానే నేడు ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయని వీటన్నింటిని వక్రీకరిస్తూ మలినం చేయడం సరికాదన్నారు. నిజంగా సంక్షేమాన్ని ఆశించే వాడే అయితే పుట్టపర్తి సాయిబాబా అందించే ఉచిత విద్య విధానాలలో మాదిరిగా విద్యా వ్యవస్థలను నిర్మించాలని అలా కాకుండా ప్రభుత్వంపై నారా లోకేష్ విధానాలపై విమర్శలు చేస్తే సహించబోమని ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.

చైతన్యరథం

# అవినీతి తిమింగలం బొల్లా బ్రహ్మనాయుడు

## ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ (చైతన్యరథం): పట్టణంలోని ప్రధాన తాగునీటి నిల్వ కేంద్రమైన సింగరచెరువును సందర్శించారు. పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా సాగర్ జలాలతో ఈ చెరువును వెంటనే నింపాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం వినుకొండ పట్టణం శివారు చెక్ వాగు వద్ద నిర్మాణంలో ఉన్న మురుగునీటి శుద్ధి ప్లాంట్ (ఎస్టీపీ) యూనిట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బొల్లా బ్రహ్మనాయుడు ఒక అవినీతి తిమింగలమని, జోసెఫ్ ఫీల్డ్ అనే దళితుని భూములను కూడా వినుకొండలో కబ్జా చేశారని మండిపడ్డారు. ఈ రాష్ట్రంలో అవినీతి దాలక పక్క రాష్ట్రాల్లో ప్రభుత్వ భూములను కాజేసేందుకు తప్పుడు జీవోలు సృష్టించి భూ కబ్జాలకు పాల్పడటం సిగ్గు చేటని విమర్శించారు. తెలంగాణలో రూ. 1500 కోట్ల విలువైన భూములను కేవలం రూ. 35 కోట్లకు దోచుకోవాలని ప్రయత్నించడం వినుకొండ ప్రాంతానికి బాధాకరమన్నారు. "ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా" అన్నట్లు జగన్ అవినీతి చేస్తుంటే, వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కూడా అవినీతి, భూ కబ్జాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్ రాష్ట్రాన్ని దోచుకొని, రూ. 10 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని తీవ్ర ఆర్థిక కష్టాల్లోకి నెట్టేశారని విమర్శించారు.

వినుకొండలో పేద ప్రజలకు ఇళ్ల స్థలాల పేరుతో బొల్లా బ్రహ్మనాయుడు తన సొంత భూములను ప్రభుత్వానికి విక్రయించి రూ. 18 కోట్లు సంపాదించారని ఘాటుగా స్పందించారు. పేదలకు నివాసయోగ్యం కాని, నిరుపయోగమైన భూములు ఇచ్చి పేద, బడుగు, బలహీన వర్గాలకు బొల్లా అన్యాయం చేశారని దుయ్యబట్టారు. ఇలాంటి వాళ్ళు రాజకీయాల్లో ఉండే అవకాశం లేదని, రాజకీయాల నుంచి తక్షణమే బొల్లాను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ హయాంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని జీవీ ఆంజనేయులు తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా వినుకొండలో రూ. 18.47 కోట్లతో రెండు ఎస్టీపీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా మురుగునీటి శుద్ధి ఎంతో దోహదపడుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వలన టిడ్కో ఇళ్ళు, ఎస్టీపీ యూనిట్లు, ఇతర పథకాలు పట్టించుకోలేదని, దీంతో కేంద్రం నుండి రావలసిన 80 శాతం నిధులు వెనక్కిపోగా, కేటాయించవలసిన 20 శాతం నిధులు కూడా వైసీపీ ప్రభుత్వం కేంద్ర నిధులను సద్వినియోగం చేసుకోలేక చేతులెత్తేసిందని ధ్వజమెత్తారు. వినుకొండ పట్టణంలోని కారంపూడి రోడ్డులో నూతనంగా రూ. 2 కోట్ల వ్యయంతో అమృత్ పథకం కింద వెట్ అండ్ డ్రై యూనిట్‌ను తెస్తున్నామన్నారు. వినుకొండ పట్టణంలో రూ. 240 కోట్ల రూపాయల నిధులతో అమృత్ 2.0 పనులు శరవేగంగా జరుగుతున్నాయని, రెండేళ్ళలో పనులు పూర్తి చేసి ప్రతి రోజూ ప్రజలకు తాగునీటిని అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అమరావతి నిర్మాణం, పోలవరం నిర్మాణం వేగంగా చేపట్టడమే కాకుండా వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను లాభాల బాట పట్టించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో పాటు అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాలని, వైసీపీ ఎప్పటికీ అధికారంలోకి రాకుండా ప్రజలు జాగ్రత్తపడాలని జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మల్లికార్జునరావు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



# గడ్డివాము దగ్గర గ్రామ సింహం జగన్‌రెడ్డి

## ప్రజలకు మంచి చెయ్యడు..ఎదుటివారు చేస్తుంటే ఓర్చుకోలేడు!

విజయవాడ (చైతన్యరథం): అందుకే సైకో జగన్ మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నాడని టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్ విరుచుకుపడ్డారు. తాను సచివాలయ ఉద్యోగాలు అమ్ముకున్నట్లే అందరూ ఉద్యోగాలు అమ్ముకుంటారని జగన్ అనుకోవడం అతని అవివేకానికి నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో జరిగిన నియామకాల్లో అవినీతికి తావే లేదన్నారు. తన హయంలో ఒక్క డీఎస్సీ కూడా వెయ్యకుండా నిరుద్యోగులను మోసం చేసిన చరిత్ర జగన్‌దన్నారు. ప్రతీ ఏటా జాబ్ క్యాలెండర్ అని చెప్పి ఒక్క ఏడాది కూడా జాబ్ క్యాలెండర్ వెయ్యని మోసకారి జగన్ అని పేర్కొన్నారు. తన ఐదేళ్ల పాలనలో ఇటు నోటిఫికేషన్లు వేయక, అటు కంపెనీలను తరిమికొట్టి నిరుద్యోగులను నిలువునా ముంచేసిన దుర్మార్గుడు జగన్. కూటమి ప్రభుత్వంలో మెగా డీఎస్సీ లో 16వేల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ వేయడం జీర్ణించుకోలేక తప్పుడు ఆరోపణలతో నిరుద్యోగుల్లో అపోహలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాడు. రాత్రి, పగలు కష్టపడి చదివి ఉద్యోగం సాధించిన 16 వేల మంది కష్టాన్ని అవమానిస్తున్నాంన్నారు. టెన్త్ పేపర్లు కొట్టేసి పాసైన ఘన చరిత్ర, బీసీ నాయకుడు శివకుమార్ పెట్టిన పార్టీని కొట్టేసిన చరిత్ర ఉన్న జగన్ అందరూ తనలాంటి వారే అనుకోవడం అతని నైజమన్నారు. జగన్ ఎంత ఏడ్చినా కూటమి ప్రభుత్వం మరలా డీఎస్సీ వేయడం, జాబ్ క్యాలెండర్ అమలు చేయడం, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం గ్యారంటీ అని స్పష్టం చేశారు.

## సెమీ ఇండోర్ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన



బాపట్ల పట్టణం డీఎస్పీ ఆఫీస్ రోడ్డులో ఏడు కోట్ల రూపాయలతో నూతనంగా సెమీ ఇండోర్ సబ్ స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, బాపట్ల జిల్లా ఇంచార్జ్ మంత్రి కొలుసు పార్థసారథి, బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్ కుమార్‌తో బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొని భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు,రాష్ట్ర గ్రంథాలయ అభివృద్ధి సంస్థ చైర్మన్, బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు,జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు తాతా జయప్రకాష్ నారాయణ,ఆర్ .డి.ఓ. గ్లోరియా, బాపట్ల పట్టణ మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, బాపట్ల మార్కెట్ చైర్మన్ కావూరి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు



## త్వరలో ఏపీకి స్పోర్ట్స్ యూనివర్సిటీ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్

విజయవాడ (తూర్పు) (చైతన్యరథం): విజయవాడ తూర్పు నియోజకవర్గం లోని లబ్బీపేట ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో టీవీ9 క్యాబ్ సంయుక్తంగా నిర్వహించిన ఎడ్యుకేషనల్ ఎక్స్పోను విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని చిన్ని ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఎంపీ చిన్నికి టీవీ9 మరియు క్యాబ్ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు ఎడ్యుకేషనల్ ఎక్స్పోను ఎంపీ కేశినేని చిన్ని ప్రారంభించి ఎక్స్పోలో పాల్గొన్న అన్ని యూనివర్సిటీ స్టాల్స్ అన్నిటిని ప్రత్యేకంగా పరిశీలించారు. అనంతరం ఎక్స్పో కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీ చిన్ని మాట్లాడుతూ విజయవాడ అంటే విద్యలవాడ అని తాను కూడా ఒక మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థినేనని ఇంజనీరింగ్ రంగంలో విద్యార్థులు మెరుగ్గా రాణించడానికి విద్యార్థులకు అన్ని విధాలుగా ప్రభుత్వం తో పాటు యూనివర్సిటీస్ అన్ని సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు కేఎల్ యూనివర్సిటీ లో ఒక మెకానికల్ విద్యార్థికి 88 లక్షల ప్యాకేజీ రావడం రాష్ట్రానికే గర్వకారణం అని ఎంపీ చిన్ని అన్నారు. దేశానికి కావాల్సింది ఎంటర్ప్రెన్యూవర్స్ మాత్రమే కాదు అందులో ఎక్కువ మంది ఆంత్రప్రేన్యూర్స్ ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని తెలిపారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్న సమయంలో రాష్ట్రానికి అనేక ఇంజనీరింగ్ మెడికల్ కాలేజీలు తీసుకువచ్చారని అందుకే ఐటీ మెడికల్ రంగాలలో విప్లవాత్మక మార్పులు జరిగాయని అన్నారు. ఇప్పుడు నూతన విధానంగా వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ప్రెన్యూర్ అనే కొత్త విధానాన్ని ముఖ్యమంత్రి తీసుకొచ్చారు దీని ద్వారా ప్రతి కుటుంబం నుంచి ఒక ఎంటర్ప్రెన్యూర్ రావాలన్నదే ముఖ్యమంత్రి ఆలోచనని స్పష్టం చేశారు అటు యూనివర్సిటీలకు సంబంధించిన మాట్లాడుతూ యూనివర్సిటీల్ని కోరేది కూడా లైఫ్ స్టైల్ ఈరోజు ఉన్న పరిస్థితుల్లో మారిందని, దానికి అనుగుణంగానే ఉన్న కోర్సులు తీసుకువచ్చి కమ్యూనికేషన్ స్కిల్స్ కు కూడా ప్రత్యేక కోర్సును ఏర్పాటు చేయాలని చేయాలని చిన్ని అన్నారు. అటు విద్యతోపాటు క్రీడాలకు కూడా అంతే విధమైన ప్రాధాన్యత ఇవ్వాలని భారత దేశంలో స్పోర్ట్స్ వల్ల బ్రహ్మండమైన ఎకానమీ పెరిగిందని తెలిపారు. త్వరలో ఏపీకి కూడా స్పోర్ట్స్ యూనివర్సిటీ రాబోతుందని అన్నారు. అటు ఉపాధి విషయాల్లోనూ ఏపీ నంబర్వన్‌గా ఉండాలన్నదే చంద్రబాబు లోకేష్ లక్ష్యమని గూగుల్ ఏఐ డేటా సెంటర్ హబ్‌గా త్వరలో విశాఖ మారబోతుందని క్వాంటం కంప్యూటర్ కోర్సులతోపాటు ఏఐ రోబోటిక్స్ కోర్సులపై కూడా యూనివర్సిటీస్ ప్రత్యేకమైన దృష్టి సాధించాలని అన్నారు రతన్ టాటా పేరుతో 5 ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేశామని ఇలాంటి అవకాశాలన్నీ ఈ రాష్ట్రంలో ఉన్నాయని ప్రతి విద్యార్థి ఎలాంటి కన్ఫ్యూజన్ లేకుండా ఈ అవకాశాలన్నీ పూర్తిగా వినియోగించుకోవాలని తెలిపారు టీవీ9 ట్యాగ్ మెరుగైన సమాజం కోసం అని ఏదైతే చెప్తారో ఇలాంటి ఒక మంచి ఎక్స్పోను తీసుకురావడం నిజంగా మంచి విషయమని టీవీ9 క్యాబ్ ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు రాబోయే రోజుల్లో భావి భారత విద్యార్థుల భవిష్యత్తు యూనివర్సిటీల చేతుల్లోనే ఉందని వారిని మంచి పౌరులుగా ఈ సమాజానికి అందించాలని ఎంపీ చిన్ని ఆకాంక్షించారు.

జోన్-4

(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)

చైతన్యరథం

# దమ్మున్న పార్టీ తెలుగుదేశం

## మనసున్న అధినేతలు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, మహిళా రిజర్వేషన్ హామీపై కేంద్రమాజీమంత్రి పనబాక లక్ష్మి



తిరుపతి (చైతన్యరథం): చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే మహిళా రిజర్వేషన్ బిల్లు ఇంకా పూర్తిస్థాయిలో అమలు కాకపోయినా, మహిళా సాధికారతకు అంకితభావంతో ముందుకు సాగుతున్న తెలుగుదేశం పార్టీ మహిళలకు 33 శాతం ప్రాధాన్యత కల్పించడం అభినందనీయమని కేంద్రమాజీ మంత్రి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, అలాగే తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహిళలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా మరింత ప్రాధాన్యత కల్పించాలనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలు దేశ రాజకీయాల్లో ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆమె అన్నారు. పార్టీ నిర్మాణం నుంచి కీలక పదవుల వరకు మహిళలకు సముచిత స్థానం కల్పించడం ద్వారా మహిళా శక్తిని ప్రోత్సహిస్తున్న ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా మహిళల అభ్యున్నతి, నాయకత్వ వికాసం కోసం తెలుగుదేశం పార్టీ కట్టుబడి పనిచేస్తుందని డాక్టర్ పనబాక లక్ష్మి తెలిపారు.

# దొంగ.. దొంగ అంటున్న వైసీపీ దొంగలు

చిత్తూరు (చిత్తూరు (చైతన్యరథం): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన లిక్కర్ స్కామ్‌లో జగన్మోహన్ రెడ్డి పిఏ కె నాగేశ్వర్రెడ్డి అలియాస్ కేన్‌ఆర్ వందల కోట్ల రూపాయలు తన పేరు మీద, తన భార్య పేరు మీద సంపాదించిందని ఆరోపించారు. ఒక సాధారణ జర్నలిస్టుగా ఉన్న కేవన్‌ఆర్ అక్రమ ఆస్తుల చిట్టా చూసి మొత్తం సిట్ అధికారులే వి పోయారు. ఒక పిఏ సాధారణ జర్నలిస్టు జగన్ ముఖ్యమంత్రి కాకముందు వరకు ద్విచక్ర వాహనంలో తిరుగుతున్న తిరిగిన వ్యక్తి .ఒక్కసారిగా వందల ఎకరాలు భూములు, ఆస్తులు, వాహనాలు సంపాదించారంటే ఏ స్థాయిలో అధికార దుర్వినియోగం జరిగిందో ఒకసారి అర్థం చేసుకోవచ్చు. సాక్షాత్తు ఒక ముఖ్యమంత్రి పిఏ ఈ విధంగా వందల కోట్లలో లిక్కర్ స్కామ్ లో సంపాదించి ప్రజల జీవితంతో చెలగాటమాడుతుంటే... ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్ మోహన్ రెడ్డి మరియు ఆయన సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి ఎన్ని వందల కోట్లు సంపాదించి ఉంటారు ఒకసారి జనాలు కూడా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ విధంగా లిక్కర్ స్కాం లో కోట్లాది రూపాయలు సంపాదించిన ఈ గజదొంగలు ముఠా విదేశాలలో ,విలాసాలకు, స్పెషల్ ఫ్లైట్ లకు ఖర్చులు పెట్టి ,విదేశాలలో కులుకుతుంటే... వీళ్ళు అమ్మిన చీప్ లిక్కర్ తాగిన సామాన్య ప్రజలు తమ లివర్లను, కిడ్నీలను, పోగొట్టుకొని అనారోగ్యం పాలయ్యారు. వీళ్ళ యొక్క ఉసురు జగన్మోహన్ రెడ్డికి, సజ్జల రామకృష్ణారెడ్డికి, ఈ లిక్కర్ స్కామ్ నిందితులకి తగలకపోదన్నారు. త్వరలో సజ్జల రామకృష్ణారెడ్డి, జగన్మోహన్ రెడ్డి అరెస్టు కూడా తథ్యం. లిక్కర్ స్కామ్ లో కోట్లాది రూపాయలు దోచుకున్న ఈ గజదొంగల ముఠా ఏమాత్రం పశ్చాత్తాపం పడటం లేదు. తాము ఏదో పెద్ద స్వతంత్ర సమరయోధుల మని, ప్రజల కోసం పోరాటం చేసిన వీరులని ,డబ్బాలు కొట్టుకుంటున్నారు. పైగా వీరికి మద్దతుగా జగన్మోహన్ రెడ్డి క్యాబినెట్లో పనిచేసిన మంత్రులు ప్రెస్ మీట్ లు పెట్టడం విడ్డూరంగా ఉంది, అని చిత్తూరు జిల్లా టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయం

## ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



గిద్దలూరు (చైతన్యరథం): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం శనివారం నియోజకవర్గంలోని గ్రామాల నుండి వచ్చిన ప్రజలతో కోలాహలంగా మారింది. నియోజకవర్గ ప్రజల ఇబ్బందులను, సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి "ప్రజా దర్బార్"కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజల నుండి స్వయంగా అర్జీలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచే నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, పట్టణ పరిధిలోని వార్డుల నుండి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను ఎమ్మెల్యేకు అర్జీలు అందచేసి విన్నవించుకున్నారు. ప్రతి ఒక్క అర్జీదారునితో మాట్లాడి సమస్యను శాంతంగా వింటూ, అర్జీలను స్వీకరించారు. గిద్దలూరు పట్టణం 2వ వార్డుకు చెందిన మహిళలు తమ వార్డులోని నరసింహ స్వామి మెట్లు, జీవన్ టైలర్స్ కాలనీల్లో పైప్ లైన్ వేసి త్రాగునీటి సమస్య తీర్చమని విన్నవించారు. 17 వ వార్డులో సగిలేరు సప్లై ఛానల్ వద్ద పడిపోయిన బ్రిడ్జిని పునః నిర్మించాలని, 60 మీటర్లు సీసీ రోడ్డు వేయాలని స్థానికులు విన్నవించగా వెంటనే గిద్దలూరు కమిషనర్ కు ఫోన్ చేసి సమస్యలను పరిష్కారం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అదే విధంగా పట్టణంలోని అర్బన్ కాలనీలోని సబ్ స్టేషన్ ఫీడర్ పై, హెవీ లోడ్ పడటంతో స్థానికంగా విద్యుత్ సమస్య తరచూ నెలకొంటుందని తెలిపారు. రాచర్ల మండలం, ఆకవీడు గ్రామంలోని ఎస్సి పాలెంలో విద్యుత్ స్థంబాలు అవసరమని ఎమ్మెల్యేకు తెలుపగా సంబంధిత విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి వెంటనే సమస్యలను పరిష్కారం చేయాలన్నారు. కంభం పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో సీసీ రోడ్డు నిర్మించాలని, మరియు రావిపాడు గ్రామంలో పంట కాలువల తూములను మరమ్మత్తులు చేయించాలని విన్నవించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరతగతిన పరిష్కారం చేయాలని ఆదేశాలిచ్చారు. ప్రజా దర్బార్ లో పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, విద్యుత్, తాగునీరు మరియు డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పనతో పాటు వ్యక్తిగత సమస్యల పై ప్రజలు ఎమ్మెల్యేకు అర్జీలు సమర్పించారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో మొత్తం 49 మంది అర్జీదారులు పాల్గొన్నారు.. సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరి సమస్యకు పరిష్కారం లభించాలనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "ప్రజా దర్బార్‌కు వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలిస్తాం. కొన్ని తక్షణ సమస్యల పై సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, అక్కడికక్కడే పరిష్కార మార్గాలను చూపడం జరిగిందని, మిగిలిన సమస్యలను కూడా వీలైనంత త్వరగా పరిష్కరించేలా అధికారులను ఆదేశించారు..

# మహిళలకు రాజకీయ రిజర్వేషన్లు చారిత్రాత్మక నిర్ణయం

## టీడీపీ రాష్ట్ర కార్యదర్శిమూల్పూరి సాయి కళ్యాణి,



హనుమాన్ జంక్షన్ (చైతన్యరథం): మహిళా సాధికారతను బలోపేతం చేసే లక్ష్యంతో, చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే చారిత్రాత్మక నిర్ణయాన్ని చేతలలో చూపిన ఏకైక పార్టీ టీడీపీ అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, విజయవాడ తూర్పు నియోజకవర్గ టీడీపీ పరిశీలకురాలు, మూల్పూరి సాయి కళ్యాణి పేర్కొన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన తెలుగుదేశం పార్టీ నిర్ణయం నేపథ్యంలో శనివారం నాడు సాయి కళ్యాణి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈసందర్భంగా సాయి కళ్యాణి మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతి కోసం మూడు తరాల కృషి చేసారనే దానికి నిదర్శనమే ఆనాడు మహిళలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్, స్త్రీలకు ఆస్తిహక్కును ఎన్టీఆర్ గారు ఇచ్చారని, మహిళలకు విద్య, ఉద్యోగాల్లో 33 శాతం, డ్వాక్రా సంఘాలతో స్త్రీలకు సాధికారతను చంద్రబాబు గారు ఇచ్చారని, నేడు చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ లోకేష్ గారు కల్పించారాని సాయి కళ్యాణి తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు 12 లక్షల డ్వాక్రా గ్రూపులను బలోపేతం చేయడం ద్వారా 1.12 కోట్ల మందికి ఆదాయ మార్గం చూపిందన్నారు. రాష్ట్రంలో 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిది ద్దిందన్నారు. 33 లక్షల మందికి పింఛన్లు, సామాజిక భద్రత, స్త్రీ శక్తి పథకాల ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, 43 లక్షల మందికి తల్లికి వందనం, ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలకు భద్రత కల్పించడంలో టీడీపీ ముందున్నారని తెలిపారు. 2029 సార్వత్రిక ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు, మంత్రివర్యులు, యువనేత నారా లోకేష్ గారు ప్రతిపాదించగా, ఆ నిర్ణయాన్ని పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రివర్యులు, నారా చంద్రబాబు నాయుడు బలపరచడంతో దేశ రాజకీయాల్లోనే చారిత్రాత్మక నిర్ణయంపై చంద్రబాబు, లోకేష్‌కి సాయి కళ్యాణి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# గొడ్డలి పార్టీ నెవర్ అగైన్.... ఎన్డీఏ అగైన్ అండ్ అగైన్ !

దర్శి (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన పిలుపును ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలని దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కోరారు. గొడ్డలి వేటు మళ్లీ పడకూడదని అప్రమత్తతతో వ్యవహరించాలి. చంద్రబాబు పీ4 పథకం అంటే పేదలను ఆదుకోవడం గొడ్డలి పార్టీకి కూడా పీ ఫోర్ ఉందని, అదే పవర్ ప్రాపర్టీ పైసా పార్టనర్ షిప్ అని అన్నారు. ఇలా అడ్డగోలుగా ఆస్తులు సంపాదించి తమ ఖజానాను నింపుకోవడమే గొడ్డలి పార్టీ పీ ఫోర్ గొడ్డలి పార్టీ అధినేత పిఏ గా పనిచేసిన కే నాగేశ్వర్ రెడ్డి, అవినీతి సామ్రాజ్యం సీట్ అధికారుల దర్యాప్తులో బట్టబయలైంది. ఒక సామాన్య కుటుంబానికి చెందిన ఒక చిరు ఉద్యోగి అకౌంట్లో వేలకోట్ల రూపాయలు, నాగేశ్వర్ రెడ్డి భార్య అకౌంట్లో 20 కోట్లు ఎలా వచ్చాయో గొడ్డలి పార్టీ నేతలు సమాధానం చెప్పాలన్నారు. ఇక నాగేశ్వర్ రెడ్డి బ్యాంకు ఖాతాలు ఆస్తులు వివరాలు బినామీ ఖాతాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లో కొనుగోలు చేసిన ఆస్తులు చూస్తే ఎవరైనా అవాక్కవ్వాల్సిందే ఇదంతా కూడా మద్యం అవినీతి సొమ్మేనని సీట్ దర్యాప్తులో బయటపడిందన్నారు. అయితే ఇక్కడ ఒక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే గొడ్డలి పార్టీ అవినీతి అక్రమ ఆస్తులు కేఎన్ఆర్ కొనుగోళ్ల ఆస్తులు దర్శిలో కూడా మూలాలు బయటపడడం గత ఐదేళ్లు దర్శి లో గొడ్డలి పార్టీ అవినీతి అక్రమాలు దోపిడి దౌర్జన్యాలు ఈ సందర్భంగా అర్థమవుతున్నాయన్నారు. సిట్ అధికారుల దర్యాప్తులో కేఎన్ఆర్ ఆస్తుల్లో 10 ఎకరాలు దర్శిలో కూడా కొనుగోలు చేశాడంటే ఇక్కడి గొడ్డలి పార్టీ వారి సహకారం లేకుండా జరుగుతుందా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజల ఆలోచించాలన్నారు. అవినీతి గొడ్డలి పార్టీ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రజల కోసం ప్రజల అభ్యున్నతి కోసం సంక్షేమం సామాజిక న్యాయం మహిళా సాధికారికత ధ్యేయంగా ముందుకు వెళుతున్న కూటమి ప్రభుత్వాన్ని ఆదరించి, అభిమానించాలని ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ కోరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహానాడును స్ఫూర్తిగా తీసుకొని ఐక్యంగా కలిసికట్టుగా దర్శిలో తెలుగుదేశం జెండా ఎగరాలని డాక్టర్ లక్ష్మి పిలుపునిచ్చారు.

# లోకేశ్‌ను ఎదుర్కోలేకనే, జగన్ కట్టుకథలు : ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): “కూటమిప్రభుత్వంలో, టీడీపీలో జెట్ స్పీడ్ తో దూసుకుపోతున్న మంత్రి నారా లోకేశ్ ను రాజకీయంగా ఎదుర్కోవడం అసాధ్యమని తెలిసే.. జగన్, వైసీపీనేతలు డీఎస్సీలో అక్రమాలంటూ కొత్త కట్టుకథలు మొదలుపెట్టారు. జగన్ ఐదేళ్లలో సాధించలేని నిరుద్యోగుల దశాబ్దాల కలను, లోకేశ్ కేవలం 150 రోజుల్లో నిజం చేశారు. 16,347 పోస్టుల భర్తీతో ఉద్యోగాలు పొందిన వారి కుటుంబాల్లో శాశ్వత వెలుగులు నింపారు. తనవల్ల కాని ఇలాంటి అసాధ్యాలను లోకేశ్ ఆచరణ సాధ్యం చేస్తూ, ప్రజల మనసులు గెలుస్తున్నాడన్న అక్కసు, భరించలేని ఈర్ష్య, అసూయతోనే జగన్ డీఎస్సీలో అక్రమాలంటూ గగ్గోలు పెడుతున్నాడు. మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగినట్టు జగన్‌కు పగటి కల వచ్చిందా? లేక ఆయనకు మాత్రమే కనిపించే ఆత్మలేమైనా చెప్పాయా? డీఎస్సీకి సన్నద్ధులై, మోసపోయిన అభ్యర్థులెవరైనా ఆయన్ని కలిసి తగిన సాక్ష్యాధారాలిచ్చి, తమకు అన్యాయం జరిగిందని చెప్పారా? ఏ ఆధారాలతో జగన్.. వైసీపీ నేతలు డీఎస్సీలో అక్రమాలని విషప్రచారం చేస్తున్నారు? వారివద్ద ప్రభుత్వం తప్పుచేసినట్టు సరైన ఆధారాలుంటే, న్యాయస్థానాలను ఆశ్రయించైనా నిరుద్యోగులకు న్యాయం చేయవచ్చు కదా! జగన్ విధానం మొదటినుంచీ అదే. ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ లపై బురదజల్లడం.. తప్పించుకు తిరగడం. అసెంబ్లీకి వచ్చి ప్రజాసమస్యలపై, ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలపై మాట్లాడే ధైర్యం లేని జగన్.. అబద్ధాలు, అసత్యాలతో అడ్డగోలు విమర్శలతో ప్రజల్లో పరపతి పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్నాడు. కేంద్రప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును అమలుచేసినా, చేయకపోయినా పార్టీలో, పదవుల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తామన్న మంత్రి లోకేశ్ నిర్ణయంపై నారీమణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. మహానాడు వేదికపై ప్రకటించిన అనూహ్య నిర్ణయంతో లోకేశ్ మహిళల రియల్ హీరో అయ్యాడు. వెలకట్టలేని, ఎప్పటికీ తరిగిపోని మహిళాభిమానంతో ఆయన తిరుగులేని భావినాయకుడు కానున్నారు. మగువల మనసెరిగి, వారి ప్రేమాభిమానాలు పొందేలా వ్యవహరిస్తున్న లోకేశ్ ఆలోచనావిధానంతో పోలిస్తే.. ఆస్తికోసం తల్లిని, చెల్లిని గెంటేసిన జగన్ ఎందుకు పనికొస్తాడంటూ అక్కచెల్లెళ్లు వైసీపీ అధినేతపై దుమ్మెత్తిపోస్తున్నారు. నా అక్కచెల్లెళ్లు అంటూ నమ్మించి నట్టేటముంచాడని శాపనార్థాలు పెడుతున్నారు.” అని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.



# సమస్యలు సత్వరం పరిష్కరించండి

## అధికారులకు పుట్టపర్తి ఎమ్మెల్యే సిందూరరెడ్డి ఆదేశం

పుట్టపర్తి (చైతన్యరథం): ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రతి అర్జీకి సత్వర పరిష్కారం చూపాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన ప్రజా సమస్యల స్వీకరణ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులతో కలిసి ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించిన అర్జీలను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

# మహిళాసాధికారతకు కట్టుబడిన పార్టీ తెలుగుదేశం

## రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి, అంకెం ఇందిరా ప్రియదర్శిని

మైలవరం (చైతన్యరథం): మహానాడు – 2026 వేదికగా తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ 2029 ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ను పార్లమెంట్ బిల్లుతో సంబంధం లేకుండా అమలు చేస్తామని ప్రకటించడం మహిళా సాధికారత దిశగా ఒక చారిత్రాత్మక నిర్ణయమని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి, ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని అన్నారు. శనివారం 33శాతం రిజర్వేషన్ పై మైలవరంలో నిర్వహించిన ర్యాలీలో అమె మాట్లాడుతూ: మహిళల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంపొందించేందుకు తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి కట్టుబడి ఉందని తెలిపారు. మహానాడు-2026లో నారా లోకేష్ చేసిన 33 శాతం రిజర్వేషన్ల ప్రతిపాదన మహిళలకు నాయకత్వ అవకాశాలు కల్పించే దిశగా ఒక విప్లవాత్మక అడుగని అన్నారు. దేశంలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఇంకా చర్చలు కొనసాగుతున్న తరుణంలో, చట్టబద్ధ అమలుతో సంబంధం లేకుండా పార్టీ పరంగా మహిళలకు 33 శాతం టికెట్లు కేటాయించాలని లోకేష్ ప్రకటించడం మహిళల పట్ల టీడీపీకి ఉన్న నిబద్ధతను చాటుతోందన్నారు. మహానాడు వేదికగా ప్రకటించిన ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందని అన్నారు. మహిళలు కుటుంబ, సామాజిక, ఆర్థిక రంగాల్లోనే కాకుండా రాజకీయ రంగంలో కూడా కీలక పాత్ర పోషించడానికి ఇదోక చారిత్మక నిర్ణయం అన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళు లర్పించారు.




# ఉద్యోగాలు అడిగితే జగన్ రాళ్లతో కొట్టించాడు

## టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి పి చరణ్ సాయి యాదవ్



విజయవాడ ( చైతన్యరథం): రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో టీడీపీ కూటమి ప్రభుత్వం పారదర్శకంగా డీఎస్సీ నియామకాలను నిర్వహిస్తుంటే, వాటిపై వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలు పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవేనని టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి పి. చరణ్ సాయి యాదవ్ మండిపడ్డారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయంలో మాట్లాడుతూ వైసీపీ విద్యార్థి విభాగం నేతల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.డీఎస్సీ నియామక ప్రక్రియ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో అత్యంత పారదర్శకంగా నిర్వహించబడిందని, అర్హులైన వేలాది మంది అభ్యర్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుందని ఆయన పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే ప్రయత్నాలను అభినందించాల్సిన ప్రతిపక్షం, వాటిపై విమర్శలు చేయడం వారి రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని విమర్శించారు.ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువత ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తుచేసిన చరణ్ యాదవ్, ఎన్నికల సమయంలో గొప్పగా ప్రచారం చేసిన జాబ్ క్యాలెండర్ ఏమైందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఐదేళ్ల పాలనలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైసీపీ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.అదే సమయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.“మీరు ఉద్యోగాలు ఇవ్వరు... మేము ఉద్యోగాలు ఇస్తే ఓర్చుకోరు. కడుపు మంటగా ఉంటే ఈనో తాగండి గానీ, నిరుద్యోగుల నెత్తురు తాగకండి!”అంటూ వైసీపీ నాయకులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నిరుద్యోగ యువత భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికిన ఆయన, రాష్ట్రంలో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. డీఎస్సీతో పాటు వివిధ శాఖల్లో ఖాళీల భర్తీ ప్రక్రియను కూడా ప్రభుత్వం వేగవంతం చేస్తోందని తెలిపారు.ఈ సందర్భంగా వైసీపీ విద్యార్థి విభాగం నాయకులకు బహిరంగ సవాల్ విసిరిన చరణ్ సాయి యాదవ్, “గత ఐదేళ్లలో నిరుద్యోగులకు చేసిన మేలు ఏమిటో ప్రజల ముందుకు వచ్చి చర్చించేందుకు సిద్ధమా?” అని ప్రశ్నించారు. రాష్ట్ర యువత ప్రయోజనాల పరిరక్షణలో టీఎన్ఎస్ఎఫ్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పిట్టా చైతన్య, టీ ఎన్ ఎస్ ఎఫ్ సెంట్రల్ నియోజకవర్గ అధ్యక్షులు బి.సతీష్, వడ్లమూడి వంశీ చౌదరి, చింత రవికుమార్, అల్లాడ నాగ విజయ్, మోడీ వెంకట రాజు,కే.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



# కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తా

## ఎమ్మెల్యే సింధూర రెడ్డి హామీ

పుట్టపర్తి (చైతన్యరథం): నాలుగవ తరగతి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం పుట్టపర్తిలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఏపీ ఆర్‌డబ్ల్యూఎస్ 4వ తరగతి ఉద్యోగుల సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి సేవలందిస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని ఎంఎల్‌ఏ పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం ఏజెన్సీల ద్వారా ఉద్యోగులకు అందుతున్న వేతనాల్లో కోతలు లేకుండా, ప్రతి నెలా సక్రమంగా జీతాలు అందే విధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపట్టేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు .అలాగే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ అంశాన్ని కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఎంఎల్‌ఏ పల్లె సింధూర పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఉందని, ఈ అంశంపై కూడా ప్రభుత్వానికి నివేదించి తగిన చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సత్యనారాయణ, మల్లేష్, చంద్రశేఖర్, కిష్టప్ప, రమేష్, శౌంటి కామేశ్వరరావు,కుమార్ తోపాటు తమ సమస్యలు, డిమాండ్లను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని ప్రభుత్వం పరిశీలించేలా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యోగులు, సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. పుట్టపర్తిలో అన్న క్యాంటీన్ ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి. పుట్టపర్తిలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్ పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆహారాన్ని తనిఖీ చేశారు. పేదల కడుపు నింపేందుకు ప్రభుత్వం ఐదు రూపాయలకే అన్న క్యాంటీన్ ద్వారా భోజనాన్ని అందించే బృహత్తరమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. పేదలకు నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందించాలని వారు కోరారు.ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అనంతరం పుట్టపర్తి ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో కొత్తచెరువు చెందిన విజయభాస్కర్ చౌదరి కి రూ. 6 లక్షలు, ఒడిసి కి చెందిన పిట్ట ప్రభాకర్ రెడ్డికి 1లక్షా 60 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక చెక్కులను ఎంఎల్‌ఏ పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. పేదకుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్థికంగా అండగా ఉంటారని హామీ ఇచ్చారు. పేదల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.










## తెలుగు జాతి ఉన్నంత కాలం

# ప్రజల గుండెల్లో ఎన్టీఆర్

**లాస్ ఏంజెల్స్‌లో ఘనంగా ఎన్టీఆర్ జయంతి, మినీ మహానాడు వేడుకలు**

**వర్చువల్‌గా హాజరైన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు**



**లాస్ ఏంజెల్స్ (యూఎస్ఏ):** తెలుగు జాతి మనుగడ ఉన్నంతకాలం తెలుగు ప్రజల హృదయాల్లో అన్న ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. లాస్ ఏంజెల్స్ ఎన్‌ఆర్‌ఐ టీడీపీ ఆధ్వర్యాన ఎన్టీఆర్ జయంతి, మినీ మహానాడు వేడుకలను లాస్ ఏంజెల్స్ ఆరెంజ్ సిటీ తండూరి రెస్టారెంట్‌లో ఘనంగా నిర్వహించారు. లాస్ ఏంజెల్స్ ఎన్‌ఆర్‌ఐ టీడీపీ నాయకులు అట్లూరి శ్రీహరి, హేమకుమార్ గొట్టి, శ్రీధర్ సాతులూరి, వంశీ గరికపాటి, విష్ణు యలమంచి, ప్రతాప్ మెతరమిట్ట, సురేష్ అయినంపూడి, సురేష్ అంబటి, చందు గుత్తికొండ, శ్రీకాంత్ అత్తోటి, కిషోర్ గరికపాటి, వెంకట్ సుంకర నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమానికి కేంద్రమంత్రి జూమ్ ద్వారా హాజరయ్యారు. సుమారు 150 మందికి పైగా టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రవాస తెలుగు ప్రజలు పాల్గొని ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మహానాడు తీర్మానాలు, ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి, ప్రవాస భారతీయుల పాత్ర, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చ జరిగింది. అన్న ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని కేక్ కట్ చేసి తెలుగు జాతికి ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.

**ఏపీకి మరో ఏడు ఎయిర్‌పోర్టులు**

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... 'ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ నేత లోకేష్ నేతృత్వంలో ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి దిశగా పరుగులు తీస్తోంది. వారి కృషితోనే గూగుల్, ఆర్సెలర్ మిట్టల్ వంటి భారీ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును జూలైలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిస్తారు. దీంతో ఉత్తరాంధ్ర ముఖచిత్రం మారబోతోంది. రాష్ట్రంలో కొత్తగా మరో ఏడు ఎయిర్‌పోర్టులు రాబోతున్నాయి. విజయవాడ నుంచి సింగపూర్‌కు ఇప్పటికే డైరెక్ట్ సర్వీసులు ప్రారంభించాం... త్వరలోనే మలేషియా, హాంగ్‌కాంగ్, గల్ఫ్ దేశాలకు కూడా నేరుగా సర్వీసులు ప్రారంభిస్తాం. గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయంలో ఎన్‌ఆర్‌ఐల పాత్ర మరువలేనిది. మీ అందరి సహకారం, ఆశీర్వాదంతో 2029 ఎన్నికల్లో కూడా ఘన విజయం సాధిస్తామ'న్నారు.

**ఎన్‌ఆర్‌ఐలకు వారధిగా ఉంటా: కోమటి జయరాం**

ఉత్తర అమెరికా ప్రత్యేక ప్రతినిధి కోమటి జయరాం మాట్లాడుతూ... 'రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు, యువనేత లోకేష్ చేస్తున్న కృషికి ప్రవాసాంధ్రుల సహకారం అవసరం. ఏపీలో పెట్టుబడులకు ఆసక్తి ఉన్న ఎన్‌ఆర్‌ఐలకు ఎటువంటి సాయం కావాల్సి వచ్చినా నేను వారధిగా ఉంటాను' అని చెప్పారు. టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ... గత సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌ఆర్‌ఐల సహకారంతో విజయదుందుభి మోగించామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా మీ వంతు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ప్రముఖ విశ్లేషకుడు అప్పసాని రాజేష్ మాట్లాడుతూ... ఎన్టీఆర్ జయంతి, మినీ మహానాడు కార్యక్రమాలను ప్రపంచవ్యాప్తంగా చేస్తున్నందుకు సంతోషంగా ఉందని, రాష్ట్రాభివృద్ధికి ఎన్‌ఆర్‌ఐల సహకారం అవసరమన్నారు.

కార్యక్రమంలో లాస్ ఏంజెల్స్‌లోని టీడీపీ అభిమానులు వేణుగోపాల్ జెట్టి, మధు బోడపాటి, రంగరావు నన్నపునేని, యార్లగడ్డ శ్రీనివాస్, మనోహర్ మద్దినేని, రమేష్ మంగా, వై.అనిల్ కుమార్, అచ్చయ్య చౌదరి, రవి పిన్నింటి, శ్రీకాంతి రామినేని, శ్రీకాంతి ఆమినేని, భారతి పెద్ది, వీరా వెంకటసుధీర్ కోనేరు, వేణు గర్నేని, శివనాగ, మనోహర, నేతాజీ గుర్రం, సతీష్ యలవర్తి, సందీప్‌నాయుడు రతినా, రాజ్య రావూరి, వై.విజయ్, వెంకట వాసిరెడ్డి, రూపేష్ నారా, మురళీకృష్ణ, రాహుల్ పోతిన, వి.శ్రీనివాస్, మురళీ స్వర్ణ, పి.రవికుమార్, కె.చిన్న, సి.ఆంజనేయులు, వెంకటప్రసాద్.కె, రవి చుండు, సురేష్ కోటపాటి, ఎస్.అనిల్‌కుమార్, పి.వెంకట్, భారత్ పొట్లూరి, నందన్ పొట్లూరి, సురేష్ కందేపు, సుమంత్ వైదన, వెంకట్ కొలనుపాక, ప్రశాంత్ అల్లాని, వెంకట్ కోరిపెల్ల తదితరులు పాల్గొన్నారు.

## దుబాయ్‌లో ఘనంగా మహానాడు వేడుకలు






**దుబాయ్:** ఏపీఎన్‌ఆర్‌టీస్ చైర్మన్, ఏపీ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ రవికుమార్ వేమూరి ఆధ్వర్యంలో దుబాయ్‌లో మహానాడు వేడుకగా జరిగింది. తెలుగు ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచిన మహా నేత, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు సేవలను నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గుర్తు చేసుకున్నారు. మహానాడు స్ఫూర్తితో ప్రవాస తెలుగువారు మరింత ఐక్యంగా ముందుకు సాగాలని, తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆకాంక్షించారు. జై ఎన్టీఆర్, జై తెలుగుదేశం, జై చంద్రబాబు, జై లోకేష్ నినాదాలు మిన్నంటాయి. కార్యక్రమంలో యూఏఈ టీడీపీ అధ్యక్షుడు మోతుకూరి విశ్వేశ్వరరావు, కోడి రాజా, రవికిరణ్, ప్రసాదు దారపనేని, సునీల్ బోయపాటి, వరప్రసాద్ కందిబేడల (సౌదీ), సాహుల్ సూర్యదేవర, మధుసూదన్ తాళ్లూరి, శివ, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



## బర్మింగ్‌హామ్‌లో ఘనంగా ఎన్టీఆర్ జయంతి





**బర్మింగ్‌హామ్:** 'విశ్వ విఖ్యాత నట సార్వభౌమ' నందమూరి తారక రామారావు 103వ జయంత్యుత్సవాలు అలబామాలోని బర్మింగ్‌హామ్‌లో ఘనంగా జరిగాయి. 'పేదవారికి పట్టెడన్నం పెట్టాలి' అనే అన్న ఎన్టీఆర్ ఆశయాన్ని కొనసాగిస్తూ ద జిమ్మీహేల్ మిషన్ ఆధ్వర్యంలో హోమ్‌లెస్ షెల్టర్‌లో అన్నదానం చేశారు. బాలబాలికలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని స్వయంగా వంట చేయడం, భోజనం వడ్డించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భావి తరాలకు ఎన్టీఆర్ గొప్పతనం, సేవా స్ఫూర్తి, సంస్కారాలను చేరవేసే ఉద్దేశంతో చిన్నారులకు చిత్రలేఖనం, ప్రసంగ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా మన సంప్రదాయాలను, సేవా భావాన్ని భావితరాలకు అందించడం ఎంతో ఆనందంగా ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. పిల్లల్లో సేవా దృక్పథాన్ని పెంపొందిస్తూ ఎన్టీఆర్ ఆశయాలను తదుపరి తరాలకు తీసుకెళ్లడాన్ని అభినందించారు. ఈ కార్యక్రమం విజయవంతానికి సహకరించిన వారికి, బాలబాలికలను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# ఇరాన్‌తో డీల్.. సంతకం పెట్టని ట్రంప్

పశ్చిమాసియాలో యుద్ధ సంక్షోభం ఇప్పుడప్పుడే ముగిసేలా కన్పించట్లేదు. ఇరాన్‌తో కాల్పుల విరమణ పొడిగింపు, హర్మూజ్‌లో దిగ్బంధనం ఎత్తివేతకు సంబంధించిన తాత్కాలిక ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేయలేదు. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు మళ్లీ మొదటికొచ్చినట్లయ్యింది. ఇరాన్‌తో తాత్కాలిక ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకునేందుకు శ్వేతసౌధం సిచ్యువేషన్ రూంలో ట్రంప్ తన సలహాదారులతో సమావేశమయ్యారు. దాదాపు రెండు గంటలపాటు వీరిమధ్య చర్చలు జరిగాయి. అయినప్పటికీ.. ఒప్పందంపై ఎలాంటి పురోగతి లేదు. ఈ డీల్‌పై సంతకం చేయకుండానే ట్రంప్ అక్కడినుంచి వెళ్లిపోయారు. ఈ పరిణామాలపై వైట్‌హౌస్ అధికారి మాట్లాడుతూ.. ఇరాన్‌తో కుదిరే ఏ ఒప్పందమైనా అది అమెరికాకు మేలు చేసేదిగా ఉండాలని, టెహ్రాన్‌పై విధించే ఆంక్షలు, నిబంధనలపై ట్రంప్ సంతృప్తి చెందాలన్నారు. ఆ తర్వాతే అధ్యక్షుడు డీల్‌పై సంతకం చేస్తారన్నారు. ఈ సందర్భంగా ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలు కలిగి ఉండకూడదన్నారు. మరోవైపు, డీల్ విషయంపై అమెరికాతో చర్చలు కొనసాగుతున్నాయని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి



ఇస్మాయిల్ బఘాయీ తెలిపారు. ఇంకా తుది ఒప్పందం ఖరారు కాలేదన్నారు.

**హర్మూజ్‌లో దిగ్బంధనం ఎత్తివేస్తాం: ట్రంప్**

ఇరాన్‌తో కొలిక్కివచ్చిన తాత్కాలిక ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకునేందుకు శ్వేతసౌధం సిచ్యుయేషన్ రూంలో తన సలహాదారులతో ట్రంప్ శుక్రవారం సమావేశాన్ని ఏర్పాటుకు ముందు- 'ట్రూత్ సోషల్'లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని ఉపసంహరించుకుంటామని అందులో పేర్కొన్నారు. ఆ జలసంధిలో అమర్చిన మందుపాతరలను టెహ్రాన్ వెంటనే తొలగిస్తుందని చెప్పారు. ఎన్నటికీ అణ్వస్త్రాలను పొందబోమని ఇరాన్ హామీ ఇవ్వాలని పేర్కొన్నారు.

**ట్రంప్ మాటల్లో అసత్యాలు: ఇరాన్**

ప్రతిపాదిత ఒప్పందం గురించి ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యల్లో కొన్ని సత్యాలతోపాటు అసత్యాలూ ఉన్నాయని ఇరాన్ పేర్కొంది. బేషరతుగా హర్మూజ్‌ను తెరిచేందుకు తాము అంగీకరించినట్టు ఆయన చెప్పిన మాట అబద్ధమేనని పేర్కొంది. తమ పరిశీలనలో ఉన్న ఒప్పందంలో అలాంటి ప్రస్తావనే లేదని స్పష్టం చేసింది. తమ దేశంలో బుషెహర్ ప్రావిన్సులో అమెరికాకు చెందిన ఓ యుద్ధ విమానాన్ని శుక్రవారం కూల్చేశామని ఇరాన్ ప్రకటించింది.

**మళ్లీ యుద్ధం ప్రారంభించే సత్తా ఉంది: హెగ్సెత్**

అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కీలక వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే ఇరాన్‌తో యుద్ధం తిరిగి ప్రారంభించే సత్తా అగ్రరాజ్యానికి ఉందన్నారు. తమ ఆయుధ నిల్వలు నిండుగా ఉన్నాయన్నారు. ఇక, అమెరికా సెంట్రల్ కమాండ్ కూడా కీలక పోస్టు పెట్టింది. పశ్చిమాసియాలో తమ దళాలు అప్రమత్తంగా ఉన్నాయని తెలిపింది. దీంతో ఏ క్షణాన ఏం జరుగుతుందో అనే ఆందోళన నెలకొంది.



# రోమ్‌లో టూరిస్టుపై మూడు రోజులు నరకం

ఇటలీ రాజధాని రోమ్‌లో ఒక విదేశీ పర్యాటకురాలు అనుభవించిన దారుణం యావత్ యూరప్‌ను కలచివేసింది. కొలంబియా దేశానికి చెందిన 32 ఏళ్ల మహిళ పర్యటన కోసం రోమ్‌కు వచ్చింది. ఒక రెస్టారెంట్‌లో ఒంటరిగా భోజనం చేస్తున్న సమయంలో ఒక అపరిచితుడు ఆమెను సంప్రదించాడు. మత్తుపదార్థం కొనాలని ఆమె తాను భావిస్తున్నట్టు ఆ వ్యక్తితో చెప్పింది. ఆ సందర్భాన్ని అతడు తన కుట్రలో భాగంగా మార్చుకున్నాడు. ముందే రెడీగా ఉన్న ముఠా కలిసి ఆమెను నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి, బలవంతంగా వ్యాన్‌లో ఎక్కించారు. వాడకంలో లేని ఒక పాడుబడిన భవనానికి తరలించారు. అక్కడ ఆమె ఫోన్, గుర్తింపు పత్రాలు దోచుకున్నారు. తర్వాత మూడు రోజులపాటు ఆమెను నిర్బంధించి, డ్రగ్స్ ఇచ్చి, బెదిరించి, సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె రక్తంలో నార్కోటిక్స్ ఉన్నట్లు తర్వాత డాక్టర్లు నిర్ధారించారు. అదృష్టవశాత్తు ఒక క్షణం అవకాశం చిక్కడంతో ఆమె తప్పించుకుని పరుగుతీసింది. అర్ధనగ్న స్థితిలో రోడ్డు పక్కన కనిపించిన ఆమెను ఒక వ్యక్తి గమనించి పోలీసులకు తెలిపాడు. వెంటనే ఆస్పత్రికి తరలించారు.

పోలీసులు ఇమ్మిగ్రేషన్ అధికారులతో కలిసి ఆ భవనంపై దాడి చేశారు. అక్కడ సుమారు 22మంది అక్రమ వలసదారులు ఉన్నట్టు తేలింది. కిడ్నాప్, డ్రగ్గింగ్, సామూహిక అత్యాచారం ఆరోపణలపై అయిదుగురిని అరెస్టు చేశారు. మరో 11మంది వలసదారులను డిపోర్టు చేశారు. అరెస్టు అయిన అయిదుగురూ ఆఫ్రికా మూలాలున్న వ్యక్తులే. ఆఫ్రికా నుంచి మధ్యధరా సముద్రం మీదుగా ఇటలీలోకి అక్రమంగా ప్రవేశిస్తున్న వలసదారుల సంఖ్య ఏటా సగటున 66 వేలకు పైగా ఉంటోందని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది. వలసదారులు నేరాలు ఇటలీలో ఒక పెద్ద రాజకీయ వివాదంగా రూపుదిద్దుకుంటున్నాయి. లైంగిక హింస కేసులు విపరీతంగా పెరగడంతో ప్రభుత్వంపై ఒత్తిడి తీవ్రమవుతోంది.

# క్యూబాను చుట్టుముడుతున్న అమెరికా!

**భారీస్థాయిలో యుద్ధ నౌకలు, ఫైటర్ జెట్ల మోహరింపు**

అమెరికా, క్యూబా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో బహుళ మార్గాలనుంచి క్యూబాపై అమెరికా ఒత్తిడి పెంచుతోంది. ఇంధన అడ్డంకులు ఇప్పటికే అమలులో ఉండగా యుద్ధ నౌకలు, నిఘా విమానాలు, ఇతర సైనిక బలగాల మోహరింపును కరీబియన్‌లో అమెరికా ముమ్మరం చేసింది. ఈనెల 20న యూఎస్ఎస్ నిమిట్జ్ క్యారియర్ స్ట్రైక్ గ్రూప్ రాకతో ప్రతిష్టంభన మరింత తీవ్రమైంది. క్యూబా తీవ్రమైన చమురు కొరత ఎదుర్కొంటున్నది. దీనివల్ల దేశవ్యాప్తంగా విద్యుత్తు కోతలు, ప్రజా రవాణాకు అంతరాయం, పారిశ్రామిక కార్యకలాపాలు ప్రభావితమయ్యాయి. ఇప్పటికే ఆర్థిక సంక్షోభం ఒత్తిడిలో ఉన్న క్యూబా ఆర్థిక వ్యవస్థపై ఇది మరింత భారాన్ని మోపింది. రష్యా, చైనాలతో క్యూబాకు ఉన్న సంబంధాల కారణంగా అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇటీవల దానిని జాతీయ భద్రతా ముప్పుగా వర్ణించారు. మరోపక్క యుద్ధం రక్తపాతానికి దారితీస్తుందని, వేలాది



క్యూబన్లు, అమెరికన్లు మరణిస్తారని క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రోడ్రిగ్స్ హెచ్చరించారు. 1959లో జరిగిన క్యూబన్ విప్లవం తర్వాత అమెరికా, క్యూబాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతినడం తెలిసిందే.

# అణు అంచున ఇరాన్!
# అణుబాంబుకు ఎంత దూరం?



అంతర్జాతీయ దౌత్యరంగంలో ఇరాన్ అణు కార్యక్రమం మళ్లీ కేంద్ర బిందువుగా మారింది. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య నెలలుగా సాగుతున్న చర్చలు, యుద్ధం, వైమానిక దాడులు... ఇవన్నీ ఒకే ప్రశ్న చుట్టూ తిరుగుతున్నాయి: ఇరాన్ అణుబాంబుకు నిజంగా ఎంత దూరంలో ఉంది?

**'ధూళి' కాదు -అది 440 కిలోల ముప్పు!**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్ యురేనియం నిల్వలను 'అణు ధూళి'గా అభివర్ణిస్తూ హెచ్చరికలు జారీ చేశారు. కానీ నిపుణులు చెప్పే వాస్తవాలు మరింత ఆందోళనకరంగా ఉన్నాయి. జూన్ 2025నాటికి ఇరాన్ వద్ద 60శాతం స్థాయికి శుద్ధిచేసిన యురేనియం440.9 కిలోలుంది. అణ్వాయుధేతర దేశాల్లో ఇంతస్థాయి యురేనియం ఉత్పత్తి చేసి నిల్వ చేసింది ఇరాన్ ఒక్కటే. ఈ స్థాయి శుద్ధత పౌర అవసరాలకు అవసరమే లేదు. అణ్వస్త్రాల తయారీకి 90 శాతం శుద్ధత కావాలి. అయినప్పటికీ ఇరాన్ మాత్రం తన కార్యక్రమం శాంతియుత లక్ష్యాల కోసమేనని పేర్కొంటోంది. ఐఏఈఏ అంచనా ప్రకారం ఈ నిల్వలతో దాదాపు పది అణుబాంబులు తయారుచేయడానికి సరిపడే ముడిపదార్థం ఇరాన్ వద్ద ఉంది.

**ఆపరేషన్ మిడ్‌నైట్ హామర్ -దాడుల తర్వాత ఏం జరిగింది?**

మే 2025లో ఐఏఈఏ నివేదిక విడుదలైన తర్వాత అమెరికా 'ఆపరేషన్ మిడ్‌నైట్ హామర్' పేరుతో సైనిక చర్య చేపట్టింది. దాడుల అనంతరం వైట్‌హౌస్ ఇరాన్ అణు కేంద్రాలు 'పూర్తిగా నాశనం అయ్యాయ'ని ప్రకటించింది. అయితే ఉపగ్రహ చిత్రాలు చూస్తే క్షిపణి కేంద్రాలు వేగంగా పునర్నిర్మించినా, అణు కేంద్రాల మరమ్మత్తు మందగతిన సాగుతున్నట్టు అర్థమవుతోంది. విశ్లేషకులు ఒక కీలకమైన అంశాన్ని గమనించారు. దాడులకు ముందే ఇరాన్ తన అధికశాతం శుద్ధ యురేనియాన్ని ఇస్ఫాహాన్ కేంద్రానికి తరలించి ఉండవచ్చని సాక్ష్యాధారాలు సూచిస్తున్నాయి.

**శుద్ధి నిలిచిపోయిందా?**

మార్చి 2026లో అమెరికా జాతీయ నిఘా సంచాలకురాలు తుల్సీ గాబ్బర్డ్ సాక్ష్యమిస్తూ ఇరాన్ ఇప్పుడు యురేనియం శుద్ధిని పున:ప్రారంభించలేదని పేర్కొన్నారు. ఇరాన్ రాయబారి కూడా ఇదే విషయాన్ని ధృవీకరించారు. అయితే 440.9 కిలోల 60 శాతం శుద్ధ యురేనియం నిల్వలు ఇరాన్ అదుపులోనే ఉన్నాయి. ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్ ఐఏఈఏ తనిఖీకి పూర్తిగా అడ్డుకుంటోంది. నిఘా కెమెరాలు ఆపేశారు. సీళ్ళు తొలగించారు. అందువల్ల గుప్త శుద్ధి కార్యకలాపాలు జరుగుతున్నాయా అన్నది ధృవీకరించడం అసాధ్యంగా మారింది.

**అణుబాంబుకు ఇంకా ఎంతదూరం?**

60శాతం శుద్ధ యురేనియం చేతిలో ఉంటే బాంబు అతి సులువా? నిపుణులు చెప్పే జవాబు 'అంత సులువు కాదు, కానీ అంత కష్టమూ కాదు' అని. అణుబాంబు తయారీకి కేవలం యురేనియం శుద్ధి చాలదు. యురేనియం హెక్సాఫ్లోరైడ్ వాయువును ముందు లోహరూపంలోకి మార్చాలి. తర్వాత అది 'కోర్'గా రూపొందించాలి. విస్ఫోటక పరికరాలతో అనుసంధానించాలి. ఈ ప్రతి దశకూ ప్రత్యేక సాంకేతిక నైపుణ్యం కావాలి. జూన్ 2025 దాడులవల్ల ఇరాన్‌లో ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని భావిస్తున్నారు. అయినప్పటికీ నిపుణులు అంచనా వేసిన ప్రకారం ఇరాన్ 'బ్రేకౌట్' సమయం -అంటే అణ్వస్త్రానికి సరిపడా 90శాతం శుద్ధ యురేనియం తయారు చేయడానికి పట్టే సమయం -ఇప్పుడు సుమారు 12 వారాలు మాత్రమే. అంటే ఒకసారి ఇరాన్ శుద్ధిని పునఃప్రారంభిస్తే మూడు నెలల్లో ఆయుధ గ్రేడ్ యురేనియం సిద్ధం అవుతుందన్నమాట. 2025 ఏప్రిల్ నుంచీ ట్రంప్ ప్రభుత్వం ఒమన్ మధ్యవర్తిత్వంలో ఇరాన్‌తో మళ్లీ చర్చలు నిర్వహించింది. జూన్ 2025నాటికి ఐదు రౌండ్ల చర్చలు జరిగాయి. ఇరాన్ మట్టసంపు నిల్వలు, శుద్ధిస్థాయిలు, పారదర్శకత చర్యలు -ఇవే ప్రధాన చర్చనీయాంశాలు. తాజాగా టెహ్రాన్‌తో ఒప్పందం 'పెద్దాంశంలో కుదిరింది'ని అమెరికా అధ్యక్షుడు స్వయంగా ప్రకటించారు. హర్మూజ్ జలసంధి తెరవడం, అణు చర్చలు ప్రారంభించడం -ఈ రెండూ ప్రతిపాదిత అవగాహనా ఒప్పందంలో ఉన్నాయి. అయినా అడ్డంకులు తొలగినట్టు కాదు. ట్రంప్ స్పష్టం చేస్తున్న దాన్నిబట్టి.. అత్యధిక స్థాయి శుద్ధ యురేనియం అప్పగించినా దానికి బదులు ఆంక్షల తొలగింపు ఉండదు.

**5 శాతం నిల్వలు -మరో ముప్పు?**

60 శాతం శుద్ధ యురేనియంతోపాటు ఇరాన్ వద్ద 5 శాతం శుద్ధ యురేనియం 6,024 కిలోలకు పైగా ఉంది. అధునాతన సెంట్రిఫ్యూజులు తయారుచేసే నైపుణ్యం ఇరాన్‌కు అలవడింది కనుక భవిష్యత్తులో ఈ నిల్వలను కూడా మరింత శుద్ధిచేయడానికి సాంకేతికంగా అడ్డు లేదు.

**సమతుల్యత చెదిరే స్థితి**

ఇరాన్ అణుబాంబు తయారీకి ఒక్క అడుగు వేస్తే చాలు అన్న స్థితికి చేరిందా? నిపుణులు 'అంచున ఉంది' అని చెబుతున్నారు. అణ్వస్త్ర నిర్మాణానికి సాంకేతిక అడ్డంకులు ఇంకా కొన్ని ఉన్నాయి. ఐఏఈఏ తనిఖీ లేకుండా గుప్తంగా ఏం జరుగుతోందో తెలియడం లేదు. దౌత్య చర్చలు ఒడిదొడుకుల మధ్య సాగుతున్నాయి. హర్మూజ్ జలసంధి తెరుచుకోవాలన్నా, మధ్యప్రాచ్యంలో శాంతి నెలకొనాలన్నా -ఆ 440 కిలోల 'ధూళి' ప్రశ్నకు జవాబు తొందరలోనే దొరకాల్సి ఉంది!

స్పోర్ట్స్

చైతన్యరథం

# సన్ రైజర్స్ ఆల్‌టైమ్ రికార్డు బ్రేక్



హైదరాబాద్: క్వాలిఫయర్ 2లో గుజరాత్ టైటాన్స్ చేతిలో ఓటమితో ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ పోరాటానికి తెరపడింది. నిన్న ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో గుజరాత్ చేతిలో రాజస్థాన్ రాయల్స్ ఓడి.. మరోసారి ఫైనల్‌కు చేరకుండానే ఇంటిముఖం పట్టింది. రియాన్ పరాగ్ కెప్టెన్సీలోని రాయల్స్ జట్టు బ్యాటింగ్ పరంగా రాణించినప్పటికీ, బౌలింగ్‌లో మాత్రం దారుణంగా విఫలమైంది. అయితే ఈమ్యాచ్‌లో ఆర్ఆర్ జట్టు ఓటమిపాలైనప్పటికి ఓ అరుదైన రికార్డును తమ పేరిట లిఖించుకుంది. ఒక ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన జట్టుగా రాజస్థాన్ చరిత్ర సృష్టించింది. ఈ సీజన్‌లో ఆర్ఆర్ జట్టు ఏకంగా 181 కొట్టింది. గతంలో ఈ రికార్డు సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు పేరిట ఉండి. ఆ జట్టు 2024 సీజన్‌లో 178 సిక్సర్లు కొట్టింది. ఆ రికార్డును తాజాగా రాజస్థాన్ రాయల్స్ బ్రేక్ చేసింది. ఇక్కడ మరో విశేషం ఉంది. రాజస్థాన్ రాయల్స్ కొట్టిన మొత్తం 181 సిక్సర్లలో, చిచ్చర పిడుగు వైభవ్ సూర్యవంశీ ఒక్కడే 72 సిక్సర్లు బాదాడు. ఈ క్రమంలోనే ఒక ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాడిగా 'యూనివర్స్ బాస్' క్రిస్ గేల్ (59 సిక్సర్లు, 2012) రికార్డును ఈ 15 ఏళ్ల యువ కెరటం బద్దలు కొట్టాడు. వైభవ్ తర్వాత ఆర్ఆర్ జట్టులో అత్యధిక సిక్సర్లు బాదిన వారిలో ధ్రువ్ జురెల్ 24, డొనవాన్ ఫెరీరా 23, రియాన్ పరాగ్ 21 ఉన్నారు.

# రూ1.10 కోట్ల పెట్టుబడి..
# రూ.34 కోట్లకు పైగా ఫలితం!



రాజస్థాన్: అత్యద్భుతమైన బ్యాటింగ్‌తో ఈ ఐపీఎల్ సీజన్లో అదరగొట్టిన వైభవ్ సూర్యవంశీ.. రాజస్థాన్ రాయల్స్‌కు భారీ విలువను చేకూర్చాడు. గతేడాది రూ.1.1 కోట్లు చెల్లించి వైభవ్‌ను సొంతం చేసుకున్న ఆర్ఆర్.. ఈ సీజన్‌లో అతడి ఆట ద్వారా రూ.34.97 కోట్లు పొందినట్టు విశ్లేషకులు అంచనా వేశారు. అంటే అతడికి చెల్లించిన మొత్తం పోనూ.. రూ.33.87 కోట్లు అన్నమాట. బాల్-బై-బాల్ డేటా ఆధారంగా ప్రత్యేక ప్లేయర్ ఇంపాక్ట్ మోడల్ ప్రకారం ఈ గణాంకాలను రూపొం దించినట్టు తెలుస్తోంది. వైభవ్ తన ఆటతీరుతో ప్రతి రూపా యికి రూ.31.79 విలువను ఆర్ఆర్ జట్టుకు అందించినట్లు ఈ గణాంకాల ద్వారా స్పష్టమవుతోంది.

అత్యధిక లాభం అందించి న ఆటగాళ్ల జాబితాలో వైభవ్ మూడో స్థానంలో నిలిచాడు. అతని కంటే ముందున్న శుభ్‌మన్ గిల్(రూ.16.5 కోట్లు), రజత్ పాటిదార్(రూ.11 కోట్లు)కు ఆయా ఫ్రాంచైజీలు భారీ ధరలు వెచ్చించినప్పటికీ.. వైభవ్ మాత్రం తక్కువ పెట్టు బడితో ఎక్కువ లాభాలను అందించాడు. ఇక జీటీ కెప్టెన్ శుభ్‌మన్ రూ.35.14 కోట్లు తెచ్చిపెట్టగా, ఆర్సీబీ సారథి పాటిదార్ రూ.35.06 కోట్లు సాధించేలా చేశాడు. మరోవైపు.. రిషబ్ పంత్(రూ.27 కోట్లు), నికోలస్ పూరన్ (రూ.21 కోట్లు), యుజ్వేంద్ర చాహల్ (రూ.18 కోట్లు), జస్ప్రీత్ బుమ్రా (రూ.18 కోట్లు) ఈ సీజన్‌లో తమ ఫ్రాంచైజీలకు నష్టాలను మిగిల్చారు. ఇక.. 16 మ్యాచ్‌ల్లో 776 పరుగులు చేసిన సూర్యవంశీ.. అందులో 521 పరుగులను పవర్‌ప్లే ఓవర్లలోనే సాధించడం విశేషం. ప్రత్యర్థి బౌలర్లపై ఆరంభం నుంచే ఆధిపత్యం చెలా యించడం ఈ బుడ్డోడి ప్రత్యేకత. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 36 బంతుల్లో శతకం సాధించి ఐపీఎల్ చరిత్రలో మూడో వేగవం తమైన సెంచరీ నమోదు చేశాడు. అదే జట్టుపై ఎలిమినేటర్‌లో 29 బంతుల్లో 97 పరుగులతో చెలరేగి.. తమ జట్టు క్వాలిఫ యర్‌కు అర్హత సాధించేలా చేశాడు.

ఇక.. ఈ సీజన్‌లో వైభవ్ పుల్‌షాట్ ప్రత్యేకాకర్షణగా నిలిచిందని విశ్లేషకులు చెబుతు న్నారు. ఆ షాట్‌తో 20 సిక్సర్లు బాదిన ఈ చిచ్చర పిడుగు.. ఒక్కసారి మాత్రమే అలాంటి షాట్‌కు ఔటయ్యాడు. అతడు ఎదు ర్కొన్న 44 మంది బౌలర్లలో 31 మందిని సిక్సర్లతో శిక్షించడం, వారిలో ఎనిమిది మంది బౌలింగ్‌లో ఎదుర్కొన్న తొలి బంతికే సిక్సర్ బాదడం అతడి దూకుడుకు నిదర్శనం. కాగా.. 13 ఏళ్ల వయసులో ఐపీఎల్‌లో అడుగుపెట్టిన ఈ యువ సంచలనం.. భవిష్యత్తులో జరిగే మెగా వేలంలో రూ.15-18 కోట్లకు పైగా ధర పలికే అవకాశముందని క్రికెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# కప్ కోసం నువ్వానేనా?

### నేడే ఐపీఎల్ ఫైనల్ - ఆర్‌సీబీ, గుజరాత్ రెఢీ

ముల్లన్‌పూర్: ఐపీఎల్-19వ సీజన్ ఫైనల్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ సిద్ధమయ్యాయి. మూడోసారి ఫైనల్లోకి అడుగుపెట్టిన గుజరాత్ ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగే ఆఖరిపోరులో ఆర్‌సీబీతో తలపడనుంది. ఊపుమీదున్న బెంగళూరును గుజరాత్ ఎదుర్కొంటుందా లేదా అన్నది ఇంకొన్ని గంటల్లో తేలనుంది. గత సీజన్‌లో బెంగళూరు విజేతగా విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. వరుసగా రెండో సారి కప్ కొట్టాలని కోహ్లి సేన భావిస్తోంది.



గత ఐపీఎల్ ఫైనల్‌లో పంజాబ్‌తో తలపడిన బెంగళూరు 190 పరుగులు చేసింది. పంజాబ్ సూపర్‌కింగ్స్‌ను 184 పరుగులకే పరిమితం చేసింది.

# కామన్వెల్త్ చెస్ విజేత శరణ్య



హైదరాబాద్: కామన్వెల్త్ యూత్ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలుగమ్మాయి శరణ్య దేవి నరహరి మూడు పతకాలతో సంచలనం సృష్టించింది. శ్రీలంకలోని కలుతరలో జరిగిన ఈ పోటీల్లోని అండర్-18 క్లాసికల్, ర్యాపిడ్, బ్లిట్జ్ మూడు విభాగాల్లోనూ గుంటూరుకు చెందిన ఈ ఫిడే మాస్టర్ విజేతగా నిలవడం విశేషం.



## వైభవ్ సూర్యవంశీ తదుపరి మ్యాచ్ ఎప్పుడంటే?

రాజస్థాన్: వైభవ్ సూర్యవంశీ.. ఐపీఎల్ 2026లో ఎక్కువగా వినిపించిన పేరు ఇదే. క్రికెట్ దిగ్గజాలు కోహ్లి, ధోనీల పేర్లను సైతం మర్చిపోయేలా తన ఆటతో ఈ చిచ్చర పిడుగు ప్రేక్షకులను కట్టి పడేశాడు. ఈ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఈ 15 ఏళ్ల యువ సంచ లనం అనేక రికార్డు లు తన పేరిట లిఖించుకున్నాడు. వైభవ్ సూర్యవంశీ తన తదుపరి మ్యాచుల ప్రయా ణాన్ని జూన్ నుంచే ప్రారంభించబోతున్నాడు. శ్రీలంకలో జరగనున్న ముక్కోణపు సిరీస్ కోసం ప్రకటించిన భారత్-ఎ జట్టులో వైభవ్‌కు చోటు దక్కిన సంగతి తెలిసిందే. వన్డే ఫార్మాట్‌లో జరగనున్న ఈ టోర్నీలో ఇండియా-ఎ జట్టుతో పాటు శ్రీలంక-ఎ, ఆఫ్ఘనిస్తాన్-ఎ జట్లు తలపడనున్నాయి. ఈ సిరీస్‌కు యంగ్ ప్లేయర్ తిలక్ వర్మ కెప్టెన్‌గా వ్యవహరించబోతున్నాడు. ఈ సిరీస్ షెడ్యూల్ ప్రకారం జూన్ 9న శ్రీలంక-ఎ జట్టుతో ఇండియా-ఎ తన మొదటి మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్‌లో వైభవ్ ఆటను క్రికెట్ ప్రియులు మరో సారి చూడొచ్చు. ఆ తర్వాత జూన్ 11న ఆఫ్ఘని స్తాన్-ఎ, జూన్ 15న మళ్లీ శ్రీలంక-ఎ, జూన్ 17న మరోసారి ఆఫ్ఘనిస్తాన్-ఎ జట్లతో తలపడనుంది. ఈ మ్యాచ్‌లన్నీ భారత కాలమానం ప్రకా రం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతాయి. జూన్ 21న ఈ టోర్నీ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. మొత్తంగా ఐపీఎల్‌లో రాజస్థాన్ తరఫున చెలరేగినా ఈ 'బేబీ బాస్' త్వరలోనే ఇండియా-ఎ జెర్సీలో మరోసారి అదరగొట్టేందుకు సిద్ధమవుతున్నాడు.

**ఇండియా-ఎ జట్టు:**

తిలక్ వర్మ (కెప్టెన్), ప్రియాన్ష్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, రియాన్ పరాగ్ (వైస్ కెప్టెన్), ఆయుశ్ బదోని, నిషాంత్ సింధు, సూర్యాంశ్ షెడ్గే, ప్రభుసిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), కుమార్ కుశాగ్ర, విప్రజ్ నిగమ్, యశ్ ఠాకూర్, యుధ్‌వీర్ సింగ్, అర్షద్ ఖాన్, అన్షుల్ కాంబోజ్, అనుకుల్ రాయ్

## పూజ 'రికార్డు' జంప్



హాంకాంగ్: ఆసియా అండర్-20 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత టీనేజ్ సంచలనం పూజా సింగ్ హైజంప్‌లో 14 ఏళ్ల జాతీయ రికార్డును బద్దలుకొట్టింది. హరియాణాకు చెందిన 19 ఏళ్ల పూజ 1.93 మీటర్లు లంఘించి సీనియర్ స్థాయిలో రికార్డును నెలకొల్పింది. ఈ క్రమంలో 2012లో సహనా కుమారి నమోదు చేసిన 1.92 మీటర్ల రికార్డును అధిగమిం చింది. ఇదే టోర్నీలో 5వేల మీటర్ల రేస్ వాక్‌లో నితిన్, డిస్కస్ త్రోలో అమానత్, డెకాథ్లాన్‌లో రాహుల్ పసిడి, ఉప్‌కార్ రజ తం, ట్రిపుల్ జంప్‌లో సాధనా దేవి రజతం, 400 మీటర్ల రేసులో నీరూ పాఠక్ కాంస్యం నెగ్గారు.

## రెజ్లింగ్ ట్రయల్స్‌లో ఓటమిపాలైన వినేశ్



ఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగిన ఆసియా క్రీడల ఎంపిక ట్రయల్స్‌లో ఓటమి పాలయ్యారు. మహిళల 53 కేజీల విభాగం సెమీఫైనల్స్‌లో ఆమె మీనాక్షి గోయత్ చేతిలో 4-6 తేడాతో పరాజయం చెందారు. ఈ ఓటమితో వినేశ ఫొగాట్ ఆసియా క్రీడల 2026 ఎంపిక ట్రయల్స్ నుంచి నిష్క్రమించింది. ట్రయల్స్‌లో బాగా రాణించి.. అంతర్జాతీయ స్థాయిలో పునరాగమనం చేయాలన్న వినేశ్ ఆశలకు, అలాగే ఈ ఏడాది చివర్లో జపాన్‌లోని ఐచి నగోయాలో జరగనున్న ఆసియా క్రీడలలో స్థానం సంపాదిం చుకోవాలన్న ఆమె అవకాశాలకు ఈ ఓటమి గండికొట్టింది. గత మ్యాచ్‌లో నిషతో హోరాహోరీగా జరిగిన బౌట్‌లో వినేశ్ తనకున్న ఎన్నో ఏళ్ల అనుభవాన్ని ఉపయోగించి విజయం సాధించి సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నారు. ఫైనల్ ముంగిట ఆమెకు మీనాక్షి చేతిలో పరాజయం ఎదురైంది.

# 'పెద్ది'ని ఆదరించండి



స్టార్‌డమ్‌ను వదిలి ప్రజా సేవకు నటుడు విజయ్ రాజకీయాల్లోకి రావడం హర్షణీయమని కథానాయకుడు రామ్‌చరణ్ అన్నారు. బుచ్చిబాబు దర్శకత్వంలో ఆయన నటించిన తాజా చిత్రం 'పెద్ది'. జూన్ 4న పాన్ ఇండియా మూవీగా విడుదల కానుంది. జాన్వీకపూర్ కథానాయిక. చిత్ర ప్రచారంలో భాగంగా చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో రామ్‌చరణ్, దర్శకుడు బుచ్చిబాబు, నటుడు శివరాజ్‌కుమార్, సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ మాట్లాడతూ... "సీఎం జోసెఫ్ విజయ్‌ని చూసి సినీ ఇండస్ట్రీకి చెందిన వ్యక్తిగా నేను ఎంతో గర్వపడుతున్నా. విజయ్‌తో పాటు తమిళనాడు ప్రజలకు శుభాకాంక్షలు. చెన్నై వచ్చినప్పుడల్లా సొంత ఊరికి వచ్చినట్లు అనిపిస్తుంది. మా కుటుంబానికి ఈ నగరంతో ఎంతో అనుబంధం ఉంది. 'పెద్ది' కోసం మేమంతా రెండున్నరేళ్లు కష్టపడ్డాం. నేను 285 రోజులు షూటింగులో పాల్గొన్నా. మా దర్శకుడు బుచ్చిబాబు అయితే.. ఐదారేళ్లు కష్టపడ్డాడు. ఏఆర్ రెహమాన్ అద్భుతమైన పాటలు ఇచ్చారు. గత పది, పదిహేను రోజులుగా నిర్విరామంగా పనిచేస్తూనే ఉన్నారు. శివన్న తెరపై కనిపిస్తే ఒక ఫైర్ వచ్చినట్టు అనిపిస్తుంది. 'జైలర్'లో ఆయన ప్రజెన్స్ గూస్బంప్స్ వచ్చేలా ఉంటుంది. కళ్లతోనే హావభావాలు, నటన పలికిస్తారు. "రోబో" సహా ఎన్నో అద్భుతమైన సినిమాలకు రత్నవేలు పనిచేశారు. ఆయన ప్రతి ఫ్రేమ్ అద్భుతంగా ఉంటుంది. ఈ సినిమాకు ఆయన అనుభవం ఎంతో పనికొచ్చింది.. దివ్యేందు, నేను ఒకే ఎత్తు ఉన్నా, సినిమాలో మా యాటిట్యూడ్ అరున్నర అడుగులపైనే ఉంటుంది. ఈ సినిమాను కష్టంతో కాదు, ఇష్టంతో చేశాం. 'పెద్ది' కోసం మూడు ఆటలు ఆడటమే కాదు. అందుకు తగినట్లు మారడం కష్టమే. కానీ, బుచ్చి స్క్రిప్ట్ డిమాండ్ అలాంటిది. 'పెద్ది' మూవీ ఇండస్ట్రీ గర్వపడేలా చేస్తుంది. ఇదొక బ్యూటిఫుల్ ఎంటర్టైనర్. చిన్న సందేశం కూడా ఉంటుంది. ఇక మా హీరోయిన్ జాన్వీకపూర్ నిబద్ధత కలిగిన నటి. తల్లి వారసత్వాన్ని తప్పక కొనసాగిస్తుంది. తెలుగు వారిలాగానే తమిళ ప్రజలకు సినిమాలంటే ఎంతో ఇష్టం. సినిమా థియేటర్లు, హోటళ్లు అన్నీ ఎంతో క్లీన్ ఉంటాయి. అలాగే మా సినిమాను కూడా ఆదరించండి" అని రామ్‌చరణ్ కోరారు.

# దాసరికి మనోజ్ నిజమైన నివాళి



దిగ్గజ దర్శకుడు దాసరి నారాయణ రావు సమాధి దుస్థితిపై కొన్ని రోజులుగా సోషల్‌మీడియాలో వార్తలు వైరలైన విషయం తెలిసిందే. ఓ నెటిజన్ షేర్ చేసిన వీడియోకు మంచు మనోజ్ స్పందించి, దాన్ని శుభ్రం చేస్తానని అన్నారు. అన్న మాట ప్రకారం శనివారం తనటీంతో కలిసిసమాధి వద్దకు చేరుకున్న ఆయన.. ఆ ప్రాంగణంలో ఉన్న చెత్తా చెదారాన్ని స్వయంగా తొలగించారు."సమాధి దుస్థితి చూసి చాలా బాధేసింది. ఇక్కడకు వచ్చి మూడేళ్లవుతోంది. అప్పుడు కూడా ఇలానే ఉంటే శుభ్రం చేశాం. సోషల్ మీడియాలో వైరలైన వీడియో నాకు మా టీమ్ శుక్రవారం రాత్రి షేర్ చేసింది. ఈరోజు ఉదయాన్నే వచ్చి క్లీన్ చేసి షూటింగు వెళ్లాలని నిర్ణయించుకున్నా" అని మనోజ్ చెప్పారు. ఈరోజు దాసరి నారాయణ రావు వర్ధంతి కావడంతో విగ్రహం వద్దకు వెళ్లి దండం పెట్టుకోవాలను కున్నానని కానీ, వీడియో చూసి సమాధి వద్దకు వచ్చినట్టు చెప్పారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి నివాళులర్పించారు.




# సేవ్ ద టైగర్స్-3 స్ట్రీమింగ్‌కు రెడీ

తెలుగు ఓటీటీ ప్రేక్షకులను ఎంతగానో అలరించిన పాపులర్ వెబ్ సిరీస్ 'సేవ్ ది టైగర్స్' ఇప్పుడు మూడో సీజన్‌తో అలరించడానికి సిద్ధమైంది. మొదటి రెండు సీజన్లు సాలిడ్ వ్యూయర్‌షిప్‌తో సూపర్ హిట్ అవ్వగా, ఈసారి అంతకుమించిన ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఈ క్రేజీ సిరీస్ రాబోతోంది.ఇందులో ప్రియదర్శి, అభినవ్ గోమఠం, కృష్ణ చైతన్య ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సరికొత్త సీజన్‌కు సంబంధించిన క్రేజీ ట్రైలర్‌ను జీయో హాట్‌స్టార్ విడుదల చేసింది. ఈసారి కథలో సరికొత్త డైమెన్షన్‌ను జోడించారు. ముఖ్యంగా కమెడియన్ వెన్నెల కిషోర్ 'ఇంద్రుడి' పాత్రలో ఎంట్రీ ఇచ్చి, ప్రధాన పాత్రధారుల కష్టాలను తీర్చేందుకు రావడం.. ఆపై జరిగే గందరగోళం, నవ్వులు ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచాయి. ఈ సిరీస్ జూన్ 19నుండి పలు భాషల్లో డిజిటల్ స్ట్రీమింగ్ కానుంది. ఈ సక్సెస్‌ఫుల్ సిరీస్‌కు 'యాత్ర' ఫేమ్ మహి వి. రాఘవ్, ప్రదీప్ అద్వైతం క్రియేటర్స్ గా వ్యవహరిస్తున్నారు. శ్రీరామ్ యెగరం దర్శకత్వం వహిస్తున్న సిరీస్‌ను శివ మేక, సాహితి చింతలపూడి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మూడో సీజన్‌లో జోర్దార్ సుజాత, పావని గంగిరెడ్డి, దేవయాని శర్మ, రోహిణి తదితరులు కీలక పాత్రల్లో సందడి చేయనున్నారు.

# ఇరుముడిలో రవితేజ సర్‌ప్రైజ్!



మాస్ మహారాజ రవితేజ హీరోగా ప్రియా భవాని శంకర్ హీరోయిన్‌గా దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న అవైటెడ్ డివోషనల్ కం ఎమోషనల్ డ్రామా 'ఇరుముడి'. మంచి బజ్‌ని మొదటినుంచీ సెట్ చేసుకున్న చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతుంది. అయితే ఈ సినిమాలో మాస్ మహారాజ్‌నుంచి ఒక ఊహించని సర్‌ప్రైజ్ కూడా ఉన్నట్టు సినీవర్గాల నుంచి కన్ఫర్మ్ అయ్యింది. అతి త్వరలోనే సినిమా తాలూకా గ్లింప్స్‌ని మేకర్స్ రిలీజ్‌చేయడానికి ఫిక్స్ అయ్యారు. అయితే ఇందులో రవితేజ నుంచి మాత్రం ఒక ఊహించని సర్‌ప్రైజ్ ఉండబోతుందట. తన లుక్ సహా పెర్ఫామెన్స్‌లు కూడా ఇందులో ఊహాతీతంగా ఉంటాయని తెలుస్తుంది. సో రవితేజనుంచి గట్టి కంబ్యాక్‌నే ఇపుడు రాబోతుందని చెప్పవచ్చు. ఇక ఈ చిత్రానికి జీవి ప్రకాష్‌కుమార్ ఒక సెన్సేషనల్ ఆల్బమ్‌ని అందిస్తుండగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నారు.



# హీరో అజిత్‌కు మాతృవియోగం

తమిళ సినిమా మాత్రమే కాదు, దక్షిణాది సినిమా దగ్గర మంచి స్టార్డం ఉన్న హీరోస్‌లో స్టార్ నటుడు థలా అజిత్ కుమార్ ఒకరు. అయితే సినిమాలు మాత్రమే కాకుండా రియల్ లైఫ్‌లో కూడా సాహసోపేత కార్యక్రమాలు ఎన్నో తాను చేశారు. ఇలా ప్రస్తుతం తనకి ఎంతో ఇష్టమైన రేసింగ్ లైఫ్‌లో తాను బిజీగా ఉండగా ఓ షాకింగ్ న్యూస్ ఇప్పుడు అజిత్ ఫ్యాన్స్‌ని తమిళ సినీ ప్రముఖుల్ని దిగ్భ్రాంతికి లోను చేసింది. అజిత్ మాతృమూర్తి మోహిని మణి ఇవాళ ఉదయం తుది శ్వాస విడిచినట్టు కోలీవుడ్ వర్గాలు కన్ఫర్మ్ చేసాయి. దీనితో అజిత్ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. అయితే మోహిని మణి తన వయసు సంబంధించిన సమస్యలతోనే చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తన 85వ ఏట తుది శ్వాస విడిచినట్టు తెలుస్తుంది. ఈ వార్త విన్న కోలీవుడ్ సినీ ప్రముఖులు అన్నామలై, కమల్ హాసన్, ఎంకె స్టాలిన్ తదితరులు విచారం వ్యక్తం చేస్తూ ఆమె పవిత్ర ఆత్మకి శాంతి చేకూరాలని నివాళి అర్పించారు.

# టాక్సిక్ సెట్‌లో హాయ్‌లు, హలోలు లేవు..!

యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న భారీ చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. ఈ సినిమాలో కియారా అద్వాణీ ఒక కీలక పాత్రలో నటిస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె.. టాక్సిక్ సెట్లో తన అనుభవాన్ని పంచుకున్నారు. సెట్లోకి



అడుగుపెట్టగానే ఎవరికీ 'హాయ్, హలో' చెప్పొద్దని దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తనకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని నటి వెల్లడించారు. "గీతూ ఒకసారి నాకు ఫోన్ చేసి.. 'రేపు నువ్వు సెట్‌కి రాగానే పూర్తిగా ఆ పాత్రలోనే ఉండాలి' అని అన్నారు. సాధారణంగా నేను సెట్లోకి రాగానే అందరినీ పలకరిస్తూ హాయ్, ఎలా ఉన్నారు, గుడ్ మార్నింగ్ అని చాలా ఉత్సాహంగా మాట్లాడే మనిషిని. కానీ ఆమె మాత్రం.. 'ఎలాంటి మర్యాదలు, పలకరింపులు వద్దు. నువ్వు నేరుగా ఆ క్యారెక్టర్ జోన్లోకి వచ్చేయాలి. నీ టీంతో సహా ఎవరికీ హాయ్, హలో చెప్పడానికి వీల్లేదు. పూర్తిగా నీ పాత్రకు సంబంధించే ఆలోచించాలి' అని చెప్పారు. ఆమెకు ఉన్న నిబద్ధత చూసి ఆశ్చర్యపోయా" అని కియార తెలిపారు. ఈ సినిమాలో తన పాత్ర కోసం కన్నడలో మాట్లాడటం కూడా తనకో పెద్ద సవాలుగా మారిందని కియార అన్నారు. ఎందుకంటే ఒకే సీన్‌ను మొదట ఇంగ్లిష్‌లో, తర్వాత కన్నడలో షూట్ చేసేవారని తెలిపారు. షూటింగుకు ముందు రోజు రాత్రంతా కూర్చుని డైలాగులను బట్టీ పట్టాల్సి వచ్చేదని చెప్పారు. ఇక ఇందులో యశ్‌తో పాటు ఐదుగురు హీరోయిన్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజిబెత్, నయనతార గంగ పాత్రలో, రెబెకాగా తారా సుతారియా అలరించనున్నారు. మెలిసా అనే పాత్రలో రుక్మిణి వసంత్ నటిస్తున్నారు.